


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

ఆ న్యాయవాదిని వదిలేయడం న్యాయవ్యవస్థకు నష్టం 06
ఫిలిప్పీన్స్‌లో భూకంపం 02
విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ తక్షణం విరమించాలి 05

సంపుటి 08, సంచిక: 310 | శనివారం | 11-10-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## నక్సల్స్ లొంగుబాటు

● డిజిపి ఎదుట లొంగిపోయిన ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ● ఈ ఏడాది 412కు చేరిన సంఖ్య ● ఇంకా అజ్ఞాతంలో 72 మంది మావోయిస్టులు ● పునరావాస ప్రయోజనాలు కల్పిస్తాం: డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు శుక్రవారం తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిశారు. లొంగిపోయిన వారిలో సిద్ధిపేట జిల్లాలోని మద్దూర్ మండలం, కూటిగల్ గ్రామ వాస్తవ్యుడు కుంకటి వెంకటయ్య అలియాస్ రమేష్ అలియాస్ వికాస్ (52), హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం, తాటికాయల గ్రామంకు చెందిన మొగిలిచెర్ల వెంకటరాజు అలియాస్ ఎర్ర రాజు అలియస్ చందు చంద్ర పున్నం చంద్ర్ అలియాస్ సట్ల బాలరాజు (45), ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ధర్మపేట గ్రామానికి చెందిన చెందు భార్య తోడెం గంగ అలియాస్ గంగవ్వ అలియాస్ సోనీ (42)లు ఉన్నారు. ఈ సందర్భంగా తన కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐబి చీఫ్ తరువాయి 2లో



# నేరం బిజెపిదే


● ఆ పార్టీ తగినమూల్యం చెల్లించుకోవాల్సిందే ● బిసి రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్రపతి, ప్రధాని వద్దకు తీసుకువెళ్లాలి ● జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలి ● రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ సూచన ● బిసి రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటే బిజెపి వ్యతిరేకించినట్టే : కూనంనేని ● ప్రజాభిప్రాయాన్ని కేంద్రానికి తెలిపి ఆమోదింపచేయాల్సిన బాధ్యత గవర్నర్‌దే : పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీలోని ప్రధానమంత్రి, రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్ వద్ద ధర్నా నిర్వహించాలన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కేంద్రంలోని బిజెపిదే పూర్తి బాధ్యత అని, బిసి రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటే, ఈ రిజర్వేషన్లను బిజెపి కూడా వ్యతిరేకించినట్టేనని విమర్శించారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. 'బిసిల రిజర్వేషన్ల' నేరం బిజెపిదేనని, దీనికి తగిన మూల్యాన్ని ఆ పార్టీ చెల్లించుకోవాల్సిందేనని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ నేరానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బిఆర్ ఎస్ మద్దతునిస్తుందని,ఇందుకు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలే బాధ్యత వహించాలన్నారు. రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు చిత్ర విచిత్రంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం విచారకరమని, కోట్లాది మంది ఆవేదనను, బాధను, ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ వద్ద మూడు నెలలుగా బిల్లులు పెండింగ్ ఉంటే, వాటిని నోటిఫై చేసినట్టేనని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాయి 2లో

## స్టే బిసిల హక్కులకు విఘాతం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి



బిసి రిజర్వేషన్ల బిల్లుకు శాసనసభలోని అన్ని రాజకీయ పార్టీలూ మద్దతు ఇచ్చాయంటేనే, ఆ బిల్లులకు రాష్ట్రంలోని ప్రజలందరి మద్దతు ఉన్నట్టని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని ఆమోదించే బాధ్యత గవర్నర్‌పైన ఉన్నదని, కానీ గవర్నర్ తరువాయి 2లో

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో భూదాన్ భూములపై తామిచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా చర్యలు ఉన్నాయో లేదో నివేదిక ఇవ్వమంటే ఎందుకు సమర్పించలేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. మూడు నెలలుగా నివేదిక ఎందుకు ఇవ్వలేదంటూ కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. వారంలోగా నివేదిక ఇవ్వాలని జస్టిస్ వేణుగోపాల్ ఆదేశించారు. వివిధ సర్వే నెంబర్స్‌లోని భూదాన్ భూములను ఐఏఎస్/ఐపిఎస్ అధికారులు, వారి బంధువులు అన్యాక్రాంతం చేశారని గతంలో పిటిషన్ పడింది. ఆ భూములను అన్యాక్రాంతం కారాదని, భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టాలని ఆదేశించినప్పటికీ నిర్మాణం జరిగిందని బి.మల్లేష్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ కేసులో కలెక్టర్ రిపోర్టు ఇవ్వకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## రూ.10వేలు లంచం

ఎసిబికి చిక్కిన మధురానగర్ పంచాయతీ కార్యదర్శి

ప్రజాపక్షం/గంగాధర

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌పై అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) డిఎస్పీ విజయ్ కుమార్ అధికారులతో దాడులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటున్నట్లు ఫిర్యాదు రావడంతో ఏసిబి బృందం వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా తరువాయి 12లో

## కార్మిక నేతలపై కక్ష సాధింపా?

మహదేవయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

అమర్‌జీత్ కౌర్ డిమాండ్ : జ్యోతిరాదిత్య సింధియాకు లేఖ



న్యూఢిల్లీ: కార్మికుల తరపున పోరాడే ట్రేడ్ యూనియన్ నాయకులపై కక్షసాధింపు ఆమోదయోగ్యం కాదని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ నొక్కిచెప్పారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఎఐజిడిఎస్‌యు) ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు శుక్రవారం ఒక లేఖ రాశారు. మహదేవయ్య సీనియారిటీ పోకుండా, ముందు లభించిన అన్ని ప్రయోజనాలు కల్పిస్తూ గతంలో పనిచేసిన స్థానంలోనే తిరిగి నియమించాలని కోరారు. అన్ని సమస్యలను యూనియన్‌తో చర్చించి పరిష్కరించుకోవచ్చని అన్నారు. మహదేవయ్య విషయంలో సానుకూల స్పందనను ఆశిస్తున్నట్లు అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ప్రజాస్వామిక, న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను అన్వేషిస్తామని, న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు. 'మీరు తక్షణమే జోక్యం చేసుకుంటారని, న్యాయ సూత్రాలు, కార్మికుల హక్కులకు కట్టుబడి సమస్యను పరిష్కరిస్తారని భావిస్తున్నాం. కార్మిక సంఘాల కార్యకలాపాలు సాగించినందుకే తరువాయి 2లో




## డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌పై ఈగల్ ఆపరేషన్

ముంబయిలో రూ.3 కోట్లు స్వాధీనం

రూ.కోటి విలువ చేసే డ్రగ్స్‌ను పట్టుకున్న రాచకొండ పోలీసులు

ప్రజాపక్షం/ హైదరాబాద్/ మల్కాజిగిరి

రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ మరో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. నైజీరియా డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌ను ఛేదించింది. డ్రగ్స్ దందాకు సంబంధించి రూ.3 కోట్ల హవాలా డబ్బును ముంబయిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాల డబ్బు బదిలీ చేస్తున్న దగ్గారం ప్రజాపతి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తరువాయి 2లో



# ఎఐతో జరభద్రం

మనిషిని పోలిన మనుషులతో డబ్బు వసూళ్లు

సర్వత్రా చర్చనీయాంశంగా ఖమ్మం జిల్లా ఘటన

ఆశకు పోతే నష్టపోక తప్పదు

ప్రజాపక్షం/ఖమ్మం

పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంలో అనేక మార్పులకు కారణమైంది. వ్యవసాయ రంగ యాంత్రీకరణ మొదలు ఇప్పుడు ప్రతిచోట ఆధునీకరణ ఒక కొత్త యుగానికి బాటలు వేస్తుంది. కృత్రిమ మేధా (అర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ) సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతుంది. మనిషిని పోలిన మనిషిని సృష్టించి సోషల్ మీడియా ద్వారా పేక్ ప్రచారాలను చేస్తున్న విషయం అందరికీ విధితమే. ముఖ్యంగా సోషల్ మీడియాలో అందమైన యువతులను సృష్టించి అసభ్యకర పోస్టింగులు పెడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలోనే రాజకీయ నాయకులను పోలిన ఫోటోలతో సమావేశాలు, సభలు అంటూ పిలుపులు రావడం , అవసరాలంటూ డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు ఒక్కొక్కటిగా తరువాయి 2లో

## మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం

05

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశ



## దశల వారీగా దేశంలో ఓటరు జాబితా సవరణ

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలుసహా, కొన్ని రాష్ట్రాలతో ప్రారంభం

సమాయత్తమవుతున్న ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలతో సహా, కొన్ని రాష్ట్రాలతో ప్రారంభించి, దశలవారీగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను ఎన్నికల కమిషన్ చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదే సమయంలో, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న లేదా జరగనున్న రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించబోమని, ఎందుకంటే గ్రాస్ రూట్స్ పోల్ యంత్రాంగం దానితో బిజీగా ఉండడంతో ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టలేకపోవచ్చని వారు చెప్పారు. అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు, మొదటి దశలో మరికొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశముంది. బిహార్‌లో ఓటర్ల జాబితా శుభ్రపరిచే కార్యక్రమం ముగియగా, దాదాపు 7.42 కోట్ల ఓటర్లతో తుది జాబితా సెప్టెంబర్ 30న ప్రచురించబడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సోమవారం మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో ఓటర్ల జాబితాల తరువాయి 12లో

## మళ్లీ చిగురిస్తున్న భారత్–ఆఫ్ఘాన్ బంధం

కాబూల్ మిషన్‌ను పూర్తి రాయబార కార్యాలయ హోదాతో అప్‌గ్రేడ్ చేసిన భారత్



**న్యూఢిల్లీ :** ఏళ్ల ప్రతిష్ఠంభన తర్వాత భారత్–అఫ్గానిస్థాన్ బంధం చిగురిస్తోంది. వాణిజ్యం, మానవతా సహాయం కోసం అఫ్గాన్‌లో నిర్వహిస్తున్న టెక్నికల్ మిషన్‌ను భారత్ పూర్తిస్థాయి దౌత్య కార్యాలయానికి అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ విషయాన్ని అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీతో భేటీలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. అఫ్గానిస్థాన్‌లో ఆరు కొత్త ప్రాజెక్టులకు నిబద్ధతతో ముందుకు సాగడానికి భారత్ సిద్ధంగా ఉందని జైశంకర్ తెలిపారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని భారత సాంకేతిక మిషన్‌ను రాయబార కార్యాలయం హోదాకు అపగ్రేడ్ చేస్తున్నట్లు విదేశాంగ మంత్రి ఎస్‌జైశంకర్ ప్రకటించారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రత, స్వాతంత్ర్యానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. భారత పర్యటనకు వచ్చిన అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి ఆమీర్ ఖాన్ ముత్తాఖీతో జైశంకర్ సమావేశమయ్యారు. 20 అంబులెన్స్‌లను అఫ్గాన్‌కు బహుమతిగా అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ తరువాయి 2లో



## కేరళ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచండి

వయనాడ్‌లో పునర్మిర్మాణ పనులకు రూ. 2,220 కోట్లు కేటాయించండి

ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ భేటీ

**న్యూఢిల్లీ :** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ధ్వంసమైన వాటి పునర్నిర్మాణ పనులకు రూ.2,220 కోట్లకు పైగా వెంటనే విడుదల, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడం వంటి వివిధ అంశాలపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం విజయన్ మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రితో కీలక అంశాలను లేవనెత్తినట్లు చెప్పారు. వయనాడ్ సహాయ పనులకు నిధులతో పాటు, ఎయిమ్స్ ఏర్పాటుకు, రాష్ట్ర రుణ పరిమితులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతిని కోరినట్లు చెప్పారు. గత సంవత్సరం వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యం కారణంగా చాలా మంది మరణించారు, భారీ నష్టం జరిగింది. కోజికోడ్‌లోని కినలూర్‌లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఏర్పాటుకు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అమల్లోకి యుద్ధ విరమణ ఒప్పందం
### వెనక్కు తగ్గుతున్న ఇజ్రాయెల్ బలగాలు

**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్, హమాస్ మధ్య గాజా పట్టణానికి సంబంధించిన యుద్ధ విరమణ ఒప్పందం స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చింది, ఇజ్రాయెల్ సైన్యం ఈ విషయాన్ని అధికారికంగా శుక్రవారం ప్రకటించింది. ముందుగా అంగీకరించిన సరిహద్దువైపు ఇజ్రాయెల్ బలగాలు వెనక్కు తగ్గుతున్నాయి. గాజాలో యుద్ధ విరమణ, పరస్పర బందీలను అప్పగింత వంటి 20 సూత్రాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ వెంటనే యుద్ధ విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినట్టు సైన్యం ప్రకటించింది. ఇజ్రాయెల్ కేబినెట్ తీర్మానంతో, మధ్యప్రాచ్యంలో రెండు సంవత్సరాలుగా సాగుతున్న యుద్ధానికి తెరపడింది. బందీల విడుదల ఒప్పందం వంటి అంశాలను ఆమోదించినట్టు బెంజిమిన్ నెతన్యాహు నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ ప్రకటించింది. అయితే, అనేక వివాదాస్పద అంశాలపై స్పష్టత ఇవ్వలేదు.

# ఫిలిప్పీన్స్‌లో భూకంపం
## రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదు.. సునామీ హెచ్చరిక

**మనీలా :** ఫిలిప్పీన్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలు ప్రకారం 7.6 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఒకరు మృతి చెందగా, అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిండనావో ద్వీపంలోని దావో ఓరియెంటల్ ప్రావిన్స్ సమీప సముద్ర ప్రాంతంలో, భూమి 10 కిలోమీటర్ల లోతులో కదలికలు ప్రారంభమయ్యాయి. ఈ భూకంపం వల్ల సమీప తీర ప్రాంత ప్రాంతాలలో భారీ సునామీ అలలు రావచ్చని ఫిలిప్పైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వోల్కనాలజీ అండ్ సీస్మాలజీ అధికారులు హెచ్చరించారు. వెంటనే ఎత్తయిన, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిందిగా ప్రజలకు సూచించారు. కాగా, భూకంపం ప్రభావంతో అనేక భవనాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. సోషల్ మీడియాలో భవనాల కుప్పకూలడం, ప్రజలు పరుగు తీయడం వంటి షాకింగ్ వీడియోలు వైరల్ అయ్యాయి. సునామీ హెచ్చరిక సమాచారాన్ని ఫిలిప్పీన్స్ తీర ప్రాంతాలు, పొరుగు దేశాలకు కూడా అందించినట్టు అధికారులు తెలిపారు. 3 మీటర్ల ఎత్తు ఉన్న సునామీ అలలు వచ్చే అవకాశం ఉందని, ఇండోనేషియా, పలౌ తీరాల్లో కూడా కొద్దిసేపటి సునామీ అలలు ఉంటాయని పేర్కొన్నారు. ఇలా వుంటే, రెండు వారాల్లో ఫిలిప్పీన్స్ భూకంపానికి గురి కావడం ఇది రెండోసారి. ముందుగా సెబులో 6.9 తీవ్రతతో జరిగిన భూకంపంలో 72 మంది మరణించారు. ఈ కొత్త భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, అది భూగర్భంలో సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఏర్పడడం వల్ల పెనుప్రమాదం తప్పినట్టు భావిస్తున్నారు. ఈ ఘటన పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అనే భూభాగంలో వత్తిడిగా ఉండే ప్రాంతంలో జరిగినందున, భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయని నిపుణులు చెప్పారు.

సునామీపై ముందస్తు హెచ్చరికలు జారీ కావడంతో, ప్రధాన ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు సురక్షిత చర్యలు తీసుకుంటున్నాయి. ధ్వంసమైన భవన శిథిలాల కింద కొంత మంది చిక్కుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఒకరు మృతి చెందగా, ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఆఫ్టర్ శాక్స్ (అదనపు ప్రకంపనలు) వచ్చే అవకాశం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది.



# మీ 'బహిష్కృతులు' మాకొద్దు
### అమెరికాకు స్పష్టం చేసిన బుర్కినా ఫాసో

**డకార్:** అక్రమ వలసదారుల పేరుతో అమెరికా బహిష్కరిస్తున్న వారిని స్వస్థలాలకు పంపే వరకూ తాత్కాలిక శిబిరాల్లో ఉంచుకునేందుకు బుర్కినా ఫాసో నిరాకరించింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తిరస్కరించింది. వలసలను అనైతికంగా పేర్కొన్న మొరాకో విదేశాంగ మంత్రి కరమొకో జీన్‌మేరీ ట్రావోర్, అమెరికా ఒత్తిళ్లకు లొంగబోమని స్పష్టం చేశారు. దేశాన్ని పాలిస్తున్న సైన్యాధ్యక్షుడు కెప్టెన్ ఇబ్రహీం ట్రావోర్ సిద్ధాంతాలకు అమెరికా అనుసరిస్తున్న విధానాలు విరుద్ధమని వ్యాఖ్యానించారు. అక్రమంగా తమ దేశంలో నివసిస్తున్న వారిని వారివారి స్వస్థలాలకు పంపేందుకు వీలుగా, 'థర్డ్ పార్టీ డిపోర్షన్' ఒప్పందం మేరకు కొన్ని ఆఫ్రికన్ దేశాలకు తరలిస్తున్నది. అమెరికాతో ఈ విధమైన ఒప్పందం కుదుర్చుకున్న దేశాల్లో ఎస్వాటిని, దక్షిణ సుడాన్, రువాండ్, ఘనా వంటి దేశాలు ఉన్నాయి. ఈ దేశాలకు ఇప్పటికే సుమారు 40 బహిష్కృతులు అమెరికా తరలించింది. ఉగాండాతో ఒప్పందం ఉన్నప్పటికీ, ఇంకా అక్కడికి ఎవరినీ పంపలేదు. ఇలావుంటే, బుర్కినా ఫాసోను కూడా తమ ఒప్పందంలో భాగస్వాములను చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే వైట్ హౌస్ అధికారిక ప్రతిపాదన కూడా చేసింది. అయితే, బుర్కినా ఫాసో ఈ అభ్యర్థనను తిరస్కరిస్తూ, తమ దేశం ఎన్నటికీ బహిష్కృతులను తరలించే కేంద్రం కాబోదని తేల్చిచెప్పింది. ఇటీవల బుర్కినా ఫాసో నుంచి వచ్చిన వీసా ధరఖాస్తులను అమెరికా తిరస్కరించింది. ఇప్పుడు అమెరికా ప్రతిపాదనను అంగీకరించకపోవడానికి ఇదే ప్రధాన కారణమై ఉండవచ్చని అంటున్నారు.

# ఫ్రాన్స్‌లో రాజకీయ అనిశ్చితి

**పారిస్ :** ఫ్రాన్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్నది. అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్ నేతృత్వంలోని రినసెన్స్ పార్టీకి పార్లమెంటులో మెజారిటీ లేకపోవడమే సంక్షోభానికి ప్రధాన కారణం. గత మూడు సంవత్సరాలలో ఏకంగా ఐదుగురు ప్రధానులు రాజీనామా చేయడమే ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది. 2024 సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. దీనితో, పార్లమెంటులో తప్పక బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రధాని ఎప్పటికప్పుడు బల పరీక్షను ఎదుర్కోక తప్పడం లేదు. ఒకవైపు మెజారిటీ లేకపోవడం, మరోవైపు సొంత పార్టీలోనే అసంతృప్తులు మాక్రాన్ పార్టీకి సవాళ్లు విసురుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఎంపికైన ప్రధాన మంత్రులు రాజీనామా చేసే పరిస్థితులు ఏర్పడి, రాజకీయ అనిశ్చితికి ఆజ్యం పోతున్నాయి. ప్రభుత్వం ఖర్చులు తగ్గించడం నుంచి పన్నుల పెంపు వరకూ... నియామకాల్లో ఆంక్షల నుంచి ఉద్యోగుల వేతనం, పింఛన్ వరకూ దాదాపు ప్రతి విషయంలోనూ అధికార, ప్రతిపక్ష వర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతునే ఉన్నాయి. దీనితో ద్రవ్యోల్బణం పెరిగింది. ధరలు ఆకాశానికి అంటుతున్నాయి. ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. విస్తృతగా ఉన్న సామాజిక వర్గాలకు సరైన ప్రాతినిథ్యం లభించడం లేదు. ఇలాంటి సమస్యలన్నీ రాజకీయంగా ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నాయి. ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వారు, పరిస్థితి చక్కబడేందుకు నిర్ణయాలు తీసుకొని, అమలు చేయకముందే పదవి నుంచి తొలగాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానులు తరచుగా మారుతుండటం వల్ల నిత్యం అనిశ్చితి ఉంటున్నది. నిధుల నిర్వహణ, సంక్షేమ విధానాలు, స్థూల ఆర్థిక నిర్ణయాలు తీసుకునేందుకు తగినంత సమయం లభించడం లేదు. ప్రధానిగా ఉన్న జాన్ కస్టెక్స్ 2022లో మాక్రోన్ మొదటి కాలం ముగిశాక రాజీనామా చేశారు. 2022–2024 మధ్యకాలంలో ప్రధానిగా పనిచేసిన ఎలిజబెత్ బోర్న్ పార్లమెంట్ మద్దతు లేకపోవడంతో తప్పుకోవాల్సి వచ్చింది. గత ఏడాది రాజకీయ విభేదాలు, యువత నిరసనలు వల్ల గాబ్రియెల్ అటాల్ ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత మిచెల్ బార్నియర్ తాత్కాలిక ప్రధానిగా నియమితులయ్యారు. కానీ బడ్జెట్ ఓటింగ్‌లోనే విఫలం కావడంతో, తక్కువ కాలంలోనే రాజీనామా సమర్పించారు. సెబాస్టియన్ లెకొర్నూ ఈ ఏడాది జులైలో నియమితులయ్యారు.





**మొరాకోలో మొదలైన 'జెన్ జెడ్ 212' ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. ప్రధాన మంత్రి అజీజ్ అఖనౌచ్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ మొదలైన ఈ ఉద్యమం, ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తున్నది. రాజు మహమ్మద్ VI జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో, శుక్రవారం నిరసనకారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అవినీతి అంతమే తమ పంతమని స్పష్టం చేశారు. అఖనౌచ్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు.**

# నేరం బిజెపిదే
(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. రిజర్వేషన్ల విషయంలో కోర్టు ఆరు వారాలు స్టే విధించడం 'అటు ఇటు' కాకుండా ఉన్నదని, ఇందులో ఏదో మతలబు ఉన్నదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ కూడా పేద ప్రజలను పరిహాసం చేస్తోందన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని న్యాయవ్యవస్థ పునర్ పరిశీలించాలని కోరారు. బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించని గవర్నర్‌ది తప్పా?, లేదా బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానిదే తప్పా అని కూనంనేని విమర్శలు చేస్తున్న రాజకీయ పార్టీలను నిలదీశారు. రిజర్వేషన్లపై స్టే ఇస్తే బిజెపి, బిఆర్‌ఎస్ సంబురాలు జరుపుకుంటున్నాయని, బిసిలకు అన్యాయం జరిగిందనే బాధ వారిలో కనిపించడం లేదని విమర్శించారు. తాము అప్పుడే చెప్పామని చెబుతున్న పార్టీలు అసెంబ్లీలో జరిగిన బిసి బిల్లు ఆమోదంలో ఎందుకు పాల్గొన్నారని ప్రశ్నించారు. బిజెపి నాయకులు తెలంగాణ రాష్ట్రంలో విమర్శలు చేయడం కాకుండా ఢిల్లీకి వెళ్లి బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా చూడాలని హితువు పలికారు. బిసి రిజర్వేషన్ల బిల్లులపైన రాహుల్‌గాంధీ మాట్లాడలేదని చెబుతున్న బిజెపి నేతలు, రాహుల్ గాంధీ మాట్లాడకపోతే, బాధ్యతకలిగిన ప్రధాని మోదీ మాట్లాడరా?, ఆయన బిసిలు, ఎస్సి ఎస్టి చెందిన సమస్యల పరిష్కారానికి, వారి హక్కులు, జరుగుతున్న నష్టాలపై ఆలోచించరా అని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు 'శల్య సారథ్యం' తరహా వ్యవహరిస్తున్నాయన్నారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలనే చిత్తశుద్ధి ఉంటే బిఆర్ ఎస్ బిజెపి హైకోర్టుకేసులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. బిసి జన గణను తప్పు పడుతున్న కేంద్రం అధికారంలో ఉన్న బిజెపి, తప్పులు లేకుండా దేశ వ్యాప్తంగా జనగణను చేపట్టాల్సిందని, పార్లమెంట్ బిల్లును సవరించాల్సిందని, కేంద్రంలో బిజెపికి పూర్తి మెజార్టీ ఉన్నది కదా? అని కూనంనేని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదని చాలా మంది చెప్పారని, కానీ అన్ని రకాల ప్రయత్నాలూ సాగాయని, అదే తరహాలో బిసి రిజర్వేషన్ల బిల్లులో ఎందుకు ప్రయత్నించడంలేదని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు చెబుతోందని, మరోవైపు బిసి రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో రాజకీయ పార్టీలు డొంక తిరుగుడు పద్ధతిని అనుసరిస్తూ ప్రజలను ఆయోమయానికి గురిచేస్తున్నాయని కూనంనేని సాంబశివ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కోర్టు తీర్పు బిసిల ఆర్థిక, రాజకీయ, విద్య అవకాశాలకు విఘాతం : నెల్లికంటి సత్యం**

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో గతంలో మండల్ కమిషన్ కూడా బిజెపి అడ్డుకున్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం గవర్నర్ వ్యవస్థను బిజెపి అడ్డంపెట్టుకుని బిసి రిజర్వేషన్లను ఆమోదిచడంలేదని విమర్శించారు. ఇడబ్లుఎస్ రిజర్వేషన్ల ద్వారా 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటిందన్నారు. రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పు బిసిల ఆర్థిక, రాజకీయ, విద్య అవకాశాలకు విఘాతంగా మారిందని, తద్వారా బిసి హక్కులను హరించే విధంగా మారిందని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎఐతో జరభద్రం
(మొదటి పేజీ తరువాయి)

వెలుగు చూస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒక ఘటన ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇద్దరు తెలుగుదేశం నాయకులను పోలిన మనుషులను కృత్రిమ మేధా ద్వారా సృష్టించి వారి ద్వారా జిల్లాలోని తెలుగుదేశం నాయకులకు వీడియో కాల్ చేయించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తుందని మీరు సిద్దంగా ఉండాలంటూ కొద్ది రోజుల క్రితం మాజీ మంత్రి ఫోటోతో ఒక వీడియో కాల్ వచ్చింది. దానికి తెలుగుదేశం కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు సంబురపడిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సహాయం కోసం అంటూ కొంత డబ్బును ఖాతాకు పంపాలంటూ మొదట పేర్కొన్న మాజీ మంత్రి పేరుతో మరో వీడియో కాల్ రావడంతో కొంత డబ్బును జమ చేశారు. మూడు రోజుల క్రితం మీరు కొంత మంది కలిసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాల్ చేసినట్లు ఏఐ ద్వారా సృష్టించారు. ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగుదేశం నాయకులు సుమారు 15 మంది విజయవాడ చేరుకున్నారు. మీ దగ్గరకు వచ్చి చంద్రబాబు నాయుడు మాట్లాడతారని మీరు ఒక మంచి హోటల్‌లో బస చేస్తే ఆ ఖర్చు కూడా పార్టీయే భరిస్తుందని చెప్పడంతో విజయవాడలో ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో బస చేశారు. మొదటి నుంచి వీరికి టచ్‌లో ఉన్న మాజీ మంత్రి పేరుతో వస్తున్న వీడియోకాల్ మరోసారి వచ్చింది. మీలో కొంత మందికి మాత్రమే అనుమతి వచ్చిందని మిగిలిన వారికి అనుమతి కోసం ఒక్కొక్కరు రూ. 10వేలు చెల్లించాలని తెలపడంతో తెలుగుదేశం నాయకులు అవాక్కయ్యారు. ఈలోపు హోటల్ యాజమాన్యం బిల్లు కోసం ఒత్తిడి తెచ్చింది. తెలుగుదేశం పార్టీ చెల్లిస్తుందని నాయకులు బుకాయించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మాజీ మంత్రిని కలిసేందుకు ప్రయత్నం చేయడంతో అసలు ఈ ఘటనతో మాజీ మంత్రికి ఎటువంటి సంబంధం లేదని ఆ వీడియోలు మొత్తం కృత్రిమ మేధా ద్వారా సృష్టించబడ్డాయని తెలుసుకుని అవాక్కయ్యారు. ప్రస్తుతానికి ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నమ్మి వెళ్లిన తెలుగుదేశం నాయకులపై విజయవాడలో హోటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కృత్రిమ మేధా మంచికి ఉపయోగపడాల్సి ఉండగా అక్రమార్కుల చేతికి కూడా ఒక ఆయుధంగా మారింది. ఈ కృత్రిమ మేధా అటు పోలీసులను ఇటు అధికారులను, సామాన్యులను సైతం ఇబ్బందులు పెడుతుంది. తగు పరిశీలన లేకుండా నమ్మితే మోసపోక తప్పదు. కృత్రిమ మేధాతో భద్రంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భారత్– ఆఫ్ఘాన్ బంధం
(మొదటి పేజీ తరువాయి)

మెషీన్లను సమకూర్చడంతో పాటు, రోగనిరోధక వ్యాక్సిన్లను కూడా భారత్ సరఫరా చేయనుందని జైశంకర్ వెల్లడించారు. ఇరుదేశాల మధ్య చారిత్రాత్మక బంధం రెండు దేశాల మధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని ఈ భేటీలో జైశంకర్ వ్యాఖ్యానించారు. అఫ్గాన్ ప్రజలు ప్రకృతి వైపరీత్యాలు వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడల్లా భారత్ ఆపన్నహస్తం అందించిందని గుర్తు చేశారు. వృద్ధి, శ్రేయస్సు పట్ల భారత్–అఫ్గానిస్థాన్ ఉమ్మడి నిబద్ధతను కలిగి ఉన్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే రెండు దేశాలు ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదం ముప్పు వల్ల ఇవి ప్రమాదంలో పడినట్టు పేర్కొంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నాలను సమన్వయం చేసుకోవాలని సూచించింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత అఫ్గాన్ సంఘీభావం తెలిపిందని పేర్కొంది. మరోవైపు భారత్ ఒక కీలక దేశమని ముత్తాఖీ అభివర్ణించారు. అఫ్గాన్ ప్రజలకు ఎప్పుడూ అండగా నిలుస్తూ అనేక రంగాలలో సహాయం చేసిందని గుర్తు చేశారు.

**మా దేశంలో మైనింగ్ చేయండి**

తమ దేశంలో మైనింగ్ చేయడానికి భారతీయ కంపెనీలను అఫ్గాన్ ఆహ్వానించింది. దీనిని భారత్ స్వాగతించింది. ముత్తాకితో భేటీ సందర్భంగా జైశంకర్, అభివృద్ధి భాగస్వామ్యం నుంచి క్రికెట్ వరకు ఇరుదేశాల ఉన్న అనేక సంబంధాల గురించి ప్రస్తావించారు. అలాగే వాణిజ్యపరంగా ఢిల్లీ, కాబూల్ మధ్య అదనపు విమానాల ప్రారంభం గురించి మాట్లాడారు. ఆఫ్గన్ విద్యార్థులు భారత విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి మార్గాలను విస్తరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 2025 ఏప్రిల్‌లో ఆఫ్గన్ ప్రజల కోసం కొత్త వీసా మాడ్యూల్ ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ విషయంలో అఫ్గాన్‌పై జైశంకర్ ప్రశంసలు కురిపించారు. 2021లో అమెరికా సైన్యం వైదొలగడంతో అఫ్గాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అఫ్గాన్‌లో భారత్ తన రాయబార కార్యాలయంతో పాటు కాన్సులేట్‌లను మూసివేసింది. 2022లో అఫ్గాన్‌లో టెక్నికల్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. తాజా చర్చల్లో దీన్ని ఎంబసీగా అప్‌గ్రేడ్ చేసేందుకు భారత్ సిద్ధమైనట్టు జైశంకర్ ప్రకటించారు.

# జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురండి: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి 22 నెలలు గడిచినప్పటికీ 'గల్ఫ్ పాలసీ, ఎన్‌ఆర్‌ఐ' పాలసీకి అతిగతి లేదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుకు దిక్కులేదన్నారు.బిఆర్‌ఎస్ పాలనలో వలసలు వాపస్ అని, కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలయ్యాయని ఆరోపించారు. నిర్మల్,కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# విఘాతం
(మొదటి పేజీ తరువాయి)

ఆ బిల్లులను ఆమోదించకుండానే రాష్ట్రపతి వద్దకు పంపించారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ రాజకీయ లబ్ధి కోసం కాకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. బిసి రిజర్వేషన్లపై బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఆ బిల్లులను గవర్నర్ ఆమోదించేలా చేసే వారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోడంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులు రాలేదని పల్లా వెంకట రెడ్డి అన్నారు.

# కక్ష సాధింపా?
(మొదటి పేజీ తరువాయి)

మహదేవయ్యను విధుల్లో నుంచి తొలగించాలని ఏఐటీయూసీ నమ్ముతోంది. ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా గ్రామీణ డాక్ సేవక్‌ల సమ్మెకు మహదేవయ్య నాయకత్వం వహించారు.దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న డాక్ సేవల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడారు. ఈ కారణంగా ఆయనను తొలగించారు. ఇది అన్యాయం. యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడం కార్మికుల హక్కు. ఇందుకోసం కక్షసాధింపుకు పాల్పడటం తగదు. ఈ చర్య మొత్తం పోస్టల్ కార్మికవర్గాన్ని కలవరపెట్టింది' అని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. కార్మిక సంఘం కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు మహదేవయ్యపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవద్దని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు. మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై హామీని ఆశిస్తున్నట్లు తన లేఖలో అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు.

# ఈగల్ ఆపరేషన్
(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. నకిలీ పాస్‌పోర్టులతో విదేశీయులు భారత్‌లోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు రూ.కోటి విలువ చేసే డ్రగ్స్‌ను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. మల్కాజిగిరి ఎస్ఒటి, కీసర పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుల నుంచి 7 కిలోల ఓపిఎం, 2 కిలోల పాపిస్ట్రా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కేసులో రాజస్థాన్‌కు చెందిన లోకేశ్ భరత్ అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న రాజస్థాన్ వాసి జగదీష్ గుజ్జర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలు మనిషిని నేరాల వైపు మళ్లిస్తాయని, డ్రగ్స్ తీసుకుంటే శరీరంలో కూడా పలు అవయవాలు దెబ్బతింటాయని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువత మత్తు బారినపడటం దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు.

**ఇతర రాష్ట్రాల నుంచి ఆపరేటింగ్**

రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖకు సూచించిందని సిపి సుధీర్ బాబు తెలిపారు. అందులో భాగంగా డ్రగ్స్ కట్టడి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 403 మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులు, విక్రయదారులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో ఉండి డ్రగ్ ముఠాలను నడిపించే కొంత మంది నేరస్థులను తమ బృందాల ద్వారా అరెస్టు చేయించినట్లు చెప్పారు. ఇప్పుడు రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు నడిపిస్తున్న డ్రగ్ రాకెట్‌ను ఛేదించినట్లు తెలిపారు. ఈ కేసులో తప్పించుకున్న గుజ్జర్ కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు కమిషనర్ సుధీర్ బాబు ప్రకటించారు. 'రాజస్థాన్‌కు చెందిన లోకేష్ భరత్ అనే నిందితుడి నుంచి రూ. కోటి విలువ చేసే 7 కేజీల ఓపిఎం, 2 కేజీల పాపి స్ట్రా స్వాధీనం చేసుకున్నాం. నిందితుడిని కుందన్‌పల్లి ఓఆర్‌ఆర్ దగ్గర పట్టుకున్నాం. పరారీలో ఉన్న మరో నిందితుడు జగదీష్ గుజ్జర్ కోసం గాలిస్తున్నాం. నిందితుడు లోకేష్ భరత్ ఆగస్టులో 2 కేజీల ఓపిఎం కాచిగూడ రైల్వే స్టేషన్ దగ్గర విక్రయించాడు. లోకేష్ భరత్ ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేసేవాడు. అతను పని చేసే హోటల్ మూసివేయడంతో అతని ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి ఈజీ మనీకి అలవాటు పడి ఈ దందాలోకి దిగాడు' అని రాజకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.

# నక్సల్స్ లొంగుబాటు
(మొదటి పేజీ తరువాయి)

సుమతితో కలిసి డిజిపి బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ..జన జీవన స్రవంతిలోకి రావాలని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టు పార్టీకి చెందిన రాష్ట్ర కమిటి సభ్యులు ఈ ముగ్గురు లొంగిపోయారన్నారు. ఒక్కొక్కరిపై ఉన్న రూ.20 లక్షల రివార్డును వారికి అందిస్తున్నామన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు భద్రత ఇవ్వడంతో పాటు ఎలాంటి వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. లొంగిపోయిన కుంకటి వెంకటయ్య 36 ఏళ్లు, మొగిలిచెర్ల వెంకట్రాజు 35 ఏళ్లు, గంగవ్వ 21 ఏళ్లు అజ్ఞాతంలో గడిపారన్నారు.

**రాష్ట్రానికి చెందిన ఇంకా 72 మంది అజ్ఞాతంలోనే...**

తెలంగాణకు చెందిన 72 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని, వీరిలో 8 మంది కేంద్ర కమిటి సభ్యులు ఉన్నారని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది మొత్తం 412 మంది పోలీసుల ముందు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిపోయారని అన్నారు. ఆయుధాలు విడిచి లొంగిపోవాలని ఆయన మరో సారి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. లొంగిపోవాలనుకుంటున్న మావోయిస్టులు తమ కుటుంబ సభ్యులతోనైనా, రెవెన్యూ అధికారులతోనైనా, పోలీసునైనా సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు స్వాతిలక్రా, విజయ్‌కుమార్, సుమతి పాల్గొన్నారు.

**పార్టీలో బేదాభిప్రాయాలు ఉన్నాయి..**

కొంత పంథాను అందుకోలేక..పాత పంథాలో ప్రయాణించలేక లొంగిపోవడమే శ్రేయస్కారమని మావోయిస్టు రాష్ట్ర కమిటి సభ్యుడు వెంకటయ్య మీడియాకు వివరించారు.మావోయిస్టు పార్టీ నాయకత్వంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల విషయంలో విబేధాలు వచ్చాయన్నారు. సమాచార వ్యవస్థ కుప్పకూలడంతో పార్టీ నష్టపోయిందని, ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి సానుకూల వాతావరణం లభించడంలో లొంగిపోయామన్నారు.

# మెరుగుపరచండి
(మొదటి పేజీ తరువాయి)

తక్షణ అనుమతి కోరినట్లు విజయన్ చెప్పారు. కేరళలో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలనేది చాలా కాలంగా ఉన్న డిమాండ్ ఉన్నది. రుణ పరిమితులను తగ్గించడం, రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు సంబంధించిన అంశాలను కూడా సిఎం ప్రధానమంత్రితో చర్చించారు. ప్రధానితో జరిగిన సమావేశం ఫోటోను విజయన్ తన ఎక్స్ హ్యాండిల్‌లో పంచుకున్నారు. దేశ రాజధాని పర్యటన సందర్భంగా విజయన్ గురువారం కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీలతో సమావేశాలు నిర్వహించారు.

శుక్రవారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ, శబరిమల వివాదం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు మరియు కొండ ఆలయం నుండి బంగారం దుర్వినియోగంలో పాల్గొన్న వారందరూ చట్టం చేతుల్లోకి వస్తారని అన్నారు.

**టిడిబి వైపు లోపాలు కనుగొనలేదు**

శబరిమల బంగారం విషయంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) వైపు నుండి ఇప్పటివరకు ఎటువంటి లోపాలు కనుగొనలేదని విజయన్ చెప్పారు. బంగార్ చోరీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కేరళ హైకోర్టు రాష్ట్ర పోలీసులను ఆదేశించిన అనంతరం దేశ రాజధానిలో సిఎంపై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బంగారం దుర్వినియోగంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని, ఇటీవల జరిగిన శబరిమల సమ్మేళనాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరిగిందని ఆరోపించారు. ఆలయం చోరీకి గురైన బంగారు పనుల గురించి వెల్లడించిన ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రస్తావిస్తూ, అన్ని కుట్ర కోణాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వివాదానికి ఉన్నికృష్ణన్‌కు సంబంధం ఉందని, ఆయన బంధువుల నివాసంలో చోరీకి గురైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఉదహరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అధికారిని వేధించిన వారిపై కఠిన చర్యలు

### సిపిఐ నేత డాక్టర్ కె.నారాయణ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హర్యానా ఐపిఎస్ అధికారి వై.పూరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడం దారుణమని, ఆయనను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. హర్యానాలో ఐపిఎస్ అధికారి వై.పూరణకుమార్ ఆత్మహత్య సంఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించిందన్నారు. పూరణ కుమార్ తన పైఅధికారుల నిరంతర వేధింపులు, అవమానాలు తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారని వార్తల ద్వారా తెలియవస్తున్నదన్నారు. హర్యానా డిజిపి శత్రుజిత్ కుమార్ సహా బాధ్యులపై రోహిత్ వేముల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డాక్టర్ నారాయణ డిమాండ్ చేశారు. అధికార వ్యవస్థలో ఉన్న వివక్షాత్మక ధోరణులు ఈ ఘటనతో మరోసారి బయటపడ్డాయని చెప్పారు. బాధ్యులపై రోహిత్ వేముల చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే న్యాయం సాధ్యమవుతుందన్నారు. వై.పూరణకుమార్ ఘటనపై కమిటీ ఏర్పాటు చేసి, న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ఐపిఎస్ అధికారి పూరణ్‌మార్ కుటుంబానికి తగిన పరిహారం అందజేయాలని డాక్టర్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

## బిసిల రిజర్వేషన్లపై బిజెపి, బిఆర్‌ఎస్ వైఖరి

# స్పష్టం చేయకపోవడం దుర్మార్గం

### సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** బిసి రిజర్వేషన్లపై బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రదర్శించకపోవడం దుర్మార్గమని, అణగారిన బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి అడ్డుపడుతూ వారిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.3వేల కోట్లకు పైగా నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం అందె చిన్న స్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సిద్ధమై ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ బిసి రిజర్వేషన్లపై కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనే ఉత్కంఠ ఉండేదని, కోర్టు స్టే ఇవ్వడం వల్ల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇస్తున్న తరహాలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని గతంలో అనేకసార్లు ప్రభుత్వాలకు సూచించామన్నారు. ఇప్పటికైనా కేంద్రం బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం కావాలని, అందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని, తిరిగి చిగురుమామిడి మండలంలో ఎర్రజెండా ఎగురవేయడానికి సిపిఐ శ్రేణు లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపిఐకి కంచుకోటగా నిలిచిన చిగురుమామిడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఎంపిపి, జడ్పిటిసిని గెలుచుకునే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. బిసి రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇచ్చినందున ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధం కావాలని, గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య ఉండి పనిచేయాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్, మాజీ మండల కార్యదర్శి ఎలగందుల రాజయ్య, నాయకులు తదితరులున్నారు.

## ‘ధర్నా చౌక్’ను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ‘ధర్నా చౌక్’ను పునరుద్ధరించాలని చేసిన పోరాటంలో ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ సభ్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇందిరా పార్కు వద్ద ధర్నాలు నిర్వహించవద్దని నగర శివారులో ధర్నాలు చేసుకోవాలని ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా సిపిఐ, సిపి(ఎం), టిజెఎసి, ఇతర వామపక్ష, ప్రజాసంఘాలు ఒక వేదికపైకి వచ్చి ఇందిరా పార్కు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఆందోళన నిర్వహించారని, ఇందులో భాగంగానే తమపై కేసులు పెట్టారని చాడ వెంకట రెడ్డి ఒక ప్రకటనలో వివరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి వినిపించడానికి, ప్రజల గొంతుకకు వేదిక అయిన ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను ఎత్తివేయడంతో దానికి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆనాడు 30 రోజుల పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు ధర్నాలు నిర్వహించి, కోర్టుకు వెళ్ళామన్నారు. కోర్టు ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలంటే పట్టణం నడిబొడ్డున ధర్నా చౌక్ ఉండాలి కానీ, సెల్‌టవర్ లేని నగర శివారులో ఎందుకు ధర్నాలు నిర్వహించాలనే కోర్టు ఆదేశాలతో ధర్నా చౌక్ పునరుద్ధరణ జరిగిందన్నారు. ఆనాడు తనపై, పరిరక్షణ కమిటీ సభ్యులపై కేసులు పెట్టారని, అవి ఇప్పటికి కూడా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటంలో పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి

# ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

### నారెడ్కో ప్రాపర్టీ షోలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరం సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) 15వ ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్డర్లు మధ్య, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఫ్లాట్స్ నిర్మించాలని సూచించారు. తెలంగాణ ప్రజలు ఆతిథ్యానికి ఇచ్చినంత ప్రాధాన్యత దేశంలోని ఏ రాష్ట్రంలో కనబడదు, స్నేహితులు, బంధువులు ఇంటికి వస్తే ఆ రోజు పండుగ జరుపుకునే మనస్తత్వం తెలంగాణ ప్రజలది అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిలో బిల్డర్లు, రియల్టర్లు భాగస్వాములు కావాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. హైదరాబాదులో అంతర్జాతీయ విమానాశ్రయం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి రియల్టర్లు వివిధ వర్గాలను ఆ ప్రాంతాలకు విరివిగా తీసుకువెళ్లాలని డిప్యూటీ సిఎం కోరారు. రెండు సంవత్సరాల్లో 20 వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడు ఇప్పుడే కనిపిస్తున్నాయి, ఈ పనులు హైదరాబాద్ రూపురేఖలను మారుస్తాయి అన్నారు. ఇటీవల 39 ఎస్‌టిపి ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ పనులకు ఆమోదం తెలిపారన్నారు. సీవరేజి ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.11,927 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రూ.13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని తాగునీటి, సీవరేజీ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని వివరించారు. మొత్తంగా సీవరేజీ, తాగునీటి సరఫరా కోసం రూ.25,631 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ వేలంలో ఎకరం రూ.177 కోట్లు పలికిందంటే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకు వెళ్తుందో అర్థమవుతుంది అన్నారు. ఈ వేలంలో పాల్గొన్న 25 మంది బిల్డర్లు ఎకరాకు రూ.150 కోట్ల వరకు ధరను కోట్ చేశారని డిప్యూటీ సిఎం వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని, హైదరాబాద్ అభివృద్ధిలో రియలేస్టేట్ రంగం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పురోగమక విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయని తెలిపారు. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల విస్తరణకు రియల్ ఎస్టేట్ కీలక మౌలిక సదుపాయాలను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి భాను ప్రసాద్, నారెడ్కో అధ్యక్షులు విజయ్‌సాయి మేక, జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, జాతీయ వైస్ ప్రెసిడెంట్ పిఎస్‌రెడ్డి, ప్రతినిధులు ఎం.వెకయ్య చౌదరి, పి.రవిరెడ్డి, స్వామినాథన్, కాళీప్రసాద్, వెకంటేష్, హరిబాబు, దశరథ్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

# రేకులపల్లి లక్ష్మీనర్సమ్మకు సిఎం నివాళి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీ నర్సమ్మ గతనెల 29న స్వర్గస్తులవ్వగా శుక్రవారం నిర్వహించిన ద్వాదశ దినకర్మలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిజామాబాద్ చేరుకున్న సిఎంను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, ఇతర జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా సిఎం రేవంత్‌రెడ్డి బోర్గాం(పి) శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌కు చేరుకుని ద్వాదశ దినకర్మలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి అధికారులు అనధికార ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు ద్వాదశ దినకర్మలో పాల్గొన్నారు. అనంతరం సిఎం కాన్వాయ్ ద్వారా కలెక్టరేట్‌కు చేరకుని హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా విస్తృతస్థాయిలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# రూ.220 కోట్ల బకాయిలు చెల్లించాలి

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘ఎస్‌సి, ఎస్‌టి బెస్ట్ అవైలబుల్ స్కీమ్’ కింద ప్రభుత్వం బకాయిపడిన రూ.220 కోట్లను చెల్లించేంతవరకు పాఠశాలల్లోకి పిల్లలను రానివ్వబోమని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు సమ్మె చేపట్టాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆ నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ కోరారు. ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యను అందించేం దుకు గత 25 ఏళ్ల కింద ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించిన నిధులను గత రెండేళ్ల నుంచి విడుదల చేయకపోవడంతో రూ.220 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఫలితంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు దసరా సెలవుల అనంతరం పాఠశాలల్లోకి దళిత, గిరిజన విద్యార్థులను అనుమతించలేదని, పాఠశాల గేట్ల బయటనే నిలబెట్టాయని, ప్రభుత్వం నిధులను విడుదల చేసే వరకూ పిల్లలను పాఠశాలల్లోకి తీసుకురావొద్దంటూ తల్లిదండ్రులకు తెగేసి చెప్పాయని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య అనేక దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, రాష్ట్రంలోని దళిత, గిరిజన సంఘాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల యాజమాన్యాలు సుదీర్ఘకాలంగా మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని తెలిపారు. ఈ స్కీమ్ చరిత్రలోనే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఇలాంటి అవమానం ఎదురుకావడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో బకాయిపడ్డ నిధులను యాజమాన్యాలకు విడుదల చేసి గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

## రిజర్వేషన్ల విషయంలో బిఆర్‌ఎస్

# చిత్తశుద్ధిని శంకించలేరు

### మాజీ ఎంపి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశంపైన గతంలోనే కెసిఆర్ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసి కేంద్రం వద్దకు పంపించిన బిల్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నదని, రిజర్వేషన్ల విషయంలో బిఆర్‌ఎస్ చిత్తశుద్ధిని శంకించేందుకు వీలు లేదని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపిలు కలిసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ప్రయత్నించాలని, ఇందు కు బిఆర్‌ఎస్ సహకరిస్తుందని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తలచుకుంటే బిసి రిజర్వేషన్లు పెరగవా? అని ప్రశ్నించారు. వోడాఫోన్ రూ.40వేల కోట్ల ఆదాయ పన్నును చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పునిస్తే, దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా తిరస్కరించి, వోడాఫోన్‌కు లబ్ధి చేకూర్చిందని గుర్తు చేశారు. ఒక సంస్థ కోసం చట్ట సవరణ చేసిన కేంద్రంలోని బిజెపి, ప్రస్తుతం బిసిలకు చెందిన రిజర్వేషన్ల విషయంలో ఎందుకు రాజ్యాంగ సవరణ చేయబోదని ప్రశ్నించారు. హైకోర్టులో బిఆర్‌ఎస్ ఎందుకు ఇంప్లీడ్ కాలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నిస్తున్నారని, బిఆర్‌ఎస్ డ్రామా కంపెనీ కాదని వివరించారు. డ్రామా లు ఇప్పటికైనా కట్టిపెట్టి, బిసిలను మోసం చేయాలనే వైఖరిని కాంగ్రెస్ విడాలని వినోద్ కుమార్ సూచించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్, లీగల్ సెల్ ప్రతినిధి సి.కళ్యాణ్ రావు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి అనాగరికం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పైన జరిగిన దాడి అనాగరికమని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. తక్షణమే నిందితుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని అఖిల పక్షాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం




ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ దళితుడు కావడం వల్లనే దాడి జరిగిందన్నారు. జస్టిస్ గవాయ్‌పైన జరిగిన దాడి ని నిరసిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని, సమగ్రమైన విచారణ చేపట్టాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయాల ముందు, 17న అన్ని మండల కేంద్రా ల్లో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, ఈనెల 22న చలో హైదరాబాద్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆ తర్వాత 23న చలో అమరావతి పేరు తో ఆంధ్రప్రదేశ్, 24వ తేదీన చలో చెన్నై పేరుతో తమిళనాడులో, ఈ నెల 25న చలో బెంగళూరు పేరుతో కర్నాటకలో భారీ నిరసన ర్యాలీలను నిర్వహించనున్నట్టు మంద కృష్ణ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి చేసిన కృషి వల్లనే బిసి రిజర్వేషన్ల అంశం ప్రధాన చర్చల్లోకి రావడానికి కారణమని అన్నారు. రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ వైరుధ్యంతో, ఓటు బ్యాంకు రాజకీయంగా చూడకుండా బిసిలకు న్యాయం జరిగేలా అందరూ ముందుకు రావాలని ఆయన కోరా రు. 42 శాతం రిజర్వేషన్ల పట్ల హైకో ర్టు స్టే విధించడం పట్ల కొన్ని రాజకీయ పార్టీలు సంబురాలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపైన ఎస్‌సి, ఎస్‌టి సంఘాలను కలుపుకుని ఎంఆర్‌పిఎస్ ‘పండగ పోరాటం’ చేస్తామని మందకృష్ణ మాదిగ అన్నారు.

## లడ్డూ ఘటనపై వివరాలు ఇవ్వండి

### ఆలయ ఇఒకి మంత్రి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేములవాడ లడ్డూ ఘటనపై సమగ్ర విషయాలు అందజేయాలని టెంపుల్ అధికారులకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఆదేశించారు. లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో టెంపుల్ ఇఒ రమాదేవి... ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్టు మంత్రికి వివరించారు. ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని వెల్లడైందని... అయినా, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వెల్లడించారు. ఎటువంటి తప్పిదాలు జరగొద్దని... జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖ కీలక సూచనలు చేశారు. ఆలయ ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


ఫారం - VI

(సెక్షన్- నియమం-19 యొక్క ఉప నియమం (1)) మరియు సెక్షన్-11(1) యొక్క చట్టం -30/2013)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ

ప్రాథమిక ప్రకటన

గెజిట్ నెం. 134/2025 తేదీ : 27.09.2025
నెం. ఎఫ్/12665/2025 తేదీ : 25.09.2025
నెం: జి/ 1250/2025 తేదీ : 27.09.2025

ప్రజాప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొండంగల్ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా ఉట్కూర్ చెరువు పునరుద్ధరణ కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూర్ మండలం, బాపూర్ గ్రామం పరిదిలో మొత్తం **ఎ.2.37 గుంటలు** భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

తెలంగాణ ప్రభుత్వం నారాయణపేట - కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ, పునరావాసం మరియు పునస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం 2 మరియు 3 యొక్క వర్తింపు నుండి మినహాయించడానికి తేది: 12.02.2025 నాడు G.O,Ms.No.3 Irrigation & CAD(LA) Department జారీచేసింది. అందువలన ఆ చట్టంలోని 4(1) సెక్షన్ ప్రకారం సామాజిక ప్రభావ అంచనా నిర్వహించబడలేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునస్థాపన కోసం నారాయణపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వాహకుడిగా నియమితులయ్యారు.

అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలం, బాపూర్ గ్రామం యొక్క మొత్తం **ఎ.2.37 గుంటలు** విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | ఆసక్తిగల వ్యక్తి పేరు | సరిహద్దులు ఉ | సరిహద్దులు ద | సరిహద్దులు తూ | సరిహద్దులు ప | చెట్లు రకం | చెట్లు సంఖ్య | కట్టడాలు రకం | కట్టడాలు [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 156/1 | [illegible] | [illegible] | 0.31 | బాలప్ప తండ్రి కిష్టప్ప | [illegible] | 157 | 156 | 157 | - | - | - | - |
| 2 | 156/2 | [illegible] | [illegible] | 0.35 | గిరిగెలి బాలరాజు తండ్రి గిరిగెలి నర్సప్ప | [illegible] | 157 | 156 | 157 | - | - | - | - |
| 3 | 156/3 | [illegible] | [illegible] | 0.21 | పి.నర్సింహ తండ్రి పూజారి కన్నప్ప | [illegible] | 157 | 156 | 157 | చింత | - | - | - |
| 4 | 157/8 | [illegible] | [illegible] | 0.30 | ప్రభుత్వ భూమి | 157 | 157 | 157 | 157 | - | - | - | - |
| మొత్తం | | ఎ.2.37 గుంటలు | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) లో న్యాయమైన సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల ప్రకారం వారందరికి ఈ ప్రకటన రూపొందించబడింది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, నారాయణపేట మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నారాయణపేట భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ కం సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు &భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రావ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందిని అధికారిగా అధికారమిచ్చుటకు.

చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు / కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏవేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవి ఏ వ్యక్తి చేయరాదు.

పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటె భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది. నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్ / అధికృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/- భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO NO. 687/LA/PP/Advt/Pub/2025-26



**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను అనగా **కామళ్ళ లక్ష్మయ్య తండ్రి పిచ్చయ్య,** ఇంటి నెం. 6-35/1ఎ, మారుతీనగర్, వరంగల్ ‘x’ రోడ్, ఖమ్మం రూరల్ మం॥ ఖమ్మం జిల్లా. నాయొక్క సర్వే నెం.304, ప్లాట్ నెం.115గల **Plot Mother Document No. 1247/2002, Date: 13/8/2002,** Register Office-Kusumanchi. ఇట్టి డాక్యుమెంట్స్ ఇ-సేవలో EC కొరకు పెద్దతండాకు వెళ్లినప్పుడు నా యొక్క పేపర్స్ ఎక్కడో పడిపోవడం జరిగింది. ఇట్టి పేపర్స్‌ని నాకు ఇప్పించగలరని మనవి.

ఇట్లు
**కామళ్ళ లక్ష్మయ్య తండ్రి పిచ్చయ్య**
మారుతీనగర్, ఖమ్మం.



**శ్రీ గండిమైసమ్మ దేవస్థానం**
తెలంగాణ ప్రభుత్వము - దేవాదాయ ధర్మాదాయ శాఖ
గండిపేట గ్రా॥, మం॥, రంగారెడ్డి జిల్లా.

లేఖ నెం. SGMD/2025 (సీల్డ్ టెండర్ - కమ్ - బహిరంగ వేలం ప్రకటన) తేదీ: 10.10.2025

ఇందుమూలముగా సమస్త వ్యాపారులకు, స్థానికులకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా శ్రీ గండిమైసమ్మ దేవస్థానమునకు చెందిన పడమర దిక్కున ఉన్న ఖాళీ స్థలములో క్రింది పట్టికలో చూపిన బిట్ ప్రకారముగా టిన్స్ షెడ్లు సొంత ఖర్చులతో నిర్మించుకొని గోదాము / సామాను భద్రపరచుటకొరకు మాత్రమే వాడుకొనుటకు సీల్డ్ టెండర్-కమ్- బహిరంగ వేలము తేది: 25-10-2025 శనివారము రోజున ఉ. 11 గం॥లకు ఆలయ ప్రాంగణములో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హాజరు అయిన వారి సమక్షంలో మూడు (3) సంవత్సరాల కాలపరిమితికి బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించబడును. ఆసక్తిగల వారు సదరు సమయమునకు హాజరుఅయి సీల్డ్ టెండర్ - కమ్ బహిరంగ వేలం ప్రక్రియలో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర. సం. | బిట్ నెం. | స్థలము కొలతలు | వేలం పాట కాలపరిమితి | టెండరు ధర | ప్రతి బిట్ కి డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|---|---|
| 1 | నెం.1&2 | 36/75 | 3 సంవత్సరములు 05.11.2025 నుండి 04.11.2028 | రూ. 1000/- | రూ. 50,000/- |
| 2 | నెం. 3, 4, 5, & 6 | 18/50 | 3 సంవత్సరములు 05.11.2025 నుండి 04.11.2028 | రూ. 1000/- | రూ. 50,000/- |
| 3 | పార్కింగ్ నిర్వహణ వసూలు చేసుకునే హక్కు | | 1 సంవత్సరము 05.11.2025 నుండి 04.11.2026 | రూ. 500/- | రూ. 50,000/- |

బహిరంగవేలము లో పాల్గొను వారు నిర్ణీత డిపాజిట్‌ను డిమాండ్ డ్రాఫ్ట్ కమ్ నగదు రూపంములో దేవస్థాన కార్యాలయములో చెల్లించవలెను. షరతులు ఇతర పూర్తి వివరములకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి
సెల్ నెం. 9912186517

DIPR R.O. No. : 8997-PP/CL/ADVT/1/2025-26, Date: 10-10-2025



మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

**I.P. No. 16/2024**

*Between:*
Vattam Sai Kumar ...*Petitioner*
AND
Guni Vinay and Others ...*Respondents*

1. Gunti Vinay, S/o. not known, Hindu, aged 33 years, behind APR Praveen's Crystal Avenue, RTC Colony, Saheb Nagar, Hyderabad, Telangana.
7. Kondaveti Venkateswarlu, S/o. not known, Hindu, aged 30 years, Plot No. 701/A, 4th Floor, Road No.36, Jubli Hills, Hyderabad, Telangana.
10. Nanini Suresh, S/o. not known, Hindu, aged 30 years, Plot No. 701/A, 4th Floor, Road No.36, Jubli Hills, Hyderabad, Telangana.
11. Chalumuri Satish Kumar, S/o not known, Hindu, aged 30 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
12. Thommandru Abhisheik, S/o. not known, Hindu, aged 26 years, Beside Axix Bank Street, Dead end house, 2nd Floor, SR Nagar, Hyderabad.
13. Arasavalli Yashoda Krishna, S/o. not known, Hindu, aged 27 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.
14. Nalla Dinesh, S/o not known, Hindu, aged 31 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
15. Pola Bhagawan, S/o not known, Hindu, aged 29 years, D.No. 9-2-65/A, Hasmathpet, Old Bowenpally, Hyderabad, Telangana.
16. N.Chandana, D/o not known, Hindu, aged 26 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.
17. Bandaru Shiva Kumar, S/o not known, Hindu, aged 29 years, beside Axis Bank Street, Dead end house 2nd Floor, SR Nagar, Hyderabad.

...1, 7, 10, 11, 12, 13, 14, 15, 16, 17 Respondents

పై నెంబరు పిటీషనులో 1, 7, 10, 11, 13, 14, 15, 16, 17 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 15-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషనును మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 10-10-2025
ఎ.సునీల్ అడ్వకేట్, రాజమండ్రి

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సోమవారం నాటికి జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన ఖరీఫ్ 2025/26 సీజన్‌కి సంబంధించి ధాన్యం సేకరణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి జిల్లాలో 298 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ఆమోదం తెలిపామని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేసుకొని సోమవారంలోపు ప్రారంభించాలని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ మోహన్‌బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, డిసిఓ పద్మ, డిఏఓ శ్రీధర్‌రెడ్డి, ఏపిడి సురేష్, ఏడిఎం బెనర్జీ, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెర్వుగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలం పరిధిలోని చెరువుగట్టు శ్రీ పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీలు, గట్టుపైన శ్రీ స్వామివారి ఆలయ హుండీలను లెక్కించగ గట్టుక్రింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయము రూ.6,39,540లు, గట్టుపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయము రూ. 34,07,100 లు మొత్తం 85 రోజులకు గాను రూ.40,46,640,అన్నదానం రూ. 50,844 వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. నవీన్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. భాస్కర్,దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, నల్లగొండ శ్రీ దుర్గ శివసాయి సేవా సమితి సభ్యులు, హెచ్‌డిఎఫ్‌సి, నల్లగొండ బ్రాంచి సిబ్బంది ,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజాపాలన పట్ల విశ్వాసంతో కాంగ్రెస్‌లోకి చేరికలు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో ప్రజలకు అనేక ప్రతిష్టాత్మక సంక్షేమ అభివృద్ధి పనుల పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పావిరాల మహేందర్ లత యాదవ్, బలరాం యాదవ్, దయాకర్ యాదవ్, శ్రీను యాదవ్, బందారపు రాజశేఖర్ గౌడ్, కందాల వంశీలు బిఆరెస్ పార్టీని ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అఖండ విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేదని చెప్పే సందేశం ఇవ్వాలని దాని కోసం తీవ్రంగా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రతిపక్షాల ఎత్తుగడలు చిత్తుచేయాలని కర్తవ్యాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీశైలం, టింగిల్ కార్ వెంకటేశం, కార్యకర్తలు ఉన్నారు.

## వీధి విక్రయదారులు నగదు రహిత లావాదేవీలు జరపాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వీధి విక్రయదారులు నగదు రహిత లావాదేవీలు జరపాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోకకల్యాణ్ మేళాలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ ఆన్ బోర్డింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రహిత చెల్లింపు కోసం క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ చేయించుకోవడానికి వీధి విక్రయదారులు వినియోగదారుల ద్వారా నష్టపోకుండా క్యూఆర్‌కు ఒక విధమైన సౌండ్ వినడం ద్వారా వ్యాపారులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. ఆన్‌లైన్ నగదు లావాదేవీల ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. లోకకల్యాణ్ మేళాలో భాగంగా పట్టణంలో మిగిలిపోయిన వీధి విక్రయదారులు ఈనెల 12వరకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫోన్ పే నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మెప్మా టీఎంసీ బక్కయ్య, సీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వీధి విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు నష్టపోవద్దు

**ప్రజాపక్షం/గుండాల :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ప్రారంభించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపి, పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరలకు విక్రయించి మోసపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు మద్దతు ధరను కల్పించి రైతుల వద్ద నుండి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మానసిక ఆరోగ్య చట్టం, పరిధులు అంశంపై అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయగిరిలోని సహృదయ వయో వృద్ధుల ఆశ్రమంలో మానసిక ఆరోగ్య చట్టం, పరిధులు అంశంపై అవగాహన కార్యక్రమం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత మాట్లాడుతూ మానసిక వికలాంగులకు రాజ్యాంగ హక్కులు కల్పించబడ్డాయని వారికి న్యాయ సహాయం న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందచేసి వారి హక్కుల సాధికారతకు అందరం కృషి చేయాలని, దీనికై జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ పథకం ఏర్పాటు చేయడమైనది , మనోన్యాయ్ ఏర్పాటు చేయడమైనది తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి పీహెచ్‌సి డాక్టర్లు యామిని, మురళి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం అడ్మిన్, సభ్యులు, వయో వృద్ధులు, నర్సింగ్ స్టాఫ్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు నిర్వహకులు పరికరాలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎమ్ఎస్ఎస్‌పి పరికరాలు టర్పాలిన్స్, పాడి క్లీనర్‌లు, ఎలక్ట్రానిక్ క్వాంటాలు, మాయిచర్ మీటర్స్ సూర్యాపేట మార్కెట్ యార్డ్‌లో ఉన్నందున నిర్వాహకులు తీసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, సూర్యాపేట మండలం, పెన్‌పహాడ్ మండలాల ప్రభుత్వ కొనుగోలు నిర్వాహకులు వినియోగించుకోవాలని కోరారు.

# తేమ, తాలు, తరుగు,చెత్త ఉండొద్దు

నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్



**ప్రజాపక్షం/నల్లగొండ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎస్ఎల్ బిసి కాలని తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు షోకాజ్ నోటీస్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్ బిసి కాలనీలో రెసిడెన్సియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాఠశాల సమయంలో భోజనం కోసం బయటకు వెళ్లడం జరిగింది. అయితే నిబంధనల ప్రకారం రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ వసతి గృహం ఆవరణలోనే భోజనం చేయాలని నియమం ఉన్నప్పటికీ, ఆయన దానిని ఉల్లంఘించారు. దీంతోపాటు, పాఠశాల భవనం,ఆవరణ అపరిశుభ్రమైన స్థితిలో,సరైన నిర్వహణ లేని పరిస్థితులలో ఉండటంతో పాటు, ప్రధాన పరిపాలనా బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రిన్సిపాల్ విఫలమైనట్లు కలెక్టర్ గుర్తించారు. అంతేకాకుండా కొందరు ఉపాధ్యాయులు సైతం పాఠశాల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరు అయినట్లు కలెక్టర్ గుర్తించారు.పై లోపాలన్నీ ప్రిన్సిపాల్ విధులలో తీవ్రమైన అలసత్వాన్ని,పర్యవేక్షణ లోపాన్ని ,క్రమశిక్షణారాహిత్యాన్ని సూచిస్తున్నాయని,ఇది ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఒక రెసిడెన్షియల్ సంస్థకు ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కు షో కాజ్ నోటీస్ జారీ చేశారు. షో కాజ్ నోటీస్‌కు ముడురోజులలో సరైన వివరణ ఇవ్వాలని లేదం టే క్రమ శిక్షణా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు.

**రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలి**

ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో కోరారు. శుక్రవారం ఆమె నకిరేకల్ మండలం తాటికల్, మండలం అర్జాలబావిలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలని, తేమ తాలు ,తరుగు,చెత్త, చెదారం వంటివి లేకుండా పూర్తి నాణ్యతతో తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వరికి క్వింటాల్‌కు రూ.2389ల మద్దతు ధర ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు తీసుకొచ్చిన పరిశీలించి తూర్పార బట్టి, తేమ ,తాలు లేకుండా చూసుకోవాలని, నాణ్యతతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. జిల్లా సహకార అధికారి పత్యానాయక్, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం ఉన్నారు.

## ఆధునిక సాంకేతిక బార్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కోర్టు నుంచి మున్సిబ్ కోర్టు ల వరకు ఆధునిక సాంకేతిక కలిగిన బార్ అసోసియేషన్ ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు సీనియర్ న్యాయవాది వీరోజ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం జిల్లాలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెండు సంవత్సరాల కోసం ఎన్నుకోబడ్డ బార్ కౌన్సిల్ మెంబర్లు ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండానే ఎనిమిది సంవత్సరాలు కాలయాపన చేయడంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా వైఫల్యం ఉందన్నారు, అలాగే ఎన్నికల నిర్వహణకు హైకోర్టు, సుప్రీంకోర్టు లో పిటిషన్లు వేసిన తర్వాత సుప్రీం కోర్టు జోక్యం తో బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించుటకు తప్పని పరిస్థితి ఏర్పడింది అన్నారు, అలాగే న్యాయవాదులపై దాడులు, హత్యలు నిరంతరంగా జరుగుతున్న న్యాయవాదుల రక్షణ చట్టం కోసం బార్ కౌన్సిల్ ఎలాంటి ప్రయత్నం చేయలేదని కానీ, న్యాయవాదులపై చర్యలు తీసుకోవడంలో మాత్రం వెంటనే స్పందించే తీరును ఖండించారు. బార్ కౌన్సిల్ నిధులు విషయంలో జవాబు దారీ తనం లోపించిందని యువ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముందుకు వచ్చిన వారినే ఎన్నుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత కలిగిన బార్ కౌన్సిల్ మెంబర్ లను ఎంపిక చేయాలని కోరారు.

## మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?

కేసారంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం కేసారం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గణితంలో తప్పు లేకుండా గుణింతాలు చెప్పడంతో విద్యార్థులను అభినందించారు. అనంతరం కేసారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని, ఎన్ని నిర్మాణాల్లో ఉన్నాయని అవి ఏ దశలల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అందరూ కూడా ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, డబ్బులు తమ ఎకౌంట్‌లో ఎప్పటికప్పుడు వెంటనే పడుతున్నాయని తెలిపారు.

### యథావిధిగా ప్రజావాణి : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ సమస్యల పై ప్రజల ఆర్జీలు ఇచ్చేందుకు ఈ నెల 13వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథా విధిగా నిర్వహించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి, వివిధ సమస్యల పై ఫిర్యాదులు ఇచ్చేందుకు రావొచ్చని తెలిపారు.

## మానసిక ప్రశాంతతో ఒత్తిళ్లకు దూరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బ్యాంకు ఉద్యోగస్తులు తమ దయానందన జీవితంలో ప్రతిరోజు కూడా క్రమశిక్షణ తప్పకుండా బ్యాంకుకు వచ్చి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఒత్తిళ్లను మానసిక ప్రశాంతత ద్వారా దూరం చేసుకోవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశ్వకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ ధ్వర్యం లో స్థానిక ఆర్టీసీ కాలనీలో ఉన్నటువంటి ఎస్‌బిఐ రీజినల్ బ్యాంక్ నందుగల ఉద్యోగస్తులకు అవగాహన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు ఒక రకమైన చిరాకు అలసట డిప్రెషన్ డిసప్పాయింట్మెంట్ ఇలాంటిది గురవుతుంటే కాబట్టి వాళ్లు ఏకాగ్రతతో పనిచేయాలంటే ప్రతిరోజు అనునిత్యం ఫిజికల్ యాక్టివిటీ, అంటే వాకింగ్ గాని, సైకిలింగ్ గాని, స్పోర్ట్స్ గానే ఇతర క్రీడలకు సంబంధించిన ప్రోగ్రామ్స్ చేసినట్లయితే మనిషిలో ఒక కొత్త తేజం ఉత్తేజం వచ్చి ఇలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికోకుండా ఉంటారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు మాట్లాడుతూ తమ లో ఉన్న ఒత్తిడి తగ్గాలంటే ఏకాగ్రత కష్టపడి పనిచేయటం ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా ఆలోచించకుండా తమకున్న పరిధిలోనే సమస్యలను సాల్వ్ చేసుకుని కష్టమర్లతో ఓ మంచి ఇంట్రాక్షన్ తో ఉన్నట్లయితే మానసిక ఒత్తుల నుంచి దూరంగా ఉండవచ్చు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ నీలగిరి మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ అనిత రాణి,సెక్రటరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్,డాక్టర్ రమేష్, డాక్టర్ శృతి,డాక్టర్ అశోక్, రామస్వామి,వీరస్వామి, బ్యాంకు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.





## అక్రమ అరెస్టులు సరికాదు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసి రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారిపై నిరసన చేసే బిసి నాయకులను అక్రమ అరెస్టులు చేయడం సరైంది కాదని బిసి సంక్షేమ సంఘం నాయకులు తప్పుపట్టారు. ప్రభుత్వం చట్టప్రకారం బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు చట్టపద్ధతిలో పోకుండా తప్పుడు మార్గంలో కుట్రపూరితంగా వెళ్ళి హైకోర్టుకు పోవడానికి అవకాశం ఇచ్చారన్నారు. రెడ్డి సామాజిక వర్గంతో కేసులు వేయించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వడం జరిగిందని మండిపడ్డారు. బిసి సంఘాలన్ని కూడా ఒక నిర్ణయానికి వచ్చి బిసిలకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం హామీ అమలు చేయాలని ఉద్యమాలు చేసి ఒత్తిడి తీసుకరావడం జరిగిందన్నారు. దీంతో తూతూ మంత్రంగా శాసనసభలో బిల్లు పెట్టారన్నారు. కాని చట్టబద్ధంగా 9 షెడ్యూల్లో పెట్టేవిధంగా ప్రయత్నం చేయకుండా పార్లమెంట్ సమావేశాల్లో తమ ఎంపిలను బిసి రిజర్వేషన్ల బిల్లుపై మాట్లాడమని చెప్పకుండా అఖిలపక్ష కమిటిని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లకుండా జంతర్‌మంతర్‌లో ధర్నాలు చేసి నటించారన్నారు. హైకోర్టులో వేసిన రెడ్డి జాగృతి నాయకులపై నిరసనలు, ధర్నాలు చేసేందుకు సన్నద్ధమవుతున్న వారిని అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ముక్త కంఠంతో ఖండించాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నర్సింహా, జిల్లా ప్రధాన కార్యదర్శులు భూపతి నారాయణ గౌడ్, దాసరి వెంకన్న యాదవ్, కోడి లింగయ్య యాదవ్, జక్కుల రామచందర్ యాదవ్, గంగాధర జనకిరాములు ఉన్నారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంట గతంలో కంటే ఎక్కువగా సాగవుతుండడంతో దిగుబడి మరింత అధికంగా వచ్చే అవకాశం ఉందని కావునా మిల్లర్లు రైతులకు ఎలాంటి ఆటంకాలు పెట్టకుండా ధాన్యాన్ని వెంటవెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయాధికారులు సైతం కొనుగోళ్లను పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి తదితరులు ఉన్నారు

## ఆటో డ్రైవర్ల బాకీలు ఎప్పుడు చెల్లిస్తారు...



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని చెప్పినవి ఎప్పుడు చెల్లిస్తారని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్‌బాబు చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట ఆటో డ్రైవర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న సందర్భంగా ఆటోడ్రైవర్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అంతేకాకుండా గత బిఆర్ఎస్ హయాంలో ఆటో డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల ప్రమాదభీమా ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లు కనీసం పిల్లల ఫీజులు కట్టుకోలేక కుటుంబాన్ని గడపలేక ఎంతోమంది ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పై హైకోర్టు నాలుగు వారాలు స్టే విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కళాశాలలు,పాఠశాలలు బంద్ చేపట్టి హైదరాబాద్ రోడ్డులో గల రైల్వే ట్రాక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ జనాభా తమాషా ప్రకారం బీసీలకు 42 శాతం కల్పిస్తూ జీవోలు చేసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోయువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారింగు నరేష్ గౌడ్,విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొగాకు రవికుమార్ యాదవ్ ,కన్నబోయిన రాజ్ కుమార్ యాదవ్,శ్రీకాంత్,తరుణ్, కొంపల్లి రామన్న గౌడ్ ,సాయి శివ ,ప్రమోద్ ,సతీష్ ,మహేష్ ,పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## కెమిస్ట్రీలో హరిప్రసాద్‌కు ఎంజియు డాక్టరేట్ పట్టా

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ వై ప్రశాంతి పర్యవేక్షణలో సింథసి స్ క్యాటలెటిక్ అండ్ బయలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ అంశంపై పరిశోధన చేసి తన పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకు గాను ఎంజియూ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణానికి చెందిన పులిజాల రాములు కుమారుడైన హరిప్రసాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరకొండలో ఇంటర్మీడియట్ శ్రీసత్యసాయి కాలేజ్ నందు, డిగ్రీ సిటీ కాలేజ్ హైదరాబాద్ లో ఆ తర్వాత పిజి జహీరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పిజి సెంటర్ మీర్జాపూర్ లో పూర్తి చేశారు.మెటల్‌ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ, ఇంధన నిల్వ, ఔషధ సరఫరా,సెన్సర్ సాంకేతికతలలో విస్తృతంగా ఉపయోగపడతాయని తెలిపారు.ఇవి కార్బన్ డైఆక్సైడ్‌ను పట్టుకోవడం,నీటి శుద్ధి,హైడ్రోజన్ నిల్వ,పునరుత్పత్తి శక్తి ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ సాంకేతికతలు పరిశ్రమల,ఆరోగ్య రంగాల భవిష్యత్తును మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ సందర్భంగా రసాయన శాస్త్రం విభాగ అధ్యాపకులు, సహ పరిశోధకులు విద్యార్థులు హరిప్రసాద్ ను అభినందించారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 'బుర్ఖా' మహిళలను గుర్తించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
### రంగంలోకి అంగన్‌వాడీ కార్మికులు : ఇసి

**న్యూఢిల్లీ :** బుర్ఖా లేదా పర్దా ధరించిన మహిళా ఓటర్లను గౌరవప్రదంగా గుర్తించడానికి బీహార్‌లోని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఎన్నికల సంఘం శుక్రవారం తెలిపింది. 'పుర్దానాషీన్' (బుర్ఖా లేదా పర్దా ధరించిన) మహిళలు పాల్గొనడాన్ని ప్రోత్సహించడానికి, వారి గోప్యతను నిర్ధారిస్తూ మహిళా పోలింగ్ అధికారులు లేదా సహాయకుల సమక్షంలో వారి గౌరవప్రదమైన గుర్తింపు కోసం పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ప్రసంగించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, బుర్ఖా ధరించిన ఓటర్ల గుర్తింపును ధృవీకరించడంలో సహాయపడటానికి బిహార్‌లోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఉంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో 'ఘుంగత్', బుర్ఖా ధరించిన మహిళల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ పోలింగ్ బూత్‌ల లోపల గుర్తింపు ధృవీకరణ గురించి ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను కలిగి ఉందని, వాటిని కచ్చితంగా పాటిస్తామని కుమార్ అన్నారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు
# తొలివిడత నోటిఫికేషన్ జారీ

### సీట్ల పంపకాలపై ఎన్‌డిఎ, ఇండియా కూటమిలో అనిశ్చితి



**పాట్నా :** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండవ విడతల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తొలి విడత పోలింగ్ జరిగే 121 నియోజకవర్గాల్లో శుక్రవారం నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 6న పోలింగ్ జరగనుంది. అయితే ఇంకా సీట్ల పంపకాలపై ఎన్‌డిఎ, ఇండియా కూటమిలో అనిశ్చితి నెలకొంది. ఈ రెండు కూటములు కూడా సీట్ల పంపకాలు పూర్తి చేసి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మారుతున్న రాజకీయ సమీకరణాలు, గెలుపు ఆధారంగా బీహార్‌లో ముందస్తు ఎన్నికల పొత్తులను ఖరారు చేయడం, సీట్ల పంపకాలు చేయడం ఎంత కష్టతరంగా మారిందో ఈ పరిస్థితి చూస్తే అర్థమవుతోంది. ఎన్‌డిఎ అంతర్గత సీట్ల పంపకాల ఏర్పాటు ఒకటి రెండు రోజుల్లో ఖరారు అయ్యే అవకాశం ఉందని బిజెపి వర్గాలు సూచిస్తున్నాయి.
ఆ తర్వాత పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేయాలని యోచిస్తోంది. ఎన్‌డిఎ కీలక మిత్రపక్షమైన జెడియు కూడా త్వరలో అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ అంతర్గత వర్గాలు తెలిపాయి. అయితే కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జన శక్తి పార్టీ (రామ్ విలాస్) 45 సీట్లు డిమాండ్ చేస్తుండగా, ఎన్‌డిఎ 20 నుంచి 22 సీట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. సీట్ల పంపకాలపై శుక్రవారం చర్చలు జరిగాయి. సీట్లను ఖరారు చేయడానికి, కొత్త అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయడానికి బిజెపి బిహార్ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్ పాట్నాకు వచ్చారు. బిజెపి 101–102 సీట్లలో, జెడి(యు) 102–103 సీట్లలో, ఎల్‌జెపి (ఆర్‌వి) 23–25 సీట్లలో, ఎల్‌జెపి 20–23 సీట్లలో పోటీ చేసే అవకాశం ఉన్నందున ఎన్‌డిఎ త్వరలో ఒక ఒప్పందానికి రావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే హెచ్‌ఎఎం, ఆర్‌ఎల్‌ఎం రెండింటికీ చెరో 7 సీట్లు కేటాయించే అవకాశమున్నట్లు తెలిసింది. రెండు ప్రధాన కూటములతో కొనసాగుతున్న అనిశ్చితి మధ్య, ప్రశాంత్ కిషోర్ కొత్తగా ఏర్పడిన రాజకీయ సంస్థ జాన్ సూరాజ్ గురువారం 51 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతుంది. ఢిల్లీలో, బిహార్ బిజెపి సీనియర్ నేత, హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ వరుసగా రెండవ రోజు చిరాగ్ పాశ్వాన్‌తో సమావేశమయ్యారు. చర్చలు సానుకూల దిశలో సాగాయన్నారు.
అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కొనసాగుతున్న గందరగోళం ప్రాంతీయ రాజకీయ ఆకాంక్షలు, ముఖ్యంగా కుల ఆధారిత మద్దతుపై ఎక్కువగా ఆధారపడిన చిన్న పార్టీల మధ్య పెరుగుతున్న దాంతో ముడిపడి ఉంది.
ఈ ఆశయాలు బిహార్‌లో కూటమి రాజకీయాలను క్లిష్టతరం చేస్తున్నాయని స్థానిక రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రతిపక్ష కూటమిలో ఆర్‌జెడి 135–140 సీట్లలో పోటీ చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ 70 అసెంబ్లీ సెగ్మెంట్లకు డిమాండ్ చేయగా, 50–52 సీట్లను మాత్రమే ఆర్‌జెడి ఆఫర్ చేసింది. పార్టీ తన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడానికి పాట్నాలో పార్టీ సీనియర్ నాయకుల సమావేశం జరుగుతుందని ఆర్‌జెడి వర్గాలు తెలిపాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో, కాంగ్రెస్ 70 సీట్లలో పోటీ చేసింది కానీ 19 మాత్రమే గెలుచుకుంది. ఇండియా కూటమిలోని మరో పెద్ద పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టులెనినిస్ట్) లిబరేషన్ కూడా తనకు 20–25 సీట్లు ఆఫర్ చేయడం పట్ల అసంతృప్తిగా ఉంది. ఐదు సంవత్సరాల క్రితం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తాను పోటీ చేసిన 19 సీట్లలో 12 సీట్లు గెలుచుకుంది.
ఈసారి 40 సీట్లను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మొదటి దశ పోలింగ్ పాట్నా, దర్భంగా, మాధేపురా, సహర్సా, ముజఫర్‌పూర్, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, సమస్తిపూర్, బెగుసరాయ్, లఖిసరాయ్, ముంగేర్, షేక్‌పురా, నలంద, బక్సర్, భోజ్‌పూర్ వంటి కీలక జిల్లాల్లో జరగనున్నాయి.

# విద్యుత్ రంగ ప్రైవేటీకరణను తక్షణం విరమించాలి

### కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్



**న్యూఢిల్లీ :** బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే చర్యలను కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రైవేటీకరణ ప్రయత్నాల్ని నిరసిస్తూ ఆయా రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు వేదిక ఉమ్మడి ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ ఉద్యోగ సంఘాల న్యాయబద్ధ కోర్కెలను మహారాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆమోదించాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం మహారాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులు, ఇంజనీర్లు, అధికారుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన 72 గంటల రాష్ట్రవ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపింది. ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేసే లక్ష మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు మహారాష్ట్ర ప్రభుత్వం, మూడు విద్యుత్ సంస్థల యాజమాన్యం తీసుకున్న ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 09 నుండి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా 72 గంటల పాటు సమ్మె చేపట్టారు. విద్యుత్ రంగంలోని 7 ప్రధాన సంఘాలు... మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ ఫెడరేషన్, మహారాష్ట్ర వీజ్ కామ్‌గర్ మహాసంఘ్, మహారాష్ట్ర వీజ్ కామ్‌గర్ కాంగ్రెస్, సబార్డినేట్ ఇంజనీరింగ్ అసోసియేషన్, మహారాష్ట్ర రాజ్య మగస్వర్గియ విద్యుత్ కర్మచారి సంఘటన్, మహారాష్ట్ర రాజ్య స్వాభిమాని విద్యుత్ వర్కర్స్ యూనియన్, తాంత్రిక్ కామ్‌గర్ యూనియన్ సమ్మెలో చేరాయి. మొత్తం ఉద్యోగుల్లో 80% కంటే ఎక్కువ మంది సమ్మెలో ఉన్నారు. సమ్మె ప్రభావం ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విభాగాల్లో అధికంగా ఉంది. జాయింట్ యాక్షన్ కమిటీ ఆగస్టులో ముఖ్యమంత్రి, ఇంధన మంత్రి, మూడు విద్యుత్ కంపెనీల చైర్మన్లకు సమ్మె నోటీసు జారీ చేసినప్పటికీ వారు ఉద్దేశపూర్వకంగా చర్చలను ఆలస్యం చేయడానికి ప్రయత్నించారని ...దీంతో యూనియన్లు సమ్మె నోటీసు జారీ చేయాల్సి వచ్చిందని... అక్టోబర్ 6న ముంబైలో జరిగిన చర్చలు ఎటువంటి పరిష్కారానికి రాకపోవడంతో యూనియన్లు 72 గంటల సమ్మె ప్రకటించాయని ఉమ్మడి ప్రకటన వెల్లడించింది. విద్యుత్ పంపిణీ సంస్థలోని 24 డివిజన్లను అదానీ, టొరెంట్ కంపెనీకి అప్పగించడాన్ని విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థలకు 329 విద్యుత్ సబ్ స్టేషన్‌లను, ట్రాన్స్‌మిషన్ సంస్థకు చెందిన రూ. 200 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన ప్రాజెక్టులను ప్రైవేట్ పార్టీలకు అప్పగించడం, ట్రాన్స్‌మిషన్ కంపెనీని షేర్ మార్కెట్‌లో జాబితా చేయడం వంటి చర్యల్ని తీవ్రంగా నిరసిస్తున్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, అన్ని రిజర్వేషన్ పోస్టులను భర్తీ చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పునర్నిర్మాణ ప్రక్రియను ఏకపక్షంగా అమలు చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి. కాగా గురువారం నాగపూర్‌లో సమ్మె చేస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లు భారీ ప్రదర్శన నిర్వహించి చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అదేవిధంగా ముంబై, కళ్యాణ్‌లలో భారీ ప్రదర్శనలు జరిగాయి. జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అందరూ ప్రసంగించారు.
ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గత 300 రోజులకు పైగా యూపీ రాష్ట్ర విద్యుత్ కార్మికులు పట్టుదలతో చేస్తున్న పోరాటాన్ని కేంద్ర కార్మిక సంఘాలు ప్రశంసించాయి.

# మరియా కొరీనాకు నోబెల్ 'శాంతి'

**ఓస్లో :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజులా ప్రతిపక్ష నేత, గతంలో అధ్యక్ష పదవికి పోటీపడిన మరియా కొరీనా మచాడోకు దక్కింది. నోబెల్ కమిటీ నిర్ణయాన్ని స్వీడిష్ అకాడెమీ ప్రకటించింది. నియంతృత్వ పాలన కింద ఉన్న వెనెజులాను ప్రజాసామ్య దేశంగా మార్చేందుకు ఆమె శాంతియుత పోరాటం సాగించారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. లెక్కలేనన్ని బెదిరింపులు వచ్చినప్పటికీ మరియా తన ప్రయత్నాలను మానలేదు. గత ఏడాది కాలంగా ఆమె అజ్ఞాతంలోనే ఉంటున్నారు. వెనెజులాలో సైనిక పాలనను వ్యతిరేకించి, శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం కృషి చేస్తున్న ఎంతో మందికి మరియా స్ఫూర్తినిస్తున్నారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. 2002లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె, 2011 నుంచి 2014 వరకు వెనెజులా జాతీయ అసెంబ్లీ సభ్యురాలిగా వ్యవహరించారు. 2012లో వెనెజులా అధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా, ప్రజల్లో ప్రజాస్వామ్యంపై ఉత్తేజపరుస్తున్నారు. కాగా, ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం మొత్తం 338 నామినేషన్లు వచ్చాయి. అనేకానేక పరిశీలనలు, సమీక్షలు, వడపోతల అనంతరం అకాడెమీ సభ్యులు మరియాను ఎంపిక చేశారు. మొత్తం మీద 1901 నుంచి ఇప్పటివరకు నోబెల్ శాంతి బహుమతిని 105 సార్లు ప్రకటించారు. 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. గతేడాది హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన పోరాడుతున్న జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థకు నోబెల్ శాంతి పురస్కారం దక్కింది. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా, జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు. ఇలావుంటే, ఈనెల 6న వైద్యరంగంలో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన, 13వ తేదీ వరకు జరగనుంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రంలో, గురువారం సాహిత్యంలో, శుక్రవారం శాంతి విభాగంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. చివరగా అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటించనున్నారు.

**ఎనిమిది యుద్ధాలు ఆపాను : డొనాల్డ్ ట్రంప్**

భారత్–పాకిస్థాన్ యుద్ధంతోసహా తాను మొత్తం ఎనిమిది యుద్ధాలను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏమీ సాధించకపోయినప్పటికీ, 2009లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేశారని విమర్శించారు.

# దళితులు, అణగారినవర్గాలపై బెదిరింపు రాజకీయాలు!

### ఇవి ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** దేశంలో దళితులు, అణగారిన వర్గాలపై దాడులకు సంబంధించి బిజెపిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. హర్యానాలో కుల వివక్ష కారణంగా ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకున్నారనే ఆరోపణలపై స్పందిస్తూ ప్రస్తుత ప్రభుత్వంలో దళితులు, సమాజంలోని ఇతర బలహీన వర్గాలపై నేరాలు పెరుగుతున్నాయని, అణగారిన వర్గాలను బెదిరించడం, అణచివేయడం వంటి ఈ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తాయని కాంగ్రెస్ పేర్కొంది. తాజా జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదికను ఉటంకిస్తూ 2013–2023 మధ్యకాలంలో దళితులపై నేరాలు 46 శాతం పెరిగాయని, ఆదివాసీలపై నేరాలు 91 శాతం పెరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఐపిఎస్ అధికారి పురాణ్ కుమార్ ఆత్మహత్య కులం పేరుతో మానవాళిని నలిపివేస్తున్న లోతైన సామాజిక విషానికి ప్రతీక అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. 'హర్యానాలో ఐపిఎస్ అధికారిపై కుల వివక్ష, హరిఓం వాల్మీకిపై వేధింపులు, సిజెఐపై దాడి, దానిని సమర్థిస్తున్న బిజెపి మనస్తత్వం, ఆ పార్టీ పాలిత రాజస్థాన్‌లోని సవాయి మాధోపూర్ జిల్లాలో వృద్ధ దళిత మహిళ కమలా దేవి రాయ్‌గర్‌పై జరిగిన దారుణాలు.... ఘటనలన్నీ కేవలం వివిక్త ఘటనలు మాత్రమే కాదు, ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి భూస్వామ్య మనస్తత్వానికి ప్రమాదకరమైనవి అని ఖర్గే పేర్కొన్నారు. ఈ ఘటనల గొలుసు భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం, సమానత్వ ప్రాథమిక సూత్రాలపై ప్రత్యక్ష దాడి అని, దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలను బెదిరించడం, అణచివేయడం అనే ఈ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయన్నారు. భారతదేశంలో రాజ్యాంగం ద్వారా పరిపాలన జరుగుతుదని, ఏదైనా తీవ్రవాద భావజాలం ఆజ్ఞల ద్వారా కాదని ఖర్గే హిందీలో ఎక్స్‌లో పోస్టు చేశారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, సమాజంలోని ఇతర బలహీన వర్గాలు దీని భారాన్ని భరిస్తున్నారని, బిజెపి స్వంత కళ్ళజోడులో మునిగిపోతూ ఈ సమస్యలపై కళ్ళు మూసుకుని ఉందని మండిపడ్డారు. హర్యానా ఐపిఎస్ ఆత్మహత్య కులం పేరుతో మానవాళిని అణిచివేస్తున్న లోతైన సామాజిక విషానికి చిహ్నమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఒక ఐపిఎస్ అధికారి తన కులం కారణంగా అవమానం, అణచివేతను భరించాల్సి వచ్చినప్పుడు ఒక సాధారణ దళిత పౌరుడు ఎలాంటి పరిస్థితుల్లో జీవిస్తాడో ఊహించుకోండని లోకసభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాయ్‌బరేలిలో హరిఓం వాల్మీకి హత్య, భారత ప్రధాన న్యాయమూర్తికి అవమానం, ఇప్పుడు కుమార్ మరణం అణగారిన వర్గాలపై అన్యాయం దాని పరాకాష్టకు చేరుకుందని చూపించే ఘటనలు అని ఆయన పేర్కొన్నారు. బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ ద్వేషం మనువాద భావజాలం సమాజాన్ని విషంతో నింపాయని, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ముస్లింలు క్రమంగా న్యాయం జరుగుతుందన్న ఆశను కోల్పోతున్నారన్నారు. ఈ పోరాటం కేవలం పురాణీల పోరాటం కాదు.. ఇది రాజ్యాంగం, సమానత్వం, న్యాయంపై నమ్మకం ఉన్న ప్రతి భారతీయుడి పోరాటమని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కుల ఆధారిత వేధింపులతో బాధపడుతున్న కుమార్ ఆత్మహత్యతో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నాలుగు వారాల్లోగా స్పందన తెలపండి

### జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్రానికి 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని కేంద్రం ఇచ్చిన హామీని త్వరగా అమలు చేయాలని విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక, రాజకీయ కార్యకర్త అహ్మద్ మాలిక్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ 2023 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా చేసిన హామీని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఈ క్రమంలోనే పిటిషన్ల దాఖలుపై కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించి సంప్రదింపులు జరుగుతున్నాయని కోర్టుకు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించామని, అక్కడ ప్రభుత్వం మనుగడలో ఉందని తెలిపారు. గత ఆరేళ్లుగా జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఇది చాలా ప్రత్యేకమైన సమస్య అని, ఇందుకోసం అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది వ్యక్తులు కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని సొలిసిటర్ జనరల్ ఆరోపించారు.

**ఆర్టికల్ 370 రద్దు :** 2019 ఆగస్టు 5న జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం 2023 డిసెంబర్ 11న ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే అని తీర్పునిచ్చింది. ఆర్టికల్ 370 తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ శాశ్వతం కాదని, జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. అయితే, సెప్టెంబర్ 2024 నాటికి కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, దీంతో పాటు రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించింది. కాగా, ఇటీవల కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టారు. లేహ్ ఏపెక్స్ బాడీ (ఎల్‌ఎబి) యువ విభాగానికి చెందిన 15 మంది యువత సెప్టెంబర్ 10 నుంచి 35 రోజుల నిరహార దీక్షకు దిగారు. అయితే, వారిలో ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్‌ఎబి యువజన విభాగం బుధవారం బంద్, నిరసనకు పిలుపునిచ్చింది. వందలాది యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్, బ్లాకింగ్ కోరుతూ దాఖలైన పిటిషన్ల...
## విచారణకు 'సుప్రీం' తిరస్కృతి

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా ఖాతాల సస్పెన్షన్ , బ్లాకింగ్‌కు సంబంధించి సోషల్ మీడియా మధ్యవర్తులను నియంత్రించడానికి పాన్‌ఇండియా మార్గదర్శకాలను కోరుతూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది.ఇద్దరు పిటిషనర్లు తమ పిటిషన్లను ఉపసంహరించడానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. ఈ పిటిషనర్ల నుద్దేశించి న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస సందీప్ మెహతా ధర్మాసనం మాట్లాడుతూ తగిన ఫోరం ముందు అందుబాటులో ఉన్న ఏదైనా పరిష్కారాన్ని కోరుకునే స్వేచ్ఛ వారికి ఉ ందని చెప్పింది. పిటిషనర్ల తరపు న్యాయవాది ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కస్టమర్లతో కమ్యునికేట్ చేయడానికి ఉపయోగించిన వారి వాట్సాప్‌ను బ్లాక్ చేశారని తెలిపారు. 'ఇతర కమ్యునికేషన్ల అప్లికేషన్లు ఉన్నాయి. మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు' అని గమనించిన ధర్మాసనం పిటిషనర్ల వాట్సాప్‌ను ఎందుకు బ్లాక్ చేశారని అడిగింది. వారికి ఎటువంటి కారణం చెప్పలేదని న్యాయవాది చెప్పారు.
ఆ తర్వాత 'వాట్సాప్‌ను యాక్సెస్ చేయడానికి మీకున్న ప్రాథమిక హక్కు ఏమిటి ?' అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 32 ఆర్టికల్ కింద నేరుగా సుప్రీం కోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం పిటిషనర్లను ప్రశ్నించింది.


## FORMAT C-7
(for political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates.

(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition (C) no. 2192 of 2018 in WP((A no.536 of 2011)

**Name of Political Party** : **INDIAN NATIONAL CONGRESS**

**Name of the Election** : **BYE ELECTION TO TELANGANA LEGISLATIVE ASSEMBLY**

**Name of State/UT** : **TELANGANA STATE**

**Name of the Constituency** : **61-JUBILEE HILLS**

**Name of the Candidate** : **V NAVEEN YADAV**

| Sl. No. | | | |
|---|---|---|---|
| 1 | **Criminal antecedents** | | |
| | a. | Nature of the offences | 1. Bribery, undue influence, or illegal inducements during elections.<br>2. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation.<br>3. Trespass and deliberate disobedience of order.<br>4. Criminal Intimidation.<br>5. Cheating and Criminal Intimidation.<br>6. Wrongful Restraint, Criminal Intimidation.<br>7. No Knowledge about description of the Offence. |
| | b. | Case no. | 1. FIR No 655/2025,Madhura Nagar PS, 123(1), 123(2) The Representation of People Act, 1951,170,171,174 of BNS<br>2. FIR No 575/2021,Jubilee Hills PS, 109, 505(2) & 506 of IPC<br>3. FIR No 340/2021,Jubilee Hills PS, 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act<br>4. FIR No 95/2021,Jubilee Hills PS, 506 of IPC<br>5. FIR No 93/2021,Jubilee Hills PS, 420 and 506 of IPC<br>6. FIR No 55/2021,Jubilee Hills PS, 341, 506, 509 r/w 143 of IPC<br>7. CR No 395/2006,Jubilee Hills PS, 406, 420 & 506 of IPC |
| | c. | Name of the Court | 1. Summons not yet served<br>2. CC No 12608/2021,XVII ACMM, Nampally<br>3. Not Applicable<br>4. CC No 11727/2021,XVII ACMM, Nampally<br>5. CC No 10432/2021,XVII ACMM, Nampally<br>6. CC No 8134/2021,XVII ACMM, Nampally<br>7. Summons not yet served |
| | d. | Whether charges have been framed or not (Yes/No) | No |
| | e. | Date of conviction, if any | No |
| | f. | Details of punishment undergone, if any | No |
| | g. | Any other information required to be given | NIL |
| 2 | | The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words) | He is a well-educated person and also a dynamic youth leader having potentialities in solving the problems of the masses. |
| 3 | | Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words) | As per wishes of the congress workers of the constituency. |

**T.KUMAR RAO**
Vice President
Authorized Signatory

ప్రజాపక్షం
శనివారం, 11 అక్టోబరు

## లీగల్ చిక్కుల్లో బిసి రిజర్వేషన్‌లు

స్థానిక సంస్థల (పంచాయతీరాజ్, పురపాలక సంఘాలు) ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (ఒబిసిలు) 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్న పాలక కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలపై రాష్ట్రంలో రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ అది పరస్పర రాజకీయ నిందల్లో, లీగల్ అవరోధాల్లో చిక్కుకోవటం విచారకరం. రిజర్వేషన్‌లను 42శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీచేసిన జి.ఒ.నెం.9పై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం గురువారం తాత్కాలిక స్టే విధించటం, ఆ జిఓను అనుసరించి పంచాయతీరాజ్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (8వ తేదీన హైకోర్టులో విచారణ ఉందని తెలిసీ) జారీ చేసిన నోటిఫికేషన్‌నూ హైకోర్టు నిలుపుదల చేయటంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. రాష్ట్రప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేందుకు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలన్నీ చివరి దశకు చేరి, ఇక హైకోర్టు అనుమతి మంజూరే తరువాయి అని రాష్ట్రంలోని కోట్లాదిమంది ఒబిసిలు ఆశతో ఎదురుచూస్తుండగా హైకోర్టు తాత్కాలిక స్టే పిడుగుపాటు అయింది. వారు ఆశాభంగంతో రగిలిపోతున్నారు. బిసిల నోటికాడ కొచ్చిన ముద్ద లాక్కున్నారని బిసి నాయకులు వాపోతున్నారు. బంద్‌కు కూడా సిద్ధమవుతున్నారు. అయితే నిరసన ఎవరికి వ్యతిరేకం? ప్రముఖ బిసి నాయకుడు కృష్ణయ్య బిజెపి రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. ఆయన పోరాటం న్యాయంగా మోదీ ప్రభుత్వంపై ఎక్కుపెట్టాలి. రాష్ట్ర బిజెపి నాయకులేమో రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆయనేమో గాలిలో పోరాటం చేస్తూ అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నారు.

అన్ని రకాల రిజర్వేషన్‌లు 50శాతం దాటరాదని ఇందిరా సాహ్ని కేసులో సుప్రీంకోర్టు విధించిన లక్ష్మణరేఖ బిసి రిజర్వేషన్‌ల పెంపుదలకు ప్రధాన అవరోధం. అయితే ఆ తీర్పు విద్య, ఉద్యోగాలకే పరిమితమన్న వాదన ఉంది. అంతేగాక మోదీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇడబ్ల్యుస్) 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయటం, దాన్ని సుప్రీంకోర్టు ఆమోదించటంవల్ల లక్ష్మణరేఖ ఎప్పుడో చెదిరిపోయిందన్న వాదన ఉంది. అయినప్పటికీ బిసి రిజర్వేషన్‌ల పెంపుదలకు బిహార్, మహారాష్ట్ర ప్రభుత్వాల చర్యలను సుప్రీంకోర్టు అనుమతించలేదు. అయితే 60శాతంపైగా రిజర్వేషన్‌లున్న తమిళనాడు ఉదంతమూ ఇక్కడ ప్రస్తావనార్హం. దానికి సుప్రీంకోర్టు ఆమోదం హేతుబద్ధంగా జరిగిందా, నాటి కేంద్రప్రభుత్వంపై తమిళనాడు రాజకీయ ఒత్తిడి కింద జరిగిందా అనే భిన్నవాదనలున్నాయి. ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్‌లు సిఫారసు చేసిన బి.పి.మండల్ కమిషన్ కూడా – ఒబిసిలు 50శాతంపైగా ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు విధించిన 50శాతం లక్ష్మణరేఖకు లోబడి 27శాతం సిఫారసు చేసారు. అయితే తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇటువంటి కొన్ని కేసుల్లో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో 50 శాతం మించవచ్చని, అయితే అందుకు కొన్ని నియమాలను సంతృప్తి పరచాలని చెప్పింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాన్ని ఆసరా చేసుకుని కులగణన సర్వే నిర్వహించగా తెలంగాణలో బిసి కులాలవారు 57.6 శాతం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దాని ప్రకారం స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో ఒబిసిలకు 42శాతం రిజర్వేషన్ నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ నియమించింది, సబ్ కమిటీ ఏర్పాటు చేసింది, మంత్రివర్గం ఆమోదం తీసుకుంది. శాసనసభల్లో చట్టసవరణ ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఆయన నిర్ణయం తీసుకోకుండా దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. ప్రభుత్వం ఆ తర్వాత ఆర్డినెన్స్ జారీ చేసింది. దాని ప్రకారం మళ్లీ చట్టసవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం పొందింది. శాసన ఉభయసభల్లో బిఆర్‌ఎస్, బిజెపి సహా అన్ని పక్షాల ఏకగ్రీవామోదం లభించింది. బిల్లుల ఆమోదంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రభుత్వం తరపున ఢిల్లీ రాంలీలామైదాన్‌లో ధర్నా నిర్వహించారు. అయినా కేంద్రప్రభుత్వంలో చలనం లేదు. అయితే శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆమోదం లేదా త్రిప్పిపంపటం మూడు నెలల్లో జరగకపోతే, రాష్ట్రపతికి నివేదించిన బిల్లులపై అక్కడనుంచి మూడు నెలల్లో సమాధానం రాకపోతే ఆ బిల్లులు ఆమోదం పొందినట్లే పరిగణించబడుతుందని తమిళనాడు గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం – తెలంగాణ అసెంబ్లీ బిల్లుకు ఆరుమాసాలు గడిచిందని లెక్కలు వేసుకుని (దాన్ని నోటిఫై చేయటం మరిచారు) రాష్ట్ర ప్రభుత్వం జిఒ 9 జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లగా స్టే దొరకలేదు. దానిపై వారు సుప్రీంకోర్టుకు వెళ్లగా, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశంపై తాము స్టే ఇవ్వలేమని, అందువల్ల హైకోర్టుకే వెళ్లమని వారికి సలహా ఇచ్చింది. దాని పర్యవసానమే 8,9 తేదీల్లో విచారణ.

ముస్లింల్లోని బిసి వృత్తులవారిని చేర్చారని బిజెపి మొదటినుంచీ వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదని, రాజకీయ ప్రయోజనం కోసమే బిసి రిజర్వేషన్ నాటకం ఆడుతోందని బిఆర్‌ఎస్ విమర్శిస్తోంది. రాజకీయ స్వలాభంతో ఇక్కడ బిఆర్‌ఎస్, ఢిల్లీలో బిజెపి అడ్డుపడుతున్నాయని కాంగ్రెస్ విమర్శిస్తోంది. హైకోర్టు స్టే తర్వాత కూడా ఆ పార్టీ నాయకుల పరస్పర ఆరోపణల బాణీ అదే. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం రాజకీయ, లీగల్ పోరాటం సాగిస్తాయని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎపి కాంగ్రెస్ ప్రభుత్వ బిల్లును 6వ షెడ్యూల్లో చేర్చటం లేదా రాజ్యాంగ సవరణ చేయటం జరిగే పనికాదు. అందువల్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధి, నిజాయితీతో ప్రయత్నించినా ఈ వివాదం ఇప్పట్లో తేలేది కాదు. బిల్లుల ఆమోదానికి సుప్రీంకోర్టు గడువు విధించటంపై వివరణ కోరుతూ రాష్ట్రపతి పంపిన నివేదనపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ ముగిసి తీర్పు రిజర్వులో ఉంది. ఆ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా రావచ్చన్న ఆశ మిణుకుమిణుకుమంటోంది. అయితే ఈ రాజకీయ, లీగల్ జగడంలో చిక్కి స్థానిక ఎన్నికలు వాయిదా పడుతూ ఉండటంవల్ల ఆ సంస్థలకు కేంద్ర నుంచి రావలసిన నిధులు ఆగిపోయి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అలాగే సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు జరపాలన్న హైకోర్టు తీర్పు ప్రభుత్వం మెడపై ఉంది. అందువల్ల న్యాయనిపుణులతో చర్చించి మరింత జాగుకాని రీతిలో ఏది ఉత్తమ పరిష్కారమో రాష్ట్రప్రభుత్వం దాన్ని ఎంచుకోవాలి. 42 శాతం సాధించేవరకు ఎన్నికలు జరపకపోతే నష్ట పోయేది గ్రామీణ ప్రజలు, ఎదురుదెబ్బ తగిలేది రాష్ట్ర ప్రభుత్వానికి. ఉన్నతస్థాయి లీగల్ అభిప్రాయం పొందిన తదుపరి అఖిలపక్ష సమావేశం పిలిచి వారితో అభిప్రాయాలు పంచుకోవాలి. ఇది ప్రతిష్ట కోసం పెనుగులాడాల్సిన అంశం కాదు. ఎవరి చిత్తశుద్ధి ఎంతో ప్రజలే నిర్ణయిస్తారు.

# ఆ న్యాయవాదిని వదిలేయడం న్యాయవ్యవస్థకు నష్టం

కె.రవీంద్రన్

ఈ వారం కోర్టు గదిలో ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ తనపై బహిరంగ కవ్వింపు చర్యను గౌరవప్రదమైన నిగ్రహంతో ఎదుర్కొన్న తీరు అనేకమంది ప్రశంసలను అందుకుంది. అయితే, ఇది న్యాయ సంస్థల పవిత్రత, సంస్థాగత అధికారంపై దాడి జరిగినప్పుడు వ్యక్తిగత ఔదార్యానికి ఉన్న పరిమితుల గురించి ఒక లోతైన సంభాషణను తిరిగి రగిలించింది. 71 ఏళ్ల న్యాయవాది రాకేశ్ కిషోర్ బహిరంగ కోర్టులో ఆయనపైకి షూ విసిరినప్పుడు, ప్రధాన న్యాయమూర్తి చలించకపోవడమే కాకుండా తప్పు చేసిన ఆ న్యాయవాదిపై క్రిమినల్ చర్యలు చేపట్టడానికి కూడా నిరాకరించారు.

ఈ అసాధారణమైన సంయమనం, దయతో కూడుకున్నది, మానవత్వంతో నిండినది. ఇది దాడిచేసిన వ్యక్తి అవలంభించిన మొరటు, ధిక్కారపూరిత ప్రవర్తనకు పూర్తి విరుద్ధంగా నిలిచింది. అయినప్పటికీ, ప్రధాన న్యాయమూర్తి ప్రతిస్పందన వ్యక్తిగత మర్యాదలో స్పందించే ఈ కాలంలో, ఆయన ప్రతీకారం తీర్చుకోవడానికి నిరాకరించడం చాలా అరుదైనది, ఉత్తేజపరిచేది. చట్టం వ్యక్తుల ద్వారా తనను తాను ప్రతీకారం తీర్చుకోవాల్సిన అవసరం లేదని, తద్వారా సంస్థల బలంపై ఆయనకు ఉన్న లోతైన విశ్వాసాన్ని ఇది ప్రదర్శించింది. అయితే, ఇక్కడ ఒక వైరుధ్యం ఉంది. దేశంలోని అత్యున్నత న్యాయమూర్తి అటువంటి దాడిని సంస్థాగత నేరంగా కాకుండా వ్యక్తిగత అవమానంగా పరిగణించినప్పుడు, అది న్యాయవ్యవస్థ సమిష్టి గౌరవాన్ని దెబ్బతీసే ఒక సంప్రదాయాన్ని ఏర్పరిచే ప్రమాదం ఉంది. క్షమ అనేది వ్యక్తిగత ధర్మం, న్యాయం అనేది సమిష్టి బాధ్యత. ఉద్దేశం ఎంత గొప్పదైనా, ఈ రెండింటిని కలపడం అనవసర పరిణామాలకు దారితీయవచ్చు.

ఇక్కడ కేవలం ఒక వ్యక్తి దుష్ప్రవర్తన గురించి కాదు, అటువంటి ప్రవర్తనను సృష్టించే మనస్తత్వం గురించి ఆందోళన. రాకేష్ కిషోర్ స్వయంగా అంగీకరించినట్లుగా, ఒక దేవుడి గురించి ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యపై ఆయనకు కలిగిన కోపం నుండి ఆయన చర్య వెలువడింది. ఆ వ్యాఖ్యను ఆయన అవమానకరంగా భావించాడు. ప్రాయాన్ని కలిగించే ప్రమాదం ఉంది.నమ్మకం పేరుతో వచ్చిన కోపానికి భావోద్వేగంలో మినహాయింపు లభించవచ్చనే అభిప్రాయాన్ని ఏర్పరుస్తుంది.

ఇటీవలి కాలంలో దేశంలో నిరసన ముసుగు వేసుకున్న దూకుడుతనంతో జరిగిన అనేక సంఘటనలలో వ్యక్తులు లేదా సమూహాలు విశ్వాసం, సిద్ధాంతం లేదా రాజకీయ ఫిర్యాదుల ఆధారంగా హింస లేదా ధిక్కారపూరిత ప్రవర్తనను సమర్థించుకుంటున్నారు. ఈ సందర్భాన్ని ప్రత్యేకంగా కలవరపరిచే అంశం ఏమిటంటే, ఇది న్యాయస్థానంలోనే జరిగింది. ఇది వివేకానికి చివరి ఆశ్రయం కావాల్సిన చోటు. న్యాయవ్యవస్థ, దాని లోపాలెన్ని ఉన్నప్పటికీ, రాజకీయ, సైద్ధాంతిక విభాగాల అంతటా గౌరవాన్ని పొందుతున్న ఏకైక సంస్థగా అది కొనసాగుతుంది. ఇటువంటి చర్యను శిక్షించకుండా వదిలి వేయడం ఆ గౌరవాన్ని కొద్దిగానైనా కోల్పోయేలా చేస్తుంది. ఇది నిజమైన లేదా ఊహాజనిత ఫిర్యాదులు ఉన్న ఇతరులు అనుకరించడానికి ధైర్యం తెచ్చుకునే ఒక ఉదాహరణను ఏర్పరుస్తుంది.

మానవత్వంతో కూడిన వాదన ఒకటి ఉంది. కిషోర్‌కు 71 ఏళ్ళ,



న్యాయవ్యవస్థ, దాని లోపాలెన్ని ఉన్నప్పటికీ, రాజకీయ, సైద్ధాంతిక విభాగాల అంతటా గౌరవాన్ని పొందుతున్న ఏకైక సంస్థగా అది కొనసాగుతుంది. ఇటువంటి చర్యను శిక్షించకుండా వదిలి వేయడం ఆ గౌరవాన్ని కొద్దిగానైనా కోల్పోయేలా చేస్తుంది. ఇది నిజమైన లేదా ఊహాజనిత ఫిర్యాదులు ఉన్న ఇతరులు అనుకరించడానికి ధైర్యం తెచ్చుకునే ఒక ఉదాహరణను ఏర్పరుస్తుంది.

అత్యున్నత ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నప్పటికీ, ఇటువంటి సంఘటనలను కేవలం వ్యక్తిగత అవమానాలుగా పరిగణించాలా లేక న్యాయ సంస్థపై ప్రత్యక్ష దాడులుగా పరిగణించాలా అనే దాని గురించి ఇబ్బందికర ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

బరితెగింపుతో కూడిన ఈ సంఘటన, న్యాయవ్యవస్థ మర్యాద హృదయాన్ని తాకింది. కోర్టు గది అనేది కేవలం వాదనలు, తీర్పుల కోసమే పరిమితమైన ప్రదేశం కాదు. ఇది చట్టబద్ధ నిబంధనలకు చిహ్నం. ఆ ప్రదేశంలోనే ఉల్లంఘన జరిగితే, అదీ కూడా ప్రత్యేకించి దాని గౌరవాన్ని కాపాడుతానని ప్రమాణం చేసిన న్యాయవాదే ఉల్లంఘనకు పాల్పడినప్పుడు, నష్టం కేవలం వ్యక్తిగతం లేదా సంకేతాత్మకం కాదు, అది వ్యవస్థాగతమైనది. ప్రధాన న్యాయమూర్తిపైకి బూటు విసరడం ద్వారా, కిషోర్ కేవలం ఒక వ్యక్తిని అవమానించలేదు, ఆయన న్యాయవ్యవస్థ నైతిక, విధానపరమైన అధికారంపై దాడి చేశాడు. న్యాయవాది చెప్పుకున్నట్లుగా, ఆ చర్య కేవలం నిరసన వ్యక్తీకరణ కాదు, ఇది సంస్థ పవిత్రతను ఉద్దేశపూర్వకంగా భంగపరచడం. ఈ కోణంలో చూస్తే, ప్రధాన న్యాయమూర్తి క్రిమినల్ చర్యను చేపట్టడాన్ని నిరాకరించడం, ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, ఈ దాడి తీవ్రతను తగ్గించినట్లుగా అనిపించవచ్చు.

న్యాయమూర్తి గవాయ్ చర్య క్షమాగుణం, నైతిక శక్తికి నిదర్శనం అనే వాదన దారితప్పొచ్చు. ప్రముఖులు, ప్రత్యేకించి అధికారం స్థానాలలో ఉన్నవారు తరచుగా విమర్శలకు శిక్షాత్మక ఉత్సాహంతో ప్రతి మతపరమైన భావోద్వేగాన్ని న్యాయపరమైన అధికారంతో కలపడం అనేది సమకాలీన భారతదేశంలో ఆందోళన కలిగించే ధోరణికి సంకేతం. ఇక్కడ న్యాయవ్యవస్థ కూడా జనరంజక, మతపరమైన ఉద్వేగాల సుడిగుండంలోకి లాగబడుతోంది. న్యాయవాది ప్రవర్తన వ్యక్తిగత విశ్వాసం, భావోద్వేగం రాజ్యాంగబద్ధమైన అధికారులపై ధిక్కారపూరిత చర్యలను సమర్థించగలదనే విశ్వాసం ఒక ప్రమాదకరమైన అర్హత భావనను ప్రతిబింబిస్తుంది. దీనిని ఒక విడిగా బద్ధలైన వ్యక్తీకరణగా పరిగణించడం తప్పు అవుతుంది. ఇది పౌర క్రమశిక్షణ, సంస్థల పట్ల గౌరవంలో లోతైన క్షీణతను సూచిస్తుంది. దీనిని ఇలాగే వదిలేస్తే ఇతరులకు కూడా ధైర్యాన్ని ఇస్తుంది.

సంఘటన జరిగిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి చలించకుండా కోర్టు విచారణలను కొనసాగించడం ప్రశంసనీయం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా జీవితంలో కొద్దిమంది మాత్రమే కనబరచగలిగే ఒక అరుదైన నిగ్రహాన్ని ఇది వెల్లడించింది. అయితే, వ్యక్తులలాగా కాకుండా, సంస్థలు కోపం లేదా కరుణ వంటి భావోద్వేగాల ద్వారా నడపబడటానికి వీలు లేదు. చట్ట నిబంధనలు అనేది దానిని సమర్థించే వారి వ్యక్తిగత ఔదార్యంపై కాకుండా, చట్టపరమైన నిబంధనలను స్థిరంగా, నిష్పాక్షికంగా అమలు చేయడంపై ఆధారపడి ఉంటుంది. న్యాయస్థానం అనే పవిత్ర స్థలంలో ఒక న్యాయవాది నేరపూరిత చర్యకు పాల్పడినప్పుడు, వ్యవస్థ తనకు తానుగా దృఢంగా స్పందించాలి. అలా చేయడంలో విఫలమైతే న్యాయవ్యవస్థపై మర్యాద ఐచ్ఛికం అనే అభి

బహుశా వయస్సు, నిరాశ లేదా భావోద్వేగ అస్థిరత ఆయన ప్రవర్తనకు కారణమై ఉండవచ్చు. ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం కరుణతో లేదా ఒక వృద్ధుడి తప్పుడు అంచనా కారణంగా నేరస్తుడిని చేయకూడదనే ఉద్దేశ్యంతో ప్రేరేపించబడి ఉండవచ్చు. కానీ, ఆ కరుణ జవాబుదారీతనం చట్రంలో వ్యక్తం చేయబడి ఉండవచ్చు. క్షమాభిక్ష కారణంగా పర్యవసానం లేకుండా వదిలివేయాల్సిన అవసరం లేదు. నిజానికి, ఆ రెండు సహజీవనం చేయగలవు. చట్టం దయతో కూడినప్పటికీ, ఉద్దేశం ఏదైనప్పటికీ న్యాయవ్యవస్థ పట్ల హింస, అగౌరవాన్ని సహించకూడదనే సూత్రాన్ని సమర్థించాల్సిందే.

ఏదైతేనేమి, ఈ సంఘటన బూటు విసరడం గురించి తక్కువగా, అది సూచించే విషయం ఎక్కువగా ఉంది. ఇది ప్రజల నిగ్రహం నశించడం, ఒకప్పుడు తిరుగులేని గౌరవాన్ని పొందిన సంస్థల పట్ల ధిక్కారం నెమ్మదిగా సాధారణీకరణ చెందడం గురించి. న్యాయమూర్తి గవాయి ఔదార్యం ఒక వ్యక్తిగా ఆయనకు ప్రశంసలను తెచ్చిపెట్టింది. కానీ న్యాయవ్యవస్థ తన సంస్థాగత గౌరవాన్ని ఎలా కాపాడుకోవాలనే దాని గురించి కూడా ఒక చర్చను రేకెత్తించింది. క్షమ ద్వారా హృదయాలను గెలుచుకోవచ్చు, కానీ అది వ్యవస్థ రక్షణలను నీరుగారుస్తుంది. దయతో కూడిన చర్యను సంస్థాగత బలహీనతగా పొరబడకుండా ఉండాలంటే, ఈ రెండింటి మధ్య గీతను జాగ్రత్తగా గీయాలి.

(ఐపిఎ సర్వీస్)

# విలువల విధ్వంసాన్ని ఆపేదెవరు?

పెళ్లి శాశ్వతంగా ఉండే బంధం కాదనే అభిప్రాయం ఈ మధ్య చాలామందిలో వచ్చిందేమో అని అనిపిస్తుంది. పరిసరాల ప్రభావం, నిర్లిప్త ధోరణి, దేనిపట్ల స్పందించని మనస్తత్వం, మంచి చెడలను విశ్లేషించలేకపోవడం, మరీ ముఖ్యంగా సామాజిక సమగ్రత పట్ల కనీస అవగాహన లేకపోవడం, ఎదుటి వ్యక్తుల కులం, మతం, ప్రాంతం, భాష, సంస్కృతి పట్ల ఏహ్యాభావం పెంచుకుంటున్నారు. సమాజ పురోగతికి కారణమైన మంచి మానవ సంబంధాలు లేకపోవడం, అలాగే కూలుతున్న కుటుంబ వ్యవస్థ, ఆర్థిక దిగజారుడు, నీచ సంస్కృతి, అభిప్రాయ బేధాలు, అలవాట్లు, కట్టుబాట్లు, అంతరాలు, మనుషుల మధ్య విచ్ఛిన్నానికి కారణమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వంధత్వం, భావోద్వేగాల అసమానతలు, ఒత్తిడి, ఆందోళన, కోపం, చిరాకు అనారోగ్య కారణాలు శాశ్వత బంధానికి ముగింపు పలుకుతున్నాయి. ఇక్కడ పెళ్లి చేసుకుని విదేశాలకు తీసుకెళ్లడం అక్కడ వారి నిజస్వరూపం తెలియడం చేసేదేమీ లేక సర్దుకుపోవడం లేక విడాకులు తీసుకోవడం సామాన్యమైంది. స్త్రీలలో ఎక్కువగా ఫ్రిజిడిటీ లేదా లైంగిక ఆసక్తి లేకపోవడాన్ని (లైంగిక ఉదాసీనత) లేదా తగిన పరిస్థితులు లైంగిక సంతృప్తి పొందలేకపోవడానికి సూచిస్తుంది. దీన్ని 'హైపోగైనస్మస్' అంటారు.

మానవ సంబంధాలు అంటే వ్యక్తులు ఒకరితో ఒకరు ఎలా వ్యవహరిస్తారో తెలిపే పరస్పర చర్యలు. ఇవి స్నేహం, ప్రేమ, ఆత్మీయత, ఆప్యాయత వంటి భావనలను కలిగి ఉంటాయి. పనిప్రదేశంలో సామాజిక సంబంధాలపై పరిశోధన చేసే 'హ్యూమన్ రిలేషన్స్' అనే రంగంలో, మానవ ప్రవర్తనను అర్థం చేసుకోవ డం, వ్యక్తిగత, వృత్తిపరమైన సంబంధాలను మెరుగుపరచడం పై దృష్టి పెడతారు. కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనమేం చేయాలి కుటుంబ వ్యవస్థను అర్థం చేసుకోవాలి. ముందుగా మనకున్న కుటుంబం గురించి తెలుసుకోవాలి. ఇంట్లో పెద్దవారిపై ఎందుకు గౌరవం కలిగి ఉండాలో తెలిసి ఉండాలి. ముఖ్యంగా ఒకరంటే ఒకరికి నమ్మకం, ఒకరి స్వభావం గురించి ఒకరికి అవగాహన కలిగి ఉంటూ, ఒకరి పై ఒకరికి సదభిప్రాయం కలిగి ఉండాలి. అప్పుడే కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనం ఏం చేయాలో మనకొక ఆలోచన పుడుతుంది. కుటుంబ సభ్యుల వలన ప్రయోజనం పొందుతూ, వారి గురించి ఆలోచన చేయక, ఇతర ఆలోచన ల వైపు దృష్టి సారిస్తూ, ఆసక్తికి అనుగుణంగా మసలుకోవడం మొదలుపెట్టే వ్యక్తులు కుటుంబంలో ఉంటే, అటువంటి వారి ఆలోచనలు కుటుంబ సభ్యుల ఐక్యతపై ప్రభావం చూపుతుంది. కలిసి ఉండే కుటుంబంలో ఒక సభ్యుడి ఆలోచన, మిగిలిన కుటుంబ సభ్యులపై ఉన్నప్పుడు, ఆ కుటుంబ దృక్పథం ప్రకారం అతని గురించి ఆలోచన మిగిలిన సభ్యులకు ఉంటుంది. అంటే ఈ విధమైన దృక్పథం వలన ఒకరి గురించి ఒకరికి పట్టింపు ఉంటుంది. ఒకరంటే ఒకరికి ఆప్యాయత ఉంటుంది. అయితే ఇక్కడ అహంకరించడం అనే ఆలోచన మొలకెత్తితే మాత్రం కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు మారతాయి. అంటే కుటుంబ వ్యవస్థ బాగుగా కొనసాగాలంటే, ముందుగా మనమే మన కుటుంబ సభ్యుల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. మాయమై పోతున్నాయి మానవ సంబంధాలు అనిపిస్తుంది.

ప్రతి రోజు కేరళ నుంచి కశ్మీర్ వరకు జరుగుతున్న ఉదంతాలు చూస్తుంటే ఇది నిజమనిపిస్తుంది. ఈ రోజుల్లో సమాజంలో భార్య భర్త విడాకులు తీసుకోవడం, అక్రమ సంబంధాలు వంటివి పెరిగాయి. నిరాదరణకు గురవుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఎక్కువవుతోంది, ఇంట్లోనే వరుసకు సోదరుడు నుంచి చివరికి తండ్రి వరకు లైంగికంగా వేధిస్తున్నా ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి. ఆశ్చర్య మేమిటంటే, ఇది మామూలే అనే నిర్లిప్త ధోరణిని ప్రజలు వ్యక్తపరచటం. విడాకులు, అక్రమ సంబంధాల వల్ల కుటుంబ వ్యవస్థ కూలిపోవటం, భార్యాభర్తల మధ్య పరస్పర అనుమానాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు, తద్వారా వారి పిల్లలు అనాథలు కావడం వంటి విషాదకర పరిణామాలు చోటుచేసుకుంటాయి. క్షణిక సుఖంకోసం అక్రమ సంబంధాలు వివాహ వ్యవస్థకే సవాల్ విసురుతున్నాయి. రెండు నెలల్లో ముగ్గురు భర్తలను మార్చిన వనిత. ప్రేమ కాదన్నందుకు పదో తరగతి అమ్మాయి తల్లిని చంపిన ఉదంతం. తల్లీ కూతురుతో అక్రమ సంబంధం పెట్టుకొని నవ వరుడిని చంపిన సంఘటన, చదువు చెప్పాల్సిన నలభై ఏళ్ల టీచర్ పదవ తరగతి అబ్బాయితో అక్రమ సంబంధం. ఇటీవల ముగ్గురు పిల్లల తల్లి(39) తన కుమార్తెతో వివాహం నిశ్చయమైన 24 సంవత్సరాల వ్యక్తితో లేచిపోయింది. హైదరాబాద్‌లో గురుమూర్తి అనే వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతకంగా నరికి చంపి కుక్కర్లో ఉడకబెట్టి చెరువులో పడేశాడు. మరొక వ్యక్తి మోరీలో పడేసి సిమెంట్ తో కప్పి పడేసింది. అక్రమ సంబంధంతో సుఖపడదామని ముక్కుపచ్చలారని ముగ్గురు అబ్బాయిలను విషం ఇచ్చి చంపింది ఒక మహా తల్లి. భర్తకు కరెంటు షాకిచ్చి చంపింది ఒక ఇల్లాలు. కర్ణాటక మాజీ డిజిపి ప్రకాష్ ను అత్యంత దారుణంగా చంపింది తన భార్య. కేంద్రమంత్రి మనవరాలిని దారుణంగా హత్య చేశారు తన భర్త. రెండేళ్లు కాపురం చేశాక లవర్‌తో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది మరో యువతి. పదుల సంఖ్యలో పెళ్లిళ్లు చేసుకొని మోసంచేసిన ఘటనలు, హత్యలు కోకొల్లలు.

గతంలో ఇలాంటి వార్తలు విన్నప్పుడు ఎక్కడో జరిగింది అనుకునే వారు. కానీ ఇప్పుడు తమ సమీప ప్రాంతాల్లో ఇలాంటి నేర ప్రవృత్తి పెరిగిపోవడం దానికి పేద, ధనిక, కులం, మతం, ప్రాంతం అన్నీ సమానంగా ఉంటున్నాయి. మనిషిని అంతమొందించాలంటే ఎలా అని రోజుల కొద్దీ ఆన్లైన్ లో తర్ఫీదు పొందుతున్నారు. పనికిమాలిన పనులు చేయడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. ఒక వ్యక్తి పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలవారుగా రూపొందడంలో తల్లిదండ్రు లు, సమాజం, నేర్చుకునే విద్య, చదివే పుస్తకాలు, చేసే వృత్తి , పాటించే నైతిక విలువలు చాలా ముఖ్యమైనవి. వీటన్నిటికీ దూరమై కేవలం సోషల్ మీడియాలోనే వారి జీవితాన్ని గడుపుతూ పరిపూర్ణమైన వ్యక్తిగా రూపొందలేకపోతున్నారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు దూరమవుతున్నారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా బతుకుతున్నారు. సోషల్ మీడియా వల్ల అన్నీ అనర్థాలే ఉన్నాయి అని చెప్పడం నా ఉద్దేశం కాదు, కొన్ని సందర్భాల్లో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సామాజిక మాధ్యమా ల్లో అందరూ స్పందించి వారికి సహాయం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను సమస్యల పరిష్కారానికి వాడుతుండడం గమనార్హం.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విద్యార్థులకు విషయ అవగాహన కల్పించడంకోసం కూడా సామాజిక మాధ్యమా లు ఉపయోగ పడుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులకు, ఉద్యోగులకు ఏదైనా సృజనాత్మక ఆలోచన వచ్చినప్పుడు దాని గురించి ఆలోచించి మిత్రులతో చర్చించి దానికి పరిష్కారం కనుగొనేవారు. కానీ ప్రస్తుతం ఏ సందేహం వచ్చినా ఏ ఆలోచన వచ్చినా దానికి సంబంధించి గూగుల్, యూట్యూబుల్లో వెతకడం పరిపాటిగా మారింది.

బాల్యంలోనే విద్యార్థులకు నైతిక విలువలు, మానవ సంబంధాలు, ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన, వీటిని విద్యావిధానంలో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థులను, యువకులను ధనార్జక యంత్రాలుగా కాక మానవీయత కలిగిన వారుగా, మంచి పౌరులుగా రూపొందించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. అదే రేపటి తరానికి మార్గదర్శక మవుతుంది. మంచి మానవ సంబంధాలు, ఆరోగ్య ఆహార అలవాట్లు , శారీరక శ్రమ ఉత్తమ జీవన విధానానికి ప్రేరణ అన్న విషయం ప్రజలు విస్మరించారు. అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, అవివేకం, పర్యావరణ విధ్వంసం, విలువల విధ్వంసం, విధ్వంసకరమైన అభివృద్ధి పేరుతో, మతం పేరుతో హింస ప్రేరేపిస్తూ జీవిస్తున్నారు. వివాహ వ్యవస్థ సాంఘిక, సాంస్కృతిక, చట్టపరమైన నిబంధనలతో పాటు సమాజంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక బంధాన్ని, హక్కులు, బాధ్యతలు ఎత్తి చూపాలి. ఒకరికొకరు మద్దతుగా నిలిచేందుకు, సమాజానికి ఉపయోగపడేందుకు మార్గం సుగమం చేయాలి.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## ఖైదీలకూ ఓటు హక్కు

దేశవ్యాప్తంగా జైళ్లలో ఉన్న దాదాపు 4.5 లక్షల మంది విచారణ ఖైదీలకు ఓటు హక్కు గుర్తించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రం, ఎన్నికల సంఘం స్పందనలను కోరింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 62 (5) కింద విధించిన ప్రస్తుత నిషేధం రాజ్యాంగ హామీని, అంతర్జాతీయ ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తోందని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వాదనలను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది.

పంజాబ్ రాష్ట్రం పాటియాలాకు చెందిన నివాసి సునీత శర్మ దాఖలు చేసిన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, న్యాయ మంత్రిత్వ శాఖ, ఎన్నికల సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చింది. ఎన్నికల నేరాలు లేదా అవినీతికి పాల్పడిన ఖైదీలు తమ ప్రజాస్వామ్య ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా చూసుకోవడానికి ఇది న్యాయపరమైన జోక్యాన్ని కోరుతోంది.

బెదిరించి సాధించడం కాదు, శోధించి, సమస్యను చేధించి విజయం సాధించడంలోనే నిజమైన అర్హత ప్రస్ఫుటిస్తుంది. ఈ విషయంలో వెనెజులా ఉక్కు మహిళ సాధించిన విజయంతో డోనాల్డ్ ట్రంప్‌కు గర్వభంగమైనది. నోబెల్ శాంతి బహుమతి అర్హత గల మహిళనే వరించింది. అగ్రదేశాధిపతినన్న అహంకారంతోనో, ప్రపంచాధిపత్యం చాటుకోవాలన్న ఆరాటంతోనో, దుగ్ధతోనో అదిలించి, బెదిరించి, విర్రవీగిన ట్రంప్‌ను నార్వేజియన్ నోబెల్ శాంతి కమిటీ నిరాకరించింది. ఎలాంటి వత్తిళ్ళకు తలొగ్గకుండా సముచిత నిర్ణయం తీసుకుని నోబెల్ కమిటీ ప్రశంసార్హత సాధించింది. నోబెల్ శాంతి బహుమతులతో అమెరికా ఖ్యాతిని పెంచిన థియోడోర్ రూస్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాల సరసన నిలబడాలని ఉవ్విళ్ళూరిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశలపై నీళ్ళు చల్లి, వెనెజులా ప్రజాస్వామ్య హక్కులపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్న ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా

## ట్రంప్‌కు గుణపాఠం

కొరినా మచాడోకు 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించడం హర్షదాయకం. న్యాయమైన హక్కుల కోసం, నియంతృత్వంపై ప్రజాస్వామ్యం విజయం సాధించాలనే ధ్యేయంతో ఉద్యమ నాయకురాలిగా, వెనెజులా పార్లమెంటు సభ్యురాలిగా శాంతియుత పోరాటం చేస్తూ, మరియా కొరీనా ప్రజల ప్రశంసలందుకుంటూ, వెనిజులా చరిత్రను తిరగరాయడానికి తీవ్రమైన కృషి చేస్తున్నారు. వెనిజులా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయి. కేవలం కొద్దిమంది చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమైపోయింది. భారీ సంఖ్యలో ప్రజలు పేదరికం తట్టుకోలేక ఇతర దేశాలకు వలస పోతున్నారు. వెనెజులాలో ఇలాంటి అస్తవ్యస్త మైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని, పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని మరియా కొరినా అసమాన ధైర్య సాహసాలతో పోరాడుతున్నారు. ఇన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని నార్వేజియన్ నోబెల్ కమిటీ మరియా కొరినా మచాడో కు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడం జరిగింది. భారత్ వంటి దేశాలను టారిఫ్ ల మోతతో, వీసాల భారంతో పీల్చి పిప్పిచేస్తూ తాను ఏడు యుద్ధాలను ఆపానని విర్రవీగుతూ, అహంతో రెచ్చిపోతూ, తనకే నోబెల్ శాంతి బహుమతి రావాలని వాంఛించిన ట్రంప్‌కు చివరకు నోబెల్ శాంతి బహుమతి సాధనలో విఫలం కావడం ఒక గుణపాఠం. బెదిరించి నోబెల్ శాంతి బహుమతి సంపాదించాలనుకోవడం మూర్ఖత్వం.

సుంకవల్లి సత్తిరాజు.

## ఐకెపి సెంటర్ మహిళా సంఘాలకే ఇవ్వాలి



ప్రజాపక్షం/వీర్నపల్లి : ప్యాక్స్ నుండి మహిళా సంఘాల ఐకెపి సెంటర్‌ను తిరిగి మహిళా సంఘాలకే ఇవ్వాలని కంచర్ల గ్రామ మమత గ్రామైక్య సంఘం మహిళలు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల పరిధిలో మహిళా సంఘాల అభివృద్ధి కార్యక్రమాలు ఐకెపి సెంటర్ ద్వారా విజయవంతంగా సాగాయని, ఇటీవల ప్యాక్స్ ద్వారా నిర్వహణకు మార్పు ఏర్పడటం వల్ల మహిళా సంఘాలకు ఆర్థిక, సామాజిక పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఐకెపి సెంటర్ నడిస్తే సంఘాల భాగస్వామ్యం బలపడుతుందని, అన్ని పనులు పారదర్శకంగా నడుస్తాయని, మహిళల ఆత్మవిశ్వాసం, ఆదాయం పెరుగుతుందని తెలిపారు. వినతి పత్రాన్ని పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కంచర్ల మమత గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య కార్యాలయంలో ఒకరు దారుణహత్య

ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం సెంటనరీ కాలనీ సీ టు,200 క్వార్టర్ మండల సమైక్య ( సెర్ప్) కార్యాలయం లో శుక్రవారం మధ్యాహ్నం 8 వ కాలనీ, న్యూ మారేడు పాకకు చెందిన కోట చిరంజీవి (38) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మండల సమైక్య కార్యాలయంలో అకౌంటెంట్ గా పనిచేసే మహిళ కోసం మృతుడు చిరంజీవి మండల సమైక్య కార్యాలయానికి రాగా ఇద్దరు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా మహిళ తరుపు కుటుంబ సభ్యులు వచ్చి చిరంజీవిపై దాడికి పాల్పడ్డారు. కత్తులు, ఇనుపరాడ్లతో మృతుడు చిరంజీవిపై విచక్షణ రహితంగా దాడి చేయగా రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు చిరంజీవి 8 వ కాలనీ లోనీ పోతన కాలనీలో మహదేవ మీసేవ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మృతుని భార్య కొంత కాలం క్రితం చనిపోయింది.ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎసిపి మడత రమేష్, మంతిని సిఐ రాజు, రామగిరి ఎస్సై శ్రీనివాస్ పరిశీలించి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం : డివైఎస్‌ఒ

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యమని కరీంనగర్ జిల్లా యువజన సంక్షేమ శాఖ, క్రీడా అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కరీంనగర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఎస్‌జిఎఫ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెలక్షన్లకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన సంక్షేమ శాఖ , క్రీడాభివృద్ధిశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ ద్వారా క్రీడాకారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రత్యేక అతిథి అల్ఫోర్స్ డిగ్రీ అండ్ పిజి కళాశాల కరెస్పాండెంట్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సంపూర్ణ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. విశిష్ట అతిథి వాగ్దేవి డిగ్రీ అండ్ పిజి కళాశాల , కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ వేణుకుమార్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు గుంటపల్లి స్వామిలు చైర్మన్ ప్రధాన కార్యదర్శి బాబును అభినందించారు. అండర్ 19 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెలక్షన్లలో బాలురు బాలికలు పోటాపోటీగా క్రీడల్లో తలపడ్డారు. బాలిక విభాగంలో ఎస్.ఇరాన్యశ్రీ విజేతగా, రన్నర్‌గా జి.సాయి మహతి, ప్రత్యేక బహుమతులు గెలుపొందిన వారిలో ఎస్.వినూతన,సిరిచందన,అక్షిత రెడ్డిలున్నారు. బాలుర విభాగంలో విన్నర్‌గా ఎస్.హర్షవర్ధన్, రన్నర్‌గా డి.శ్రీచరణ్, ప్రత్యేక కన్సొలేషన్ బహుతిని కె.వైభవ్ శ్రీహర్ష, మహమ్మద్ రాయల్, శౌర్య తేజ గెలుచుకున్నారు. మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు గుంటపల్లి స్వామి, సీనియర్ కోచ్ మధుకర్, నామ రమేష్, వెంకటేష్, ముస్తాక్ గంగరాజు, శ్రీనివాస్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ వేణు కుమార్ బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్లురాజశేఖర్,శ్రీనివాస్,రాజునాయక్,నారాయణ పాల్గొన్నారు.

## సీతంపేటలో అవినీతిపై విచారణ



ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో మాజీ సర్పంచ్ మూడెత్తుల వెంకటస్వామి అవినీతికి పాల్పడ్డారని మాజీ ఎంపిటిసి తెడ్ల ఓదెలు గత నెల 22న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదు మేరకు శుక్రవారం డిఎల్‌పివో పాత శ్రీనివాస్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఎంపిటిసి సభ్యుడు తెడ్ల ఓదెలుతో పాటు పలువురు వార్డు సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్ వెంకటస్వామి నుంచి వివరణ తీసుకున్నారు. డిఎల్‌పివో శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్, డిపివో ఆదేశాల మేరకు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఆరోపణలపై వివరాలను పరిశీలించామని, గ్రామ పంచాయతీ రికార్డులను సీజ్ చేశామని, పూర్తి స్థాయిలో నివేదికను కలెక్టర్, డిపివోకు అందజేయనున్నట్లు తెలిపారు.

## సైన్స్‌కు కళ జోడిస్తే మెరుగైన ఫలితాలు



ప్రజాపక్షం /కరీంనగర్ : సైన్స్‌కు కళను జోడిస్తే విద్యార్థులు మరింత ప్రభావంతంగా నేర్చుకుని మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం మొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాభారతిలో పాఠశాల విద్యాశాఖ కరీంనగర్ జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రాన్ని కళ, సాంస్కృతిక అంశాలతో మేళవించినప్పుడు బోధన అభ్యసన ప్రక్రియల్ని సులభతరం చేయవచ్చునన్నారు. జిల్లా సైన్సు అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రీయ విద్యా పరిశోధన సంస్థ తెలంగాణ ఆదేశాల మేరకు మానవ పురోగతికి సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశం పైన విద్యార్థులకు డ్రామా ఫెస్టివల్‌ను నిర్వహించినట్లు తెలిపారు. గాజుల రవీందర్,నంది శ్రీనివాస్,కేఎస్ అనంతచార్య,వి.ఆంజనేయులు, కొత్తకొండ సత్యనారాయణ, స్థంబంకాడి గంగాధర్, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తం



ప్రజాపక్షం /చందుర్తి : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్సై జిల్లెల రమేష్ అన్నారు.శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపిపి చిలుక పెంటయ్యకు గత రెండు రోజుల క్రితం తెలియని నెంబర్ నుండి ఫోన్ పే లో రూపాయలు 49850 రాగ , అతను వాటిని తిరిగి ఫోన్ ఫే లో పంపకుండా ఎస్సై రమేష్ కు అందజేశాడు.కాగా ఎస్సై భాదితులకు ఫోన్ చేసి నేరుగా వచ్చి డబ్బులు తీసుకోవలసిందిగా సూచించామన్నారు.భాదితులు డబ్బులను ఫోన్‌పేలో తిరిగి పంపించాలని కోరినా సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండడం వల్ల మాజీ ఎంపిపి తమను సంప్రందించాడని, తనకు వచ్చిన డబ్బులు వారికి అందజేయాలన్న మాజీ ఎంపిపిని ఎస్సై తో పాటు పలువురు అభినందిచారు.

## ఆధార్ కేంద్రం సద్వినియోగం



ప్రజాపక్షం / చందుర్తి : మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని చుట్టు పక్కల గ్రామాల పాఠశాలల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు.శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఆధార్ నవీనీకరణతోపాటు అవసరం ఉన్న వారు నూతనంగా ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. సనుగుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముఖేష్, సిఆర్ పి ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేగంగా భూ సేకరణ సమస్యలు పరిష్కారం





### కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి

ప్రజాపక్షం / కరీంనగర్ : కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. భారత జాతీయ రహదారి సంస్థ వరంగల్ ప్రాజెక్టు సంచాలకులు భరద్వాజ్, రెవిన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబులతో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబందించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.రెవెన్యూ నేషనల్ హైవే ఆథారిటీ అధికారులు పాల్గొన్నారు.

### పోషకాహారంతోనే ఆరోగ్యం

మనం పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పోషణ మాసంలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోతి రాంపూర్ హైస్కూల్‌లో శుక్రవారం సభ, విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాహారం పై అవగాహన పెంచుకుని వంట చేయాలని మహిళలకు సూచించారు. మనం తినే ఆహారం ద్వారా అందే పోషకాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ రోజుల్లో చాలా మంది అధిక బరువుతో బాధపడుతుండడానికి ప్రధాన కారణం అధిక నూనే, తీపి వినియోగించడమేనని పేర్కొన్నారు. లింగ వివక్ష చూపకుండా పిల్లలకు ఇంటి పనులు, వంట పనులతో పాటు ఆరోగ్యకర ఆహారం తయారు చేసే విధానం నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

### ఆకట్టుకున్న హెచ్ఎం పాట

కలెక్టర్ పాలనను, జిల్లాలో ప్రవేశపెట్టిన కార్యక్రమాలను వివరిస్తూ పాఠశాల హెచ్ఎం ఆలపించిన పాట అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో వెంకట రమణ, సిడిపివో సబిత, మెప్మా పిడి స్వరూప రాణి, వైద్యాదికారి సనా, ఎన్జీవో ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేయాలి : కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/రామగిరి: మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలో నిర్మాణం అవుతున్న మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ 4 వరుసల జాతీయ రహదారి నిర్మాణం సంబంధించి రామగిరి మండలం ఆదివారం పేట, బేగంపేట గ్రామాలలో సి.ఎన్.జి వరకు పూర్తి కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రామగిరి మండలంలోని రెండు గ్రామాలలో రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి నిర్మాణ పని ప్రారంభమైందని, దీనిని సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రామగిరి తహసిల్దార్ సుమన్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, మహేష్, రవిశంకర్, సర్వేయర్ రాధిక సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాకీలు తీర్చాలని ప్రభుత్వాన్ని నిలదీయండి

### మాజీ మంత్రి గంగుల కమలాకర్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని బిఆర్ఎస్ ఆద్వర్యంలో రూపొందించిన హామీలకు సంబంధించిన బాకీ కార్డులతో శుక్రవారం కరీంనగర్ నగరంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నేతృత్వంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అందజేశారు. కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమంతో ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం బాకీ పడిన హామీల పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో ఎన్నికల భరోసా పేరుతో ప్రజలను మభ్యపెట్టి బాకీలు పడి మోసం చేశారని పేర్కొన్నారు.ఇది కాంగ్రెస్ ఉద్దెర ప్రభుత్వమని, బాకీలు ఎగ్గొట్టిన సర్కారు అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 23 నెలలు గడిచినా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రతి ఆడబిడ్డకు రూ.2500 ఇస్తామని ఇచ్చిన హామీలో బాగంగా ఇప్పటి వరకు ప్రతి ఒక్కరికి రూ.55 వేలు బాకీ పడ్డారన్నారు. స్కూటీలు ఇవ్వలేదన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల రూపంలో ఒక్కొక్కరికి రూ.44 వేలు బాకీ పడ్డారని, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో తులం బంగారం ఇవ్వలేదన్నారు. రైతు భరోసా కింద ఒక్కొక్కరికి రూ.76 వేలు బాకీ పడ్డారని, ఇలా చెప్పుకుంటే పోతే అనేకమున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాకీలు ఎప్పుడు తీర్చుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆద్వర్యంలోజరిగినకార్యక్రమంలోమాజీఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పోరేటర్లున్నారు.

## చిగురుమామిడి ఎంపిడిఒ మధుసూదన్‌కు షోకాజ్ నోటీసు



ప్రజాపక్షం/చిగురుమామిడి: గ్రామపంచాయతీ ఎన్నికల వార్డు రిజర్వేషన్లలో తప్పిదాలు చేసినందుకు చిగురుమామిడి మండల అభివృద్ధి అధికారి(ఎంపిడిఒ) బి.మధుసూధన్‌కు జిల్లా ప్రజా పరిషత్ కరీంనగర్ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం విడుదల చేసిన ఆదేశాల ప్రకారం 3వ వార్డు చిగురుమామిడి గ్రామం, 14వవార్డు రేకొండ గ్రామం రిజర్వేషన్ వివరాలను తప్పుగా నమోదు చేయడంతో పాటు గెజిట్ ప్రచురణ తర్వాత సైతం పొరపాట్లు సరిచేయడంతో నిర్లక్ష్యం వహించారని నోటీసులు పేర్కొన్నారు. పత్రంలో గవర్నమెంట్ ఆదేశాల ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలని ఉన్నప్పటికీ ఆయన తప్పుగా యుఆర్‌ఉమెన్, యుఆర్ డబ్ల్యూ/ఎం లుగా రికార్డు చేసినట్లు వివరించారు. గతంలో పంచాయతీ సెక్రటరీలు ఆయనపై మానసిక వేధింపులు, దుర్భాషలు వాడుతున్నారంటూ ఫిర్యాదు చేసిన విషయాన్నిఅధికారులు గమనించినట్లు వెల్లడించారు. జిల్లా ప్రజాపరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంతకం చేసిన ఈ నోటీసులో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించం

### హుస్నాబాద్‌లో కలెక్టర్ హైమావతి ప్రభుత్వ పాఠశాల , బస్తీ దవాఖాన తనిఖీ





ప్రజాపక్షం / హుస్నాబాద్: హుస్నాబాద్ డివిజన్ లో హుస్నాబాద్ , అక్కన్నపేట, కొహెడ మండలాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై అయా మండల అధికారులతో జిల్లా కలెక్టర్ కె హైమావతి, అర్డివో రాంమూర్తి తో కలిసి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. జాతీయ రహదారి పనుల్లో ఎలకతుర్తి నుండి సిద్దిపేట వరకు నత్తనడకన సాగుతున్న తీరును పరిశీలించారు. కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు రోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న కరంటు పోల్లు చెట్ల తొలగింపు పనులు చేపట్టాలని అదేశించారు. సముద్రాల నుండి కొహెడ రోడ్డు పనుల్లో రోడ్డు సేఫ్టి బోర్డులు ఏర్పటు చేయాలన్నారు. అలాగే రామవరం నుండిహుస్నాబాద్ వరకు రోడ్డుకు ప్రక్కప ఉన్న చెట్లను, మంచినీటి మిషన్‌భగీరథ పైపులైన్లను మార్పులు వెంటనే చేపట్టాలని అన్నారు. అలాగే అంతక్కపేట , కొత్తకొండ రోడ్డుపనులకు ఉన్న అడ్డంకులను సంబందిత అధికారుల వెంటనే పరిష్కారించాలని కొరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెడుతున్న మధ్యాహ్న బొజనంలో నాణ్యత పాటించాలని లేకుంటే పరిణామాలుంటాయని హెచ్చరించారు. అలాగు పట్టణంలోని బస్తీ దవఖానలో డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్‌ను నియమిస్తామని హామీ ఇచ్చారు.

## పిల్లల భవితను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..



### హుస్నాబాద్ జడ్జి రేవతి

ప్రజాపక్షం / హుస్నాబాద్ : పిల్లల భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్ది వారికి చక్కని రాచబాట వేసేది ఉపాధ్యాయులేనని హుస్నాబాద్ జడ్జి రేవతి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని డిజేబులేడ్ సందర్భంగా భవిత కేంద్రంలో వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. జడ్జి రేవతి మాట్లాడుతూ భవిత సెంటర్‌కు ఏలాంటి అవసరం ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. సహకరిస్తామన్నారు. వికలాంగుల పాఠశాల పరిసరాలను పరిశీలించి పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. మండల విద్యాధికారిమణీలా,అడ్వకేట్లు రామకృష్ణ , కిరన్, శ్రీదేవి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు తదితరలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట అర్బన్ మండలంలోని మందపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రంను శుక్రవారం ఎపిఎం క్రిష్ణారెడ్డితో కలిసి మాజీ సర్పంచ్ కొమ్ము రాజయ్య ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు.దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకే అమ్ముకొవాలని తెలిపారు. ఐకెపి సిసి ఆనంద్,పంచాయతీకార్యదర్శి భవాని, ఎఇఓ శ్రీనివాస్,విఓలు జ్యోతి, రాణి విఎఓలు మమత,విజయ,రైతులు కొమురయ్య పాల్గొన్నారు.

# కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా

### ఏఐటియుసి సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్



ప్రజాపక్షం/ వేములవాడ : వేములవాడ మున్సిపల్ కమిషనర్ కు శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇరవై ఆరు వేలు ఇవ్వాలని, అన్ని రంగాల కార్మికులకు ఈఎస్ ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, ప్రభుత్వ ఐడి కార్డులు అందజేయాలని, వారంలో ఒక రోజు పూర్తి సెలవు దినం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్రతి కార్మికుడికి ఇరవై ఐదు లక్షల ప్రమాద భీమా ఇవ్వాలని, మున్సిపల్ వాహనాలన్నింటికీ ఇన్సూరెన్స్ చేయించాలని సూచించారు. ఈ నెల 17న నిర్వహించబోయే మున్సిపల్ కార్మికుల జిల్లా మహాసభ విజయవంతం కావడానికికార్మికులకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి పందుల మల్లేశం, కిషన్, చంద్రయ్య, అంజయ్య, రాజు, వినోద్ పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్ కుట్రతోనే బిసిలకు అన్యాయం

### ఆర్‌టిఎ సభ్యుడు అధ్యక్షుడు సూర్యవర్మ, పిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రం



ప్రజాపక్షం/ సిద్దిపేట : బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు బిసిల పట్ల చిత్తశుద్ధి లేదని సిద్దిపేట జిల్లా ఆర్టీఎ సభ్యులు, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు డాక్టర్ సూర్యవర్మ, పిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రం ఆరోపించారు.42శాతం బిసి రిజర్వేషన్లపై కల్పించటంపై రాష్ట్ర ప్రభుత్వంపై చిత్తశుద్ధితో ఉందన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ చేసిన చట్టాలను బిసి రిజర్వేషన్లకు ఉరితాడుగా మారిందన్నారు. 2018లో బిఆర్ఎస్ ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లకు కట్ ఆఫ్ చేయటం వల్ల రిజర్వేషన్లకు అడ్డంకిగా మారిందన్నారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని ఆలోచన చేయలేదన్నారు. కావాల్సిన సమయం ఉన్నా సర్వే ఎందుకు చేయలేదని వారు ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్‌లకు బిసిలపై చిత్తశుద్ధిలేదని, బిసిలకు మేలు జరుగుతుంటే బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు తట్టుకోలేక పోతున్నాయన్నారు. ప్రజలు. బిసి సంఘాల నేతలు అమా యకులు కాదని, అన్ని గమనిస్తున్నారన్నారు. జివో 9 తీసకరాకముందే సర్వే చేయటం జరిగిందన్నారు. సైంటిఫిక్ సర్వే చేసి బిల్లు రూపంలో తెచ్చామని, కులగణన సర్వే శాస్త్రీయంగా పారదర్శకంగా చేయటం జరిగిందన్నారు. పక్క లెక్కలతో బిసి 42శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. చిన్న పోరపాటు జరుగకుండ సర్వే చేశామని, ఎన్యుమేటర్లు ఇంటింటి వెళ్లిసర్వే చేశారు. బిసి బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. బిసి బిల్లు ఆరు నెలలుగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, బిసి బిల్లును బిజెపి ఆధ్వర్యంలో కేంద్రం ఆపిందని వారు వెల్లడించారు. బిఆర్ఎస్ 50 శాతం స్లాబ్ రాకుండ చట్టం చేసిందని, బిసిలకు రిజర్వేషన్ కల్పించాలనే సోయి గత ప్రభుత్వానికి లేదన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. రిజర్వేషన్లు అడ్డుకున్నది బిజెపి. బిఆర్ఎస్ పార్టీలేనన్నారు.పిసిసి కార్యదర్శి దరిపల్లి చంద్రం,రాష్ట్ర కిసాన్‌సెల్ కన్వీనర్ నాయిని నర్సింహరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు గరిపల్లి వెంకటప్రసాద్, యాదగిరి, నాయకులు వరుణ్, బింగి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## తడిగుడ్డతో గొంతు కోయడం కాంగ్రెస్ నైజం

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రజాపక్షం/పెద్దపల్లి: తడిగుడ్డతో గొంతు కోయడం, నమ్మించి నట్టేట నిలువునా ముంచడం, విశ్వాసఘాతుకానికి పాల్పడిన రేవంత్ ప్రభుత్వం ఇపుడు బీసీలను దగా చేసిన సర్కారుగా సమాజం ముందు నిలబడిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశంలోఆయన మాట్లాడారు. అధికారం కోసం బీసీ వాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్, నేడు నమ్మించి మోసం చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై 22 నెలలుగా మసిబూసిమారేడు కాయచేసి నిండా ముంచిందన్నారు.మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్కదోవ పట్టించారని,బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. నాయకులు గోపు అయులయ్య యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు బోడ్డు రవీందర్, కల్వచర్లకృష్ణవేణి, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్, చల్లా రవీందర్ రెడ్డి,మేడి సదానందం, పిల్లి రమేష్,తోకల రమేష్,సట్టు శ్రీనివాస్, బండారిప్రవీన్,ఆర్నకపల్లి శ్రీనివాస్, యాసర్ల తిమాతి, వెంకటేష్, ముద్దాసాని సంధ్యా రెడ్డి, సాయి కుమార్, కొడి రామకృష్ణ ,ఆవునూరి వెంకటేష్, బచ్చాల రాములు, గుర్రం పద్మ, ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఆదేవాల మేరకు నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ(డిసిసి) అధ్యక్షుడి ఎంపిక నిమిత్తం ఎఐసిసి, పిసిసి పరిశీలకులు నిర్మల్ జిల్లాకు విచ్చేస్తున్నారు.ఈ మేరకు ఎఐసిసి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిశీలకులు అజయ్ సింగ్, పిసిసి పరిశీలకులు అనిల్ కుమార్ యాదవ్, అలాగే జిల్లా కో ఆర్డినేటర్లు సి.హెచ్ రామ్ భూపాల్, లాకావత్ దణవతి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి నిర్మల్‌కు రానున్నారు. ఈ నేపథ్యలో ,డిసిసి అధ్యక్ష పదవికి ఆశావాహులు తమ దరఖాస్తును సమర్పించాలని డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు తెలిపారు. ఆశావాహులు తమ దరఖాస్తుతో పాటు, కాంగ్రెస్ పార్టీకి ఎంతకాలంగా సేవ చేస్తున్నారనే వివరాలు జతపరిచిన బయోడేటాను సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తి గల నాయకులు తమ దరఖాస్తును ఆదివారం మధ్యాహ్నం లోపు డిసిసి క్యాంప్ కార్యాలయంలో అందజేయగలరని కూచాడి శ్రీహరి రావు కోరారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం: అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రమాణాలు, నాణ్యతతో కూడిన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవితో కలిసి ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ ఎన్, ఎఐ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని, యూడైస్ పోర్టల్‌లో పూర్తి సమాచారం నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులపై దృష్టి సారించి, ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై ప్రత్యేక బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ సమన్వయకర్తలు, విద్యాధికారులు, ఆశ్రమ పాఠశాలలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బాన్సువాడ సమితి మాజీ అధ్యక్షుడు, నిజాంసాగర్ మండల మాజీ జడ్పీటీసీ మల్లూరు కృష్ణారెడ్డి దొరను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శుక్రవారం పరామర్శించారు. కృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారు త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని కోరుకుంటూ, పార్టీకి వారి సలహాలు, సూచనలు అవసరమని, రాబోయే తరానికి దిశా నిర్దేశకులుగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట పదో వార్డులో మంచినీటి సమస్య ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా తన సొంత ఖర్చులతో సింగల్‌ఫేజ్ మోటర్‌ను ఏర్పాటు చేయించి నీటి సమస్యను పరిష్కారం చేయించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా మాట్లాడుతూ శివ్వంపేటలో మంచినీటి సమస్య లేకుండా చేస్తానని ఆయన అన్నారు. తాగునీటికి సహకారం అందించిన మహేశ్‌గుప్తాకు శివ్వంపేట గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామకమిటీ అధ్యక్షులు ముద్దగల్ల లక్ష్మి నర్సయ్య, కములయ్యగారి లక్ష్మి నారాయణ, పంబళ్ల సంతోష్, ముద్దగల్ల సింహం, కాముని నగేశ్, దొడ్ల అశోక్, పంబళ్ల భూమేశ్, ఖదీర్, కొంతాన్‌పల్లి సత్యనారాయణగౌడ్, సోమసాని ఆంజనేయులు, జోగని లక్ష్మ ణ్, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు కేసు భరించలేక.. బిజెపి నేత మధుకర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/చెన్నూరు :** తప్పుడు కేసు బనాయించారనే మనస్థాపంతో వేమనపల్లి బిజెపి మండలాధ్యక్షుడు ఏట మధుకర్ (45) ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. ఇటీవలే ఓ తగాదా వ్యవహారంలో మధుకర్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైంది. వేమనపల్లి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయ ప్రోద్బలంతో తనపై తప్పుడు కేసు బనాయించారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ సూసైడ్ నోటు రాశారు. అనంతరం నీల్వాయి గ్రామ సమీపాన గల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు, బిజెపి నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళనను విరమించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిఐ బన్సీలాల్ తెలిపారు.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు తండాకు చెందిన కేతావత్ విజయ్ కుమార్ (32) మార్కెటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గత రెండు రోజులుగా దిగులుగా ఉంటున్నాడు. పని నిమిత్తం గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు పలుమార్లు ఫోన్ చేసిన స్పందించ లేదు. దీంతో చుట్టూ పక్కల వెతికారు. శుక్రవారం ఉదయం వెతుకుతుండగా తండా సమీపంలో అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి రామ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## విదేశీ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం / నస్పూర్:** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన నమోదిత నియామక సంస్థ, రాష్ట్రానికి చెందిన అర్హత, నైపుణ్యం, అర్ధ నైపుణ్యం గల కార్మికులకు విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టామ్ కామ్ గ్రీస్ లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాలలో వివిధ పాత్రలలో 1 వేయి విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందిందని, హోటల్ మేనేజ్మెంట్ లో డిప్లమా, డిగ్రీ అర్హత కలిగిన వారు, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, బీమా అందించడం జరుగుతుందని, చివరి నెల జీతంతో విమానం టికెట్ ఖర్చులు తిరిగి చెల్లించబడతాయని, 8 గంటల పనితో పాటు 45 నిమిషాల విరామం, అదనపు పని గంటలకు అదనపు వేతనం ఉంటాయని, ఆంగ్ల భాషలో నైపుణ్యం కలిగి ఉండాలని, వీసా, ఖర్చులు అభ్యర్థి వహించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెజ్యూమ్ ను tomcom.resume@gmail.com కు ఇ మెయిల్ చేయాలని, ఇతర వివరాలకు 9440052081, 9440051452 నంబర్లు, వెబ్ సైట్ www.tomcom.telangana.gov.in లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సమస్యలు పరిష్కరించాలని 'సిఎం'కు వినతి





**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టిఎన్‌జిఓ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం జిల్ల కేంద్రానికి వచ్చిన సిఎంకు టిఎన్‌జిఓస్ పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి పట్టుదీక్ష వస్త్రంతో సన్మానించి పూలబుకె అందజేసి సాదరంగా ఆహ్వానించి అనంతరం జిల్లా ఉద్యోగుల సమస్యలపై వినతప్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిస జెసి జిల్లా చైర్మన్, టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్‌కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టిఎన్‌జిఓ రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రెవెన్యూ ఫోరం జిల్లా అధ్యక్షులు రమన్‌రెడ్డి, రెవెన్యూ ఫోరం జిల్లా సహాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, టిఎన్‌జిఓ జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, ఇందిరా, శ్రీవేణి, విజయలక్ష్మి , సునీల్, స్వాతి, ఆరుతి, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు శశికాంత్‌రెడ్డి, సలహాదారులు వనమాల సుధాకర్ పాల్గొన్నారు.

**కామారెడ్డి జిల్లాకు ఇచ్చినట్లుగా వరదలతో నష్టపోయిన రూరల్‌కు నిధులు కేటాయించాలి**

కామారెడ్డి జిల్లాకు ఇచ్చినట్లుగా ఇటీవల వరదలతో నష్టపోయిన రూరల్ నియోజకవర్గంలోని గ్రామాలకు నిధులు కేటాయించాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి తెలిపారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలతో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలని కోరారు. కలెక్టరేట్ పక్కన ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక చేయకపోవటంతో పాడవుతున్నాయని చూయించారు. అనంతరం ధర్పల్లి మండలంలోని వాడీ, బీరప్ప తండా, సీతాయిపేట్ తండా, మద్దుల్ తండా, సిరికొండ మండలంలోని గడ్కోల్, కొండూర్ గ్రామాలు కామారెడ్డి కంటే కూడా ఎక్కువగా దెబ్బ తిన్నాయి. కామారెడ్డిలో ఇచ్చిన విధంగా యుద్ధప్రాతిపదికన నష్టపోయిన ఇళ్లకు పంట పొలాలు నష్టపరిహారం అందించి దెబ్బ తిన్న రోడ్లకు, బ్రిడ్జిలకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వరదలతో రాష్ట్ర వ్యాప్తంగా కామారెడ్డి జిల్లా మాత్రమే నష్టపోయిందని అందరూ అనుకుంటున్నారని, రూరల్ నియోజకవర్గంలో అంతకంటే ఎక్కువ నష్టం జరిగిందని ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో వివరించారు. అనంతరం సిఎం స్పందించి అధికారులు నష్టపోయిన వారి వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

## సరైన అనుమతులతోనే బాణాసంచా విక్రయ దుకాణాలు: కలెక్టర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలిక బాణాసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా సరైన అనుమతులు పొందాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని ఏ మండలం లేదా గ్రామంలోనైనా సంబంధిత శాఖల అనుమతి లేకుండా బాణాసంచా విక్రయాలు జరపకూడదని కలెక్టర్ ఆదేశించారు. తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు అనుమతి కావాలంటే సంబంధిత ప్రతిపాదనలను దీపావళికి కనీసం ఒక వారం ముందుగా తమ కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఈ ప్రతిపాదనలను సబ్ కలెక్టర్, కాగజ్‌నగర్ లేదా సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ద్వారా సమర్పించాలని సూచించారు. అనుమతి లేకుండా విక్రయాలు జరిపితే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనల అమలుకు ఆయా మండలాల తహసీల్దారులు బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 13న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సూచన



**ప్రజాపక్షం/నస్పూర్:** జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయుష్ శాఖ, వైద్య శిబిరం ఇంచార్జ్ డా. సిహెచ్. స్పందన, కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

**13 నుండి తిరిగి ప్రజావాణి**

రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ నుండి యథావిధిగా కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## కబ్జాదారులకు సహకరించొద్దు



ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ స్వామి

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలో సింగరేణి భూములు కబ్జా అవుతుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ స్వామి అన్నారు. సింగరేణి యాజమాన్యం భూములను కబ్జా కాకుండా చూసి, కబ్జా స్థలాలను పూర్తి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌కు శుక్రవారం మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి భవన్ వెనుక గల సౌత్ కాస్కట్ గని ప్రాంతంలో అక్రమ కట్టడాలు, దేవుని విగ్రహాల పేరిట ఖాళీ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని విమర్శించారు. గతంలో సివిల్ డిపార్ట్మెంట్ కార్యాలయాలు, బొగ్గు గనులు నడిచిన చారిత్రక స్థలాలను కాపాడాలని కోరారు. ఎంఎల్‌ఏతో సహా ప్రజా ప్రతినిధులు కబ్జాదారులను ప్రోత్సహించకుండా, సింగరేణి యాజమాన్యానికి సహకరించి ఆ స్థలాన్ని ఖాళీ చేయించాలని స్వామి విజ్ఞప్తి చేశారు. అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి తిరుపతి గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సహాయ కార్యదర్శి బొల్లం తిలకంబెద్కర్, జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, పట్టణ కోశాధికారి మంతన రమేష్, నాయకులు రత్నం ఐలన్న తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు సకాలంలో చెల్లించాలి



వైద్య ఉద్యోగుల మౌనదీక్ష..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** వైద్య ఉద్యోగులు డాక్టర్స్,నర్సులు ఇతర సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం ఉప ప్రధాన కార్యదర్శి కుమారం శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ముందు మౌన దీక్ష చేశారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల నుండి వేతనాలు సరైన సమయంలో రావడం లేదని, ఒకటవ తేదీన కాకుండా ప్రతి నెల ఒకటి రెండు వారాలు మించి రావడం తమకు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. అహర్నిశలు వైద్య వృత్తిలో సమయం సందర్భం లేకుండా కృషి చేస్తున్న తమ వేతనాలు మాత్రం సక్రమంగా చెల్లించకపోవడం బాధాకరం అని ఇప్పటి నుండి అయినా ప్రతి నెల ఒకటవ తేదీననే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వంశీ మాధవ్, సాయికృష్ణ, సుధీర, శైలజ, మమత, ఉపేంద్ర, కల్కి, దివ్య, నర్సింగ్ గ్రేడ్ వన్ సిస్టర్ శ్లానెరి మనీ, స్వరూప, సిస్టర్స్ మమత, సుజాత, కిరణ్మయి, భాగ్యలక్ష్మి , కావేరి, వెంకటమ్మ, షఫీనా, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పత్తి పంట కొనుగోలు ప్రక్రియ

అదనపు కలెక్టర్‌కిషోర్ కుమార్





**ప్రజాపక్షం/నిర్మల్:** పత్తి పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పత్తి పంట కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పత్తి పంట కొనుగోలు ప్రక్రియను నిర్ణిత సమయానికి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అన్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఆన్ లైన్ స్లాట్ బుకింగ్ కోసం కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించాలని తెలిపారు. ఈ యాప్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు. రైతులకు కపాస్ కిసాన్ అప్లికేషన్ వినియోగం గురించి విస్తృత అవగాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పత్తి కొనుగోలుకు సంబంధిత సేవలను 18005995779 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చునని చెప్పారు. 8897281111 వాట్సప్ నెంబర్ను సంప్రదించడం ద్వారా రైతులు పత్తి అమ్మకాలపై వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. రైతులకు వారి పంటకు ఖచ్చితంగా మద్దతు ధర అందించాలని తెలిపారు.తేమ శాతం విషయంలో రైతులు నష్టపోకుండా వారికి అన్ని విషయాలు తెలపాలని పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లులలో అన్ని వసతులు ఉండాలని వివరించారు. అగ్నిమాపక పరికరాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. వే బ్రిడ్జిలకు నిర్ణీత గడువులలో స్టాంపింగ్ వేయించుకోవాలని చెప్పారు. పంటలు అమ్మగానే రైతులకు నిర్నిత గడువు లోపల డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, ఇతర అధికారులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ నిబంధనల ప్రకారమే సమాచారం ఇవ్వాలి: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** సమాచార హక్కు చట్టంలో అందిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అర్జీదారులకు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. చట్టం నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకు లోబడి అందించాలని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని కోరారు. దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని, దీని ద్వారా పని సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. అధికారులు, ప్రజా సంఘాల సభ్యులు సమన్వయంతో వ్యవహరించి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ చట్టాన్ని గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన జడ్జి సౌజన్య




**పజాఫక్షం/సంగారెడ్డి:** జిల్లా ప్రధన న్యాయమూర్తి జి.భవాని చంద్ర ఆదేశాల ప్రకారం సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సమాయం అందించడంలో భాగంగా జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సంగారెడ్డి లోని డి ఆడిక్షన్ /రెహబిలీటేషన్ సెంటర్ వద్ద లీగల్ ఎయిడ్ క్లినిక్ ను స్థాపించడం జరిగింది. ఈ సందర్భంలో జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథరిటీ సెక్రటరీ (సీనియర్ సివిల్ జడ్జీ ) బి. సౌజన్య ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయసేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వ్యక్తులు ,వారి కుటుంబ సభ్యులు ,పునరావాసం, పొందుతున్న రోగులకు న్యాయ సంబంద సలహాలు మార్గదర్శకత్వం అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. వ్యసన గ్రస్తులు తమ హక్కులను తెలుసుకోవడం కుటుంబ ఆస్తి ఉద్యోగం, గృహహింస, పునరావాసానికి సంబందించిన చట్టపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ క్లినిక్ ద్వారా సహాయం పొందవచ్చును. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ప్రతి శనివారం ఒక ప్యానల్ లాయర్ ,ఒకపార లీగల్ వాలంటీర్ ను డ్యూటీకి నియమించి సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈసేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఆసుపత్రిలోని రోగులు, వారి బందువులు, ఈ క్లినిక్ ద్వారా లభించే న్యాయసలహాలను ఉపయోగించుకోవచ్చును. ఈ కార్యక్రమములో జిల్లా న్యా య సేవాధికార సంస్థ కార్యదర్శి, బి.సౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ అధికారి నాగనిర్మల ,డా శశాంక్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ , మురళీ కృష్ణ, ఆర్ఎంఓ బాల స్వామి , ఆడ్వకేట్ ఎండి ఖాలేద్ ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్:** లక్షెట్టిపేట మండలంలోని రేషన్ షాపులను సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఉత్కూర్ షాప్ నెంబర్ 20 రికార్డులను అధికారులు పరిశీలించారు. రికార్డులలో సంబంధిత తహసీల్దారు సంతకం లేకపోవడాన్ని గుర్తించి, డీలరును ప్రశ్నించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి భూమేష్ రికార్డులు సరిగా లేవని, వాటిని వెంటనే సరి చేసుకోవాలని ఆదేశించారు. రికార్డు ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీలరు పల్లెర్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## శతకంతో చెలరేగిన యశస్వీ

### కెరీర్‌లో ఏడో సెంచరీ



తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో వెస్టిండీస్‌ను ఓడించిన భారత్ రెండో టెస్టులోనూ అదరగొడుతోంది. టాపార్డర్ బ్యాటర్లు దంచేయగా మొదటి రోజే మూడొందలు కొట్టింది టీమిండియా. విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్(173 నాటౌట్)దూకుడే మంత్రగా చెలరేగి సెంచరీతో గర్జించాడు. మూడో స్థానంలో పాతుకుపోవాలనుకుంటున్న సాయి సుదర్శన్(87) అర్ధ శతకంతో తడాఖా చూపించడంతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. వీరిద్దరి జోరుకు ఆఖర్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(20 నాటౌట్) సమయోచిత బ్యాటింగ్ తోడవ్వగా భారత్ తొలి రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో భారత జట్టు జోరు చూపిస్తోంది. ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ సమం చేసిన టీమిండియా స్వదేశంలో వెస్టిండీస్ భరతం పడుతోంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో విండీస్‌ను మట్టికరిపించిన భారత్ రెండో టెస్టులోనూ డ్రైవింగ్ సీట్లో ఉంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 నాటౌట్: 253 బంతుల్లో 22 ఫోర్లు),సాయి సుదర్శన్(87) దంచికొట్టారు.కరీబియన్ జట్టుపైనే తొలి టెస్టు శతకం బాదిన యశస్వీ.. తనకు ఇష్టమైన ప్రత్యర్థిపనై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విండీస్ బౌలర్లకు కొరకరాని కొయ్యలా మారిన ఈ లెఫ్ట్ హ్యాండర్ సుదర్శన్‌తో కలిసి రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యంతో జట్టును పటిష్టస్థితిలో నిలిపాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న భారత జట్టుకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన కేఎల్ రాహుల్ (38) త్వరగానే ఔటైనా.. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ (87) క్రీజులో పాతుకుపోయాడు. వికెట్ బౌలింగ్‌కు సహకరించని పిచ్ మీద ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 నాటౌట్), అతడు పరుగుల పండుగ చేసుకున్నారు. ఈ క్రమంలోనే యశస్వీ తన కెరీర్లో ఏడో టెస్టు శతకం పూర్తి చేసుకున్నాడు.



అర్ధ శతకం తర్వాత 58 పరుగలు వద్ద వారికన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన సుదర్శన్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. టీ తర్వాత అతడు వారికన్ ఓవర్లో ఎల్బీగా ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్(20 నాటౌట్)తో యశస్వీ మరో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ అజేయంగా నిలవడంతో తొలి రోజు ఆట ముగిసే సరికి భారత్ రెండు వికెట్ల నష్టానికి రన్స్ చేసింది.

## డిసెంబర్ 15న ఐపిఎల్ వేలం..

### రిటెన్షన్‌కు ఆ రోజు వరకే ఛాన్స్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ అభిమానులకు గుడ్‌న్యూస్. మహిళల ప్రీమియర్ లీగ్ వేలం తేదీలను ప్రకటించిన బిసిసిఐ ఐపిఎల్‌కు కూడా పచ్చజెండా ఊపింది. డిసెంబర్ 15వ తేదీన పంతొమ్మిదో సీజన్ వేలం నిర్వహణకు బిసిసిఐ సిద్ధమవుతోంది. ఒకవేళ ఆ రోజు కాకుంటే డిసెంబర్ 13–15 మధ్య కచ్చితంగా ఆక్షన్ ఉంటుందని సమాచారం. అయితే.. వేలం తేదీని ఫ్రాంచైజీలతో మాట్లాడి బిసిసిఐ ఖరారు చేయాల్సి ఉంది. గత రెండు సీజన్లలో విదేశాల్లోనే వేలం నిర్వహించారు. మరి, ఈసారి అదే పంథాను అనుసరిస్తారా?



లేదంటే.. స్వదేశంలోనే ఈ క్రతువును పూర్తి చేస్తారా? అనేది తెలియడం లేదు. పదిహేడో సీజన్ వేలంను దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిపిన విషయం తెలిసిందే.

ఐపిఎల్ వేలం వస్తోందంటే చాలు.. ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు ఫ్రాంచైజీలు రెఢీ అవుతుంటాయి. రికార్డు ధర పలికేది ఎవరు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. గత సీజన్‌లో రిషభ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది.

## శార్దూల్‌కు కెప్టెన్సీ..

### రహానే, సర్ఫరాజ్‌లతో ముంబై బృందం!



రంజీ ట్రోఫీ 2025–26 కోసం ముంబై సెలెక్టర్లు పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు. 42 సార్లు ఛాంపియన్ అయిన ముంబైకి ఈసారి శార్దూల్ ఠాకూర్ సారథ్యం వహించనున్నాడు. ఈ మధ్యే అజింక్యా రహానే కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో అనుభవజ్ఞుడైన ఠాకూర్‌కు పగ్గాలు అప్పగించారు సెలెక్టర్లు. ముంబై సెలెక్టర్లు శుక్రవారం 16 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఖాన్ బ్రదర్స్ సర్ఫరాజ్, ముషీర్ ఖాన్‌లకు చోటు లభించింది. ఆసియా కప్‌లో సత్తా చాటిన ఆల్‌రౌండర్ శివం దూబే సైతం స్క్వాడ్‌లో ఉన్నాడు. గత కొంతకాలంగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండేలు సైతం ఎంపికయ్యారు.

**ముంబై రంజీ స్క్వాడ్ :** శార్దూల్ ఠాకూర్(కెప్టెన్), ఆయుశ్ మాత్రే, ఆకాశ్ ఆనంద్ (వైస్ కెప్టెన్), హార్దిక్ తమోర్ (వికెట్ కీపర్), సిద్దేశ్ లాడ్ అజింక్యా రహానే, సర్ఫరాజ్ ఖాన్, శివం దూబే, షామ్స్ ములానీ, తనుష్ కొతియాన్, తుషార్ దేశ్‌పాండే, సిల్వెస్టర్ డిసౌజా, ఇర్ఫాన్ ఉమైర్, ముషీర్ ఖాన్, అఖిల్ హెర్వాడ్కర్, రాయ్‌స్టన్ డియాస్.

**ఎలైట్ గ్రూప్ డీలో...** దేశవాళీ క్రికెట్‌లో వరల్డ్ కప్‌తో సమానమైన రంజీ ట్రోఫీలో ముంబై జట్టుది తిరుగులేని ఆధిపత్యం. రికార్డు స్థాయిలో విజేతగా నిలిచిన ఆ జట్టు ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. 'ఎలైట్ గ్రూప్ డీ'లోని ముంబై జట్టు రంజీ ట్రోఫీ తొలి పోరులో జమ్ము కశ్మీర్‌ను ఢీకొట్టనుంది. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 18 వరకూ శ్రీనగర్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి. గ్రూప్ డీలో హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, హైదరాబాద్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పాండిచ్చేరి జట్లు ఉన్నాయి.

# ఫోకస్ సైన్స్



## ఆ సంకేత రహస్యం ఏమిటో?

మనం ఊహకు కూడా అందనంత దూరం నుంచి వచ్చిన సంకేతం వెనుక దాగివున్న రహస్యాన్ని ఛేదించడానికి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, రేడియో తరంగాల నిపుణులు తలమునకలై ఉన్నారు. ఈ సంకేతం మనకు తెలిసిన విశ్వం నుంచి కాకుండా, మనకు సమాంతరంగా నడుస్తున్న మరో వాస్తవిక విశ్వం నుంచి వచ్చి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తమవుతున్నది. పూర్తి స్థాయిలో పరిశోధన జరిగితేగానీ, రహస్యం వీడదు. మొత్తం మీద ఈ సంకేతం ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ సృష్టిస్తున్నది. ఆందోళనకు కారణమవుతున్నది. ఈ సంకేతం, అంతరిక్షంలోని అసాధారణ తరంగాలను పసిగట్టటానికి రూపొందించిన అత్యంత సున్నితమైన రేడియో టెలిస్కోపులు గుర్తించాయి. అయితే ఇది చూపిస్తున్న ఫ్రీక్వెన్సీలు, తరంగ నమూనాలు ఇప్పటివరకు తెలిసిన ఏ రకమైన సహజ లేదా ఖగోళ మూలాలతో సరిపోవడంలేదు. అందుకే, ఇది సమాంతర విశ్వం నుంచి వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అదే రుజువైతే, మానవ చరిత్రలోనే అద్భుతమైన శాస్త్రీయ కనుగొనికగా నిలుస్తుంది. ఎందుకంటే ఇది భౌతిక శాస్త్రం, స్థలకాలం, సృష్టి స్వభావం పట్ల మన అవగాహనను ఈ కొత్త మూలంగా మార్చివేస్తుంది. భౌతిక శాస్త్రవేత్తలు, ఖగోళ శాస్త్రవేత్తలు ఈ సంకేతం మూలం గురించి అనేక సిద్ధాంతాలను పరిశీలిస్తున్నారు. కొంతమంది ఇది పరిమాణాల మధ్య సంభాషించగల అధునాతన నాగరికతల జాడ కావచ్చని సూచిస్తున్నారు. మరికొందరు ఇది సహజ ప్రక్రియల్లో ఒకటి కావచ్చని, ఇప్పుడే మన అవగాహనలోకి వస్తోందని అంటున్నారు. ఏ సిద్ధాంతం నిజమైనదైనా, ఈ సంకేతం ప్రపంచవ్యాప్తంగా సమాంతర విశ్వాలు, బహువిశ్వ సిద్ధాంతం (ఒకటి కంటే ఎక్కువ విశ్వాలు ఉన్నాయనే అభిప్రాయం) వంటి భావనలపై చర్చలను కొత్త దశకు తీసుకువెళ్లింది. ఇప్పటి వరకు సమాంతర విశ్వాలు కథలలో, విజ్ఞాన సాహిత్యంలో మాత్రమే ఉన్న విషయం. కానీ ఈ రహస్య సంకేతం ఆ భావనను యథార్థానికి చేరువ చేస్తోంది. నిపుణులు ఇంకా దీనిపై విస్తృత పరిశోధన అవసరమని హెచ్చరిస్తున్నారు. కానీ ఈ కనుగొనిక ఆధునిక సాంకేతికత మనలను ఎంత దూరం దృష్టి వేసే స్థాయికి చేర్చిందో చూపిస్తోంది. ఈ రహస్య సంకేతం మనకు విశ్వం ఎంత విచిత్రమైందో, అజ్ఞాత రహస్యాలతో నిండిందో మరోసారి గుర్తుచేస్తోంది. ఇది మన వాస్తవికతపైనే ప్రశ్నలు లేవనెత్తుతూ, మన ఆసక్తులు మరియు శాస్త్రీయ అన్వేషణల సరిహద్దులను దాటి ముందుకు పోవడానికి ప్రేరణనిస్తుంది.

## తొలి జీవి లుకా



భూమిపై జీవజాలం ఏకకణ జీవులతో మొదలైందని అంటారు. కొన్ని కోట్ల సంవత్సరాలకు పూర్వం ఉద్భవించిన తొలి జీవిని 'లాస్ట్ యూనివర్సల్ కామన్ యాన్‌సిస్టర్' (ఎల్‌యుసికె/ లుకా)గా పేర్కొంటారు. అంటే, భూమిపైన ఒకప్పుడు లేదా ప్రస్తుతం ఉన్న అన్ని జీవాలకూ లుకాయే మూలం. డైనోసార్లు అంతరించి పోవడానికి చాలాకాలం ముందు.. అంటే మొక్కలు, చేపలు ఉద్భవించే కాలంలో లుకా జీవించేది. మనము ఇప్పుడు చూస్తున్న వృక్షాలు, జంతువులు, సూక్ష్మ జీవులు అన్నింటికీ ఈ ఒక్క జీవే కీలకం. సుమారు 3.5 నుంచి 4 బిలియన్ల సంవత్సరాల క్రితం భూమిపై ఉండేది లుకా. ఇది మొదటి జీవి కాకపోవచ్చన్న అనుమానాలు కొంతమంది శాస్త్రవేత్తల్లో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకూ కొనసాగిన పరిశోధనలు, అధ్యయనాలను అనుసరించి, లుకాను భూగోళంపై తొలి జీవిగా అంగీకరించక తప్పదు. లుకా జీవించిన కాలంలో భూమి చాలా భారీగా ఉండేది. అగ్నిపర్వతాలు ఎప్పటికప్పుడు పేలుతుండేవి. సముద్రాలు ఎగసిపడుతూ, కొన్నిసార్లు ఎండిపోతూ, విచిత్ర వాతావరణం నెలకొని ఉండేది. ఇలాంటి అత్యంత భయానకమైన పరిస్థితుల్లో లుకా జీవించింది. మెదడు, ఎముకలు, కన్నులు లేని ఈ జీవి ఒక్క కణంతో కష్టాలకు ఎదుర్కొంది. జీవజాలానికి పునాదిగా నిలిచింది. మనిషితోసహా అనేకానేక జీవరాశులను అందించింది. నేడు జెనిటిక్స్ అనే శాస్త్రం ద్వారా, అన్ని జీవుల మధ్య ఉన్న సమానతలను తెలుసుకుంటున్నారు శాస్త్రజ్ఞులు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, డిఎన్‌ఎ కోడ్‌ను విశ్లేషించినప్పుడు, భూమిపైన ఉన్న వివిధ జీవజాతుల తీరు వేరువేరుగా ఉన్నట్టు గుర్తించారు. అయితే, అన్నింటిలోనూ లుకాను కనుగొన్నారు. నాటి లుకాలో 355 జన్యువులు ఉండేవి. ఇప్పటికీ ఈ విధానాన్ని చాలా జీవుల్లో చూడవచ్చు. మొత్తం మీద లుకాకు సంబంధించిన సమాచారం మనకి జీవన చరిత్రలో ఎంతో అద్భుతమైన విజ్ఞానాన్ని ఇస్తున్నది. మనమంతా ఆ సూక్ష్మ జీవి వంశీయులమే అని నిరూపిస్తున్నది. ఇది మనలో ప్రతి ఒక్కరికి ప్రాచీనతను సూచిస్తుంది. అప్పుడు జీవ శాస్త్రం, మన పరస్పర సంబంధాలు, భూమిపై జీవం ఎలా సాగింది అన్నది బాగా వివరిస్తుంది.

## సూర్యుడికే వలయాలు ఉంటే?

ఇది ఊహాజనితమేగానీ, ఎంతో ఆసక్తికరమైన ప్రశ్న. శని (శాటర్న్) గ్రహం మాదిరిరే సూర్యుడికి కూడా వలయాలు (రింగ్స్) ఉంటే ఏమవుతుంది? అప్పుడు మన సౌర మండలం పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. ఆ వలయాలు ధూళి, మంచు భాగాల మిశ్రమంగా ఉండి, సూర్యుని తీవ్ర కాంతితో ప్రకాశిస్తూ ఉండేవి. భూమి నుంచి చూస్తే, ఆ వలయాలు ఆకాశంలో అత్యంత తేజోమయమైన రేఖలా, పాలపుంతకన్నా బలంగా మెరుస్తూ కనిపించేవి. ఈ రింగ్స్ సమీకరణం వల్ల గ్రహాల ఎల్లలు, ఆ భౌతిక పదార్థాల పంపిణీ కూడా మారిపోయేది. అంతేగాక, గ్రహాల పుట్టుక కూడా భిన్నంగా మారేది. సూర్య కాంతి, గ్రావిటీ ప్రభావంతో ఇలాంటి వలయాలు శాశ్వతంగా ఉండిపోయేవి కావు. అవి తరచూ మారుతూనే, అస్థిరంగా ఉంటాయి. అయినా, ఇలాంటి వలయాలు ఉంటే మనకు ఒక అద్భుతమైన, అద్భుత దృశ్యం ఆకాశంలో ఆవిష్కృతమయ్యేది. ఏదిఏమైనా ఊహ కూడా ఒక్కోసారి ఎంతో ఆనందాన్నిస్తుంది.



# బిసి రిజర్వేషన్ల ప్రక్రియ సామాజిక బాధ్యత

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలనే సామాజిక బాధ్యత ప్రభుత్వం గుర్తించినప్పటికీ, అందుకు చట్ట భద్రత చర్యలు లేకుండా కేవలం రాజకీయ లాభాల కోసం బిసి రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తేవడం దురదృష్టకరమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిల పట్ల సామాజికంగా ఆలోచన చేసిన మాట వాస్తవం అయినప్పటికీ, చట్ట పరిధిలో ఆలోచించకపోవడం శోచనీయమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులను పట్టించుకోకుండా, ప్రజల న్యాయ హక్కులను తుంగలో తొక్కుతోందని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిసి రిజర్వేషన్ల అంశాన్ని వాడుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని, బిసిల హక్కులపై దౌర్జన్యమని ఆయన వ్యా ఖ్యానించారు. దేశవ్యాప్తంగా బిసిలకు 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించకుండా, కొత్త రిజర్వేషన్లు అమలు చేయడం అసాధ్యమని స్పష్టంచేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య పునాదులకు అద్దం పట్టిందని, ప్రభుత్వ నిర్ణయా లు చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగ పరమైన సవరణలు చేపట్టి బిసిలకు చట్టబద్ధ రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. రాజకీయ లాభాల కోసం బిసిలను మోసం చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడం ఈ గందరగోళానికి కారణమైందన్నారు. సామాజికంగా, రాజకీయంగా బిసిలను అణగదొక్కే విధానాన్ని కమ్యూనిస్టుపార్టీ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. బిసిల హక్కుల సాధన కోసం సిపిఐ ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా నాయకులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, వెంకట స్వామి, చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, కారుకూరి నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి, బిఆర్ఎస్ మద్దతు పలకాలి...

**హుజూర్‌నగర్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు వారి అభివృద్ధికి దిశా నిర్దేశం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌పై అసెంబ్లీలో అన్ని రాజకీయపార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని గవర్నర్ కూడా వెంటనే ఆ బిల్లును ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఆమోదించిన బిల్లుపై బయట రాజకీయాలు చేయడం తగదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు స్పష్టమైన విధానంతో బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి ప్రజల అభిప్రాయాలను గౌరవించాలన్నారు. బిసి కులగణన ప్రకారం వారికి ఉన్న ప్రాతినిధ్యం ప్రకారం హక్కులు కలిగి ఉండటం సహజం అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం బిసి కులగణన జరిపి రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, దానికి అన్ని అడ్డంకులు తొలగి దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం జరగాలని చారిత్రాత్మకంశం లాగా మిగిలిపోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, రైతుసంఘం పట్టణ లధ్యక్షుడు జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు గమనిస్తున్నారు

**నిజామాబాద్ :** బిసి రిజర్వేషన్ల బిల్లుపై బిజెపి చేస్తున్న కాలయాపనను ప్రజలు గమనిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో బిసి బిల్లుపై బిజెపి చేస్తున్న కాలయాపనను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా బిసి రిజర్వేషన్ల బిల్లుకు బిజెపి కట్టుబడి ఉందని ఒకవైపు మాట్లాడుతూనే, మరో వైపు కోర్టులో కేసులు వేస్తూ కేంద్రంలో రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటూ డ్రామాలాడుతుందన్నారు. బిజెపికి బిసిల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు తక్షణం ఆమోదం తెలిపి రిజర్వేషన్ల పెంపును తొమ్మిదో షెడ్యూల్ చేర్చాలన్నారు. ఒకవైపు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహించకపోవటంతో ఇప్పటికే గ్రామాలలో పాలన కుంటుపడిందని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బిసి బిల్లును అడ్డుకుంటున్న బిజెపికి వ్యతిరేకంగా బిసిలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగరకార్యదర్శి ఓమయ్య, నాయకులు హన్మాండ్లు, రఘురాం, అంజలి, రాధాకుమార్, ప్రసాద్, గోవర్ధన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





# పల్లా వెంకట్‌రెడ్డికి ఘనసన్మానం



**ప్రజాపక్షం/నాంపల్లి:** ఇటీవల చండీగఢ్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలలో సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకట్ రెడ్డికి సిపిఐ నల్లగొండ జిల్లా నాంపల్లి మండల నాయకులు శుక్రవారం హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజాచారి మాట్లాడుతూ నాడు సామాన్య కార్యకర్తగా ఉన్న పల్లా వెంకట్‌రెడ్డిని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకోవడం తెలంగాణ రాష్ట్రానికి, నల్లగొండ జిల్లాకు గర్వకారణమన్నారు. సిపిఐలో కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందనడానికి పల్లా ఎన్నిక నిదర్శనమన్నారు. పార్టీలో పని చేసే నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పనిచేస్తే అవకాశాలు అందివస్తాయని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కమ్యూనిస్టుతో కలిసి పనిచేయడం నేటి తరానికి అవసరమని గుర్తుచేశారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావును పరామర్శించారు. పల్లాను సన్మానించిన వారిలో సిపిఐ నాంపల్లి మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, నల్లగొండ జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షుడు జనంపాట జగన్, నల్లగొండ జిల్లా ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి నేతాల రాజు, నాయకులు ఊరుపాక వెంకటయ్య, కోరే సత్తయ్య, మోగుదాల సైదమ్మ, పల్లెటి దశరథ, బుషిపాక ప్రశాంత్, బుషిపాక యాదయ్య, నేతాల నరేష్, సుంకశాల రాములు, పొదిళ్ల తిరుమలేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై ఫీజుల భారం మోపొద్దు

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి ఈ ఏడాది మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను భారీగా పెంచిందన్నారు. ఒక్కో విద్యార్థికి గతంలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 లు ఉండగా ఇప్పుడు రూ.1200లకు పెంచారని, రికగ్నేషన్ ఫీజు గతంలో రూ.400ఉండగా ఇప్పుడు రూ.800లకు, ఐయుడిఎఫ్ ఫీజు గతం లో రూ.60 ఉండగా ఇప్పుడు రూ. 300లకు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో రూ.50 ఉండగా ఇప్పు డు రూ.200లకు పెంచి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారన్నారు. గతంలో ఒక్కో విద్యార్థి వివిధ రకాల ఫీజుల కింద రూ.1340 చెల్లించారని ఇప్పుడు ఏకంగా అన్ని ఫీజులు కలిపి రూ. 3,250కు పెరిగిందన్నారు. దీంతో ఒక్కో విద్యార్థిపై సుమారు రూ.రెండువేల ఫీజు భారం అధికం గా పడుతుందన్నారు. పేద విద్యార్థులకు పెంచిన ఫీజులు భారమవుతాయని, తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు పవన్, గోపి, ఉపేందర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# పెంచిన ఆర్‌టిసి బస్సు చార్జీలు తగ్గించాలని సిపిఐ నిరసన

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :**పెంచిన ఆర్‌టిసి బస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మహిళలకు ఉచిత బస్సు' పేరిట 'మహాలక్ష్మి' అభినందనీయమని, కాని నష్టాల సాకుతో హైదరాబాద్ నగర ప్రజలు, విద్యార్థులపై చార్జీల భారాన్ని మోపడం తగదన్నారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిన నేపథ్యంలో మరోసారి టికెట్ల రూపంలో చార్జీలు పెంచి నగర ప్రజలు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలపై భారం పడకుండా పెంచిన చార్జీలను వెంటనే తగ్గించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి హరినాథ్‌రావ్, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు నర్సింహారెడ్డి, వెంకటేష్, ఇమామ్, చంద్రయ్య, శ్రీనివాస్‌చారీ, రాజు, సామెల్, యాదగిరి, నర్సింహ, చంద్రకాంత్, గురప్ప, ఆశప్ప, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పెంచిన బస్ చార్జీలు తగ్గించాలి

ప్రజాపక్షం/వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి బస్సు చార్జీలను పెంచి సామాన్య పేద ప్రజలపై భారాన్ని మోపడం సరైనది కాదని, వెంటనే పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు బస్సు చార్జీలు పెంచమని, ప్రజలపై భారాలను వేయమని వాగ్దానం చేసిన ప్రభుత్వం 20 నెలలలో మూడుసార్లు చార్జీలు పెంచి వివిధ రూపాలలో ప్రజలపై కోట్లాది రూపాయల భారాలను మోపిందన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, మరోవైపు బస్ చార్జీలు, విద్యార్థుల బస్ పాసుల రేట్లు పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్‌టిసి లాభాల్లో ఉందని ఒకవైపు ప్రకటిస్తూనే మరోవైపు చార్జీలు పెంచడమేంటని సంక్షేమ, ప్రజా పాలన అంటే ప్రజలపై భారాలు మోపడమేనా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు అంతులేకుండా పెరిగి, పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో బస్ చార్జీలు పెంచడం మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.

## నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు : కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి :విద్యార్థులు చేసే పనిలో పర్ఫెక్షన్ ఉండాలని, నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తారంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కేంద్రం లోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని (ఏటిసి) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లను, పరికరాలను పరిశీలించి వాటి పని విధానాన్ని వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆధునాతన పరికరాలు ఏర్పాటు చేసినందున వాటిని సమర్థంగా ఉపయోగించి నైపుణ్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. క్రమం తప్పక కళాశాలకు హాజరు కావాలని, ఎంపిక చేసుకున్న కోర్సుల్లో చక్కటి నైపుణ్యం సాధించాలని సూచించారు. సంవత్సరం, రెండు సంవత్సరాల వ్యవధిలో 6 కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మొత్తం 244 మంది విద్యార్థులు నమోదు చేసుకునే అవకాశం ఉండగా ఇప్పటివరకు 172 మంది విద్యార్థులు నమోదు అయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూమ్లా నాయక్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష ఎన్నికకు ప్రత్యేక సమావేశాలు

ప్రజాపక్షం/ జనగామ :డిసిసి అధ్యక్ష ఎన్నిక కొరకు ఏఐసిసి అబ్జర్వర్, టిపిసిసి మెంబర్స్ హాజరు కానున్నందున ఈ నెల 11,12 తేదీల్లో నియోజకవర్గాల వారిగా జరిగే సమావేశాలకు ఎంపి, ఎమ్మెల్యే, మండల, అనుబంధ సంఘాలు, రాష్ట్ర స్థాయి నాయకులు, సమన్వయ కమిటి సభ్యులు గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, దేవస్థాన ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరు కావాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వారొక ప్రకటన చేస్తూ 11వ తేది శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ సమావేశం 12వ తేదీ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, అదే రోజు 2.30 గంటలకు మధ్యాహ్నం పాలకుర్తి పట్టణ కేంద్రంలో ఏఐసిసి అబ్జర్వర్స్, టిపిసిసి రిప్రజెంటీవ్ సమక్షంలో సమావేశాలు జరుతాయన్నారు. ఈ సమావేశాలకు అందరు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## ప్రతీ రైతు పంట వివరాలను నమోదు చేసుకోవాలి: విజయ నిర్మల



ప్రజాపక్షం/తొర్రూరు : ప్రతీ రైతు తమ పంట వివరాలను తప్పనిసరిగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని విజయ నిర్మల తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రామనర్సయ్య ఆధ్వర్యంలో మండలంలోని మాటేడు గ్రామంలో పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారిని విజయ నిర్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ పంటలకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. పంట నమోదు చేసుకోకపోతే పంట కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి తమ పంటలను తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జమున, భరత్‌చంద్ర, వినయ్‌వర్మ, రైతులు పాల్గొన్నారు.

## దొంగ అరెస్ట్.. సొత్తు స్వాధీనం




ప్రజాపక్షం/ఆత్మకూరు: జల్సాలు, మద్యం తాగడానికి అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉదయం కటాక్షాపూర్ చెక్ పోస్టు దగ్గర పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అంతలో ఇద్దరు వ్యక్తులు ఒక టూ వీలర్‌పై వస్తూ మమ్మల్ని చూసి వెనకకు తిరిగి పారిపోతుండగా అనుమానం వచ్చి ముగ్గురిని పట్టుకొని విచారించగా పాశం ప్రణీత్ రేణుక ఎల్లమ్మ కాలనీ, గోపాల్‌పూర్ హన్మకొండ అని, రెండో వ్యక్తి తన్నిముట్టి సాయితోపాటు మైనర్ బాలుడు పట్టుబడ్డారు. కాగా వీరిద్దరు జల్సాలు, మద్యం తాగడానికి అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గుళ్లలో దొంగతనాలు చేయాలనుకున్నారు. కాగా 4.6.2025న ఇద్దరితో వారు మిత్రుడైన తన్నిముట్టి సాయి కలిసి ఆత్మకూరు మండలంలోని గుడెప్పాడ్‌లోని రామాలయంలో రూ. వెయ్యి నగదుతోపాటు రాములవారి వెండి జంజరం, రెండు బంగారు గంటె పుస్తెలు వాటి విలువ రూ. 28 వేలు దొంగలించారు. 24.6.2025న మళ్లీ ఆ ముగ్గురు కలిసి దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలోని ఒక వైన్ షాపులో వెంటిలేటర్‌కు ఉన్న గ్రిల్స్‌ను తొలగించి లోపలికి వెళ్లి కౌంటర్‌లో ఉన్న చిల్లర డబ్బులు రూ. 12 వేలతోపాటు మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కాగా డబ్బులు, వెండి, బంగారం, మద్యం బాటిళ్లను పంచుకున్నట్లు తెలిపారు. కాగా పట్టుబడిన వారి నుంచి నగదుతోపాటు బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. దొంగలను పట్టుకున్నందుకు గాను సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు సతీష్, తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ కుమారస్మా, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లను పరకాల ఏసీపీ సతీష్ అభినందించారు.

# స్మార్ట్ సిటీ పథకం గడువు పొడిగింపు

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



ప్రజాపక్షం / హనుమకొండ : స్మార్ట్ సిటీ పథకం కింద వరంగల్, హనుమకొండ నగరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు మరో అవకాశం లభించింది. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నిరంతర కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకం గడువును డిసెంబర్ 31, 2025 వరకు పొడిగించింది.ఇప్పటికే పలు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, పబ్లిక్ సౌకర్యాల భవనాలు, సరస్సుల అభివృద్ధి వంటి పనులు తు ది దశకు చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తికావడానికి మరికొంత సమయం అవసరమని ఎంపి కడియం కావ్య జు లై 31వ తేవెనన పార్లమెంట్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు వివరించారు.గతంలో కూడాసిఎం రేవంత్ రెడ్డితో కలిసి స్మార్ట్ సిటీ పనుల గడువును పొడిగించాలని కేంద్రాన్ని కోరిన ఎంపి కడియం కావ్య ఆ విజ్ఞప్తి ఫలితంగా మార్చి 2025 వరకు గడువు లభించగా, తాజాగా మరోసారి ఎంపి డాక్టర్ కడియం కావ్య కృషితో డిసెంబర్ 2025 వరకు పొడిగింపును కేంద్రం మంజూరు చేసింది. ప్రస్తుతం పెద్ద వడ్డేపల్లి చెరువు సుందరీకరణ నిలిచిపోయింది. ఈ పనుల్లో గ్రీనరీ, లైటింగ్, ల్యాండ్ స్కేపింగ్, పాత్ వే, వాకింగ్ ట్రాక్, స్వాగత తోరణాల ఏర్పాటు ఉన్నాయి. హనుమకొండలోని పద్మాక్షిగుట్ట, ఎన్‌జిఒస్ కాలనీలలో సెం ట్రల్ లైటింగ్, గ్రీనరీ పనులు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తి చే యాల్సి ఉంది. వరంగల్‌లోని పోతన రోడ్డు, పాపయ్యపేటలలో ని లిచిపోయిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ కీలకమైన ప్రాజెక్టులో సుమారు 12 కోట్ల విలువైన గ్రీనరీ పనులు, పోతన రోడ్డులో స్వాగత తోరణం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉందని ఎంపీ తెలిపారు. కరీమాబాద్ దసరా రో డ్డు, రంగశాయిపేటఉర్సు, కరీమాబాద్‌లలో స్మా ర్ట్ రోడ్ల కింద పాత్ వేలు, లైటింగ్, గ్రీనరీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షలు నిర్వహించి వేగవంతం చేయాలని ఎంపి కడియం కావ్య సూచించారు.

## మంత్రి సీతక్కను సన్మానించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సంతాజీ



ప్రజాపక్షం/ఎల్కతుర్తి: తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీతక్క సిద్ధిపేట నుంచి వరంగల్ వెళ్తున్న క్రమంలో ఎల్కతుర్తి జంక్షన్ వద్ద సుందీకరణ పనులు చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుకినె సంతాజీ మంత్రిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్తూరి రత్నాకర్, ఆవుల రాజు, జయపాల్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగు పరచాలి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



ప్రజాపక్షం /జనగామ : అంగన్‌వాడి కేంద్రాల పనితీరు మెరుగు పరచాలని జనగామ జిల్లా కలెక్టర్ రి జ్వాన్ బాష షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ పనితీరుపై సం బంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల హాజరు శాతం పెరగాలని, వైద్య అధికారుల సహకారం తీ సుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కో సం పునాది లోనే పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నందున వంద శాతం ఫలితాలు ఉంటాయన్నాను. హాజరు శాతం పెరగాలని, తగ్గకూడదన్నారు. తగ్గితే అందుకు గల కారణాలు విశేషించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు సామ్, మామ్‌లను నమోదు చేసి ఆరోగ్యాల కనుగుణంగా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నాను. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కందిపప్పు, గుడ్లు, బియ్యం నాణ్యతను ఎప్పటికి అప్పుడు పరిశీలించాలని, క్లస్టర్ల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరు మెరుగు పరిచేందుకు అవగాహన పరచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌బిఎస్‌కె డాక్టర్ అశోక్‌కుమార్, సిడిపిఓలు, సూపర్‌వైజర్‌లు, పోషణ అభియాన్ సి బ్బంది పాల్గొన్నారు.

## 'ధన్ ధాన్య కృషి' పథకానికి జనగామ ఎంపిక

ప్రజాపక్షం /జనగామ :కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకంలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధి జరగనుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ధన్ ధాన్య కృషి చేయజన పథకాన్ని శనివారం ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో వివిధ శాఖ అధికారులలో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధన్ ధాన్య యోజన కృషి పథకానికి జనగామ జిల్లా ఎంపిక కావడం హర్షనీయమన్నారు. ఈ పథకం ద్వారా పేదలు, యువత, రైతులు, మహిళల జీవితాలను మెరుగు పరిచే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయం మాత్రమే కాకుండా మత్స్య సంపద, పశు సంవర్ధక రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్కేల్ టెక్నాలజీ సంస్థాగత బలాన్ని పెంచి తద్వారేఆ అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగు తుందన్నారు. స్థానిక జీవనోపాధి కల్పించి స్థిరమైన గ్రామీణ జీవనోపాధిని సృష్టించడం జరుగుతుందన్నారు. వచ్చే ఆరు సంవత్సరాల కాలంలో అమలయ్యే పథకాల్లో భాగంగా జిల్లాలో వివిధ శాఖల యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. శనివారం ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని జిల్లాలోని అందరు రైతులు, స్వయం సహాయ సభ్యులు, వ్యవసాయ అనుబంధ అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, డిఆర్‌డిఓ వసంత, జిల్లా కోఆపరేటీవ్ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఎడిఎ, ఎంఈఓ, ఎఈలో తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టాలి

బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి కుమారస్వామి



ప్రజాపక్షం/నల్లబెల్లి:స్థానిక సంస్థల ఎన్నికలలో విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని ఆమోదించకుండా మోడీ ప్రభుత్వం వ్యవహరించడం వల్లనే రా ష్ట్రంలో బిసి రిజర్వేషన్ల ప్రక్రియలో అనేక ఆటంకాలు కలుగుతున్నాయని వ రంగల్ బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వా మి అన్నారు. శుక్రవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ రిజర్వేషన్లు దక్కకుండా అగ్రకులాలు చేస్తున్న కుట్రలు బిసిలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చ ట్టాన్ని గవర్నర్ కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికి బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించవలసిన బిసి ప్రధాన మంత్రి అంటున్న మోడీ బిసిల ఎడల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగానే తెలంగాణలో బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా పోతున్నాయన్నారు. బిసిల రిజర్వేషన్లు అమలు జరగాలంటే తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే మార్గమని ఎందరో న్యాయకోవిదులు నిపుణులు చెపుతున్నా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్డినెన్స్ అని ఒకసారి జీవో అని ఒకసారి కాలయాపన చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల జీవో మీద అగ్రకులాలు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాలు కల్పించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్లు సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలను బిసి సంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ద్వారా బలమైన ఉద్యమాన్ని నిర్మించి మోడీ ప్రభుత్వం బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వైనాల వీరస్వామి, బిసి హక్కుల సాధన సమితి మండల కన్వీనర్ కడియాల క్రాంతి కుమార్, మండల నాయకులు కోల లింగయ్య, మామిళ్ల పెద్ద ఐలయ్య, జి రమేష్, బొడిగే నారాయణస్వామి, కె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కుట్రలో భాగమే కోర్టు స్టే

బిసి ఐక్య వేదికనాయకుడు సముద్రాల తిరుపతి



ప్రజాపక్షం/మహాదేవపూర్: అగ్ర వర్ణాల కుట్రలో భాగమే బిసిరిజర్వేషన్‌పై కోర్టు స్టే అని కాటారం డివిజన్ బిసి ఐక్య వేదిక నాయకుడు సముద్రాల తిరుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బిసి సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో బిసి వర్గాలలో హర్షం వ్యక్తమౌతుందని అన్నారు. ఈ నేపథ్యంలో అగ్రవర్ణాల కుట్రతో కోర్టు స్టే విధించిందని గతంలో బిసి రిజర్వేషన్ 50 శాతం ఉన్నప్పటికీ అవగాహన రాహిత్యంతో చేసిన చర్యగా భావిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిసి కులాల ఐక్య వేదిక సీనియర్ నాయకుడు స్వామి యాదవ్ ,శ్రీపతి బాపు, జాగృతి మహేష్ ,కన్నెబోయిన ఐలయ్య యాదవ్, చాగర్ల రవిందర్,తడకల జగదీశ్వర్, మధూకర్, కారెంగుల బాబు రావు, వెకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందించిన సిపి



ప్రజాపక్షం/ హనుమకొండ : రోడ్డు ప్రమాదం మరణించిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా 5లక్షల ప్రమాద బీమా చెక్కును కానిస్టేబుల్ భార్య కీర్తికి అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న పి. హతీరామ్ గత సంవత్సరం మే నెల 10వ తారీకున జరిగిన రోడ్డు ప్రమాదం కానిస్టేబుల్ హతీరామ్ మరణించాడు.ఈ సందర్భంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం తరుపున అందజేయాల్సిన బెనిఫిట్ల ను సకాలంలో అందజేసేందుకు తగు చర్య తీసుకోవాల్సిందిగా సీపీ అధికారులను అదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి రవి, సూపరింటెండెంట్ యాకుబ్ బాబా, సహాయకుడు తులసి పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై బిజెపి, బిఆర్ఎస్‌కు చిత్తశుద్ధిలేదు

సిపిఐ మండలకార్యదర్శి గడ్డమీది శంకరయ్య

ప్రజాపక్షం / వేలేరు : గతరెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో పాలనా వ్యవస్థలేక అభివృద్ధి కుంటుపడుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.గ్రామాలలో వీధిదీపాలు సక్రమంగా లేక చీకట్లలోనే మగ్గిపోతున్న సంఘటనలు ఒకవైపు ఉన్నా పారిశుద్యం లోపించి డెంగీ,మలేరియా,వైరల్ ఫీవర్‌లతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా వీధి కుక్కల స్వైర విహారంతో ఆరుబయటకు వెల్లాలంటేనే జంకుతున్న జనాలకు ఇకకోతుల బెడద వర్ణనాతీతంగా మారింది ఇలాంటి సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతుంటే బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు తమకేమీ పట్టదన్నట్టుగా స్వార్ధ రాజకీయాలతో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపకుండా చోద్యం చూస్తున్నారని సిపిఐ వేలేరు మండలకార్యదర్శి గడ్డమీది శంకరయ్య ద్వజమెత్తారు .శుక్రవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని తన నివాసంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసి సామాజిక వర్గానికి చెందిన సకల కులాలకు అనుగుణంగా కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంభించి కోర్టులో పిటిషన్ వేసి రిజర్వేషన్‌లను అడ్డకోవడం సరైంది కాదని అన్నారు.ఇకనైనా బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు తమవైఖరిని విడనాడి ప్రజాసమస్యల పరిష్కారందిశగా స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు.లేనియెడల రాబోయే రోజులలో బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు ప్రజల తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

**అయోమయంలో ఆశావహులు...**స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్‌లు కొందరికి అనుకూలించినా వారు రిజర్వేషన్‌లు ఎక్కడ మారుతాయోననే సందిగ్ధం ఉండగా మరికొందరికి అనుకూలంగా రిజర్వేషన్‌లు మారిపోయి అనుకూలంగా రిజర్వేషన్‌లు వస్తే బాగుండుననే సందిగ్దంలో ఆశావహులు కొట్టుమిట్టాడుతున్నా రు.ఏది ఏమైనా కోర్టు తీర్పు అనుకూలించేనా..!లేక వ్యతిరేకమా అనే సందిగ్ధంలో రాజకీయ నాయకులు ఊగిలాడుతున్నారని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

# భగ్గుమన్న ఓరుగల్లు

జిఒ9పై హైకోర్టు స్టే విధించినందుకు బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ గౌడ్




ప్రజాపక్షం/హనుమకొండ : ఓరుగల్లు జిల్లా ఒక్కసారి భగ్గుమన్నది. స్థానిక సంస్థల కోటాలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జారీ చేసిన జిఒ 9పై హైకోర్టు స్టే విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ నేతృత్వంలో భారీ సంఖ్యలో బిసి లోకమంతా రోడ్లపైకి వచ్చి హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీ కజంక్షన్ వద్ద రాస్తారోకో, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జిఒ 9కి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించిన రెడ్డి జాగృతి సంఘం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణ గౌడ్ బిసి సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించినప్పటి నుంచి ఇప్పటివరకు బిసి రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కింది నుంచిపై కోర్టుల వరకు వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని, కోర్టులు కూడా బిసిలకు న్యాయం చేయడం లేదని ఆయన ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయని మండిపడ్డారు. ఒక పార్టీపై ఇంకొక పార్టీ నిందలు వేసుకుంటూ బిసిలను బలిపశువులను చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లపై పిటిషన్ రెడ్డి జాగృతి సంఘం దిష్టిబొమ్మను బిసి నాయకులు దహనం చేశారు. బిసి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ... రెడ్డి కులస్తులంతా బిసి వ్యతిరేకులేనని, బిసి సమాజమంతా రెడ్డి కులస్తులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే రాష్ట్రపతి, గవర్నర్ ల వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వంతో ఢిల్లీలో పోరాటం చేసి బిసి రిజర్వేషన్లను సాధించేవరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి రాష్ట్ర చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, బిసి జెఎసి హన్మకొండ కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, గడ్డం భాస్కర్, పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, వైద్యం రాజగోపాల్, బిసి సంఘం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు ఓ డ్రామా

విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



ప్రజాపక్షం/హనుమకొండ : కాంగ్రెస్ 420 హామీల్లాగానే 42 శాతం బిసి రిజర్వేషన్లు ఒక డ్రామా అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని ఎర్రబెల్లి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల స మావేశంలో ఆయన మాట్లాడారు. ఈ లిల్లీపుట్ ముఖ్యమంత్రికి పాలన తెలియదని, అసలు అవగాహన లేదని, మంత్రులు కూడా అట్లానే ఉన్నారని అన్నారు. కోర్టును గౌరవించకుండా పొద్దుగాల నామినేషన్లు తీసుకొని సాయంత్రం నవ్వుల పాలయ్యే పరిస్థితి ఈ ప్రభుత్వానిదని, పొద్దుగాల లేస్తే కెసిఆర్‌ను తిట్టుడు, దేవుళ్ళ మీద ఒట్టు పెట్టుడు తప్పా ఈ లిల్లీపుట్ ముఖ్యమంత్రికి ఏం తెలియదని అన్నారు. ఆయన మాటలు గతంలో ప్రజలు నమ్మారు కాని కోర్టులు నమ్మలేదు కాబట్టే హైకోర్టు గూబగూయ్యిమనిపించిందన్నారు. రాష్ట్రంలో కనీసం ఇద్దరు మంత్రులు కలిసి తిరిగే పరిస్థితి లేదని, ఎవరి కుర్చీ ఎవరు లాక్కుంటారనే భయంతో ఉన్నారని, ఏ ఒక్క మంత్రి కూడా నియోజకవర్గంలో తిరగడం లేదన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకొలేక కొత్త డ్రామాకి తెరలేపి, స్థానిక ఎన్నికలు నిర్వహించలేకనే ఏదో కోర్టు ఆపిందని, తాము బిసిల కోసం అన్ని చేశాం అని చెప్పుకోవాలని కాంగ్రెస్ కుట్ర పన్నిందన్నారు. 55 ఏండ్లు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉండి బిసిల గురించి ఎందుకు పట్టించుకోలేదు ? అని ప్రశ్నించారు. తూతూ మంత్రంగా జిఒ ఇచ్చి ఎన్నికలు నిర్వహించలేకనే ఇదంతా డ్రామా అని, నిజంగా బిసిల పట్ల ప్రేమ ఉంటే రిజర్వేషన్లపై కేంద్రంతో కొట్లాడండి. దానికి మేమంతా కలిసి వస్తామన్నారు. ఈ ప్రభుత్వం 22 నెలలు అయిందని, అధికారంలోకి వచ్చి బిసిలకి ఏం చేశారని,బిసి బంధు బందు పెట్టింది, చేప పిల్లల పంపిణీ బందు పెట్టింది, నాయి బ్రాహ్మణ, రజకుల ఉచిత విద్యుత్ బకాయిలు పెండిరగ్‌లో పెట్టింది, గొల్లకురుమలకు గొర్రెలు బందు పెట్టి ఇంకా ఏదో బిసిల మీద ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఒడిదల సతీష్ కుమార్ , శంకర్ నాయక్ పాలకుర్తి నియోజకవర్గం, వర్ధన్నపేట నియోజకవర్గం లోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## విఠల్ రావు నగర్‌లో సింగరేణి ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని విఠల్ రావు నగర్‌లో శుక్రవారం సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య సేవలు అందించాలనే సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిబిరం నిర్వహించబడింది. శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు, వృద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మొ త్తం 155 మంది ప్రజలకు సాధారణ వ్యాధులకు ఉచిత మందులు పంపిణీ చేయగా, రక్తపోటు, చక్కెర వంటి వ్యాధుల నియంత్రణకు అవసరమైన మం దులు కూడా అందజేశారు. డీజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ ఇంటి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అని సూచించారు. గ్రామ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించినందుకు సింగరేణి వైద్య బృందాన్ని అభినందించారు. డాక్టర్ బెనర్జీ, స్టాఫ్ నర్స్ అనంతలక్ష్మి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ కె.వి. మారేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది రామ, రాము, భాను, విఠల్ రావు నగర్ గ్రామస్థులు, విఠల్ రావు నగర్ శ్రీరామ్ యూత్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ ప్రకారమే 42 శాతం బిసి రిజర్వేషన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఎన్నికల హామీల్లో భాగంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను క్యాబినెట్‌లో ఆమోదించి బిల్లు ప్రవేశపెట్టిందని బిసి సంఘాల నాయకులు, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌తోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వెళ్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారమే 42 శాతం బిసి రిజర్వేషన్ సాధించుకుంటామన్నారు. బిఆర్ఎస్, బిజెపి బిసి రిజర్వేషన్‌కు అడ్డుపడుతున్నాయని వారు ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ 'డిఎం'కు స్పందన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి స్పందన లభించిందని ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం డిపో పరిధిలో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు అందించారని డిఎం తెలిపారు. ఖమ్మం నుండి బోనకల్‌కు పల్లెవెలుగు సర్వీసులను పెంచాలని, ఖమ్మం జక్కేపల్లి సర్వీస్ సమయాన్ని సవరించాలని ఖమ్మం నుండి కోదాడకు పల్లెవెలుగు ఛార్జీలను తగ్గించాలని, ఖమ్మం నుండి గాదెపాడుకు సర్వీస్ పెంచాలని ప్రయాణికులు కోరినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు చెప్పిన సమస్యలను, సూచనలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిఎం శివప్రసాద్ తెలిపారు.

## అక్టోబర్ 28 లోగా దరఖాస్తులు సమర్పించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం నందు డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నిషియన్ (30 సీట్లు), డిప్లొమా ఇన్ మెడికల్ ఈమెజింగ్ టెక్నిషియన్ (30 సీట్లు) రెండేళ్ల వ్యవధి గల కోర్సులో చేరుటకు అక్టోబర్ 28 లోపు దరఖాస్తులు సమర్పించాలని ప్ర భుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా॥ టి. శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపి సి చేసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపిసి ఇతర అర్హులైన అభ్యర్థులు తదుపరి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు https:// tgpmb. telangana. gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు పత్రాన్ని ప్రింట్ తీసి ధృవపత్రాలు జత చేసి ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం కార్యాలయంలో అక్టోబర్ 28 సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం వెబ్ సైట్ https://gmckhammam.org సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిఎల్‌వి గుండెబోయిన రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మంచిగా ఆరోగ్యంగా ఉండాలంటే ఏ విషయం అయినా పదే పదే ఆలోచించకుండా, మన గృహ వాతావరణంలో పచ్చని చెట్లు ఉండాలన్నారు. ఉమ్మడి కుటుంబంతో జీవిస్తూ ఉండాలని, సామూహికంగా మంచి చెడు విషయాల గురించి చర్చ సమావేశాలు జరుపుతూ ఉండాలని అవగాహన కల్పించారు. ఆళ్లపల్లి గ్రామస్తులు ఎస్‌డి సాబీర్, రేసు సురేందర్, సత్యనారాయణ, కోటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 15లోపు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండి ముజాహిద్ తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి ఇంగ్లీష్, నేలకొండపల్లి బాయ్స్ నందు జనరల్ జెఎ ల్ మ్యాథ్స్, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ పోస్టు లు, వైరా గర్ల్స్ నందు పిజిటి ఇంగ్లీష్, ఖమ్మం గర్ల్స్ నందు ఫిజికల్ డైరెక్టర్ పో స్టు ఖాళీగా ఉందన్నారు. జెఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టు లో 50 శాతం మార్కులతో పాటు బిఈడిలో 50 శాతం మార్కులు, టిజిటి పో స్టులకు సంబంధిత సబ్జెక్టు గ్రాడ్యుయేషన్, బిఈడిలో 50 శాతం మా ర్కుల తో టెట్ తప్పనిసరి అన్నారు. మూడేళ్ల బోధనా అనుభవంతో పాటు ఖమ్మంజిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. అభ్యర్థులు పూర్తి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్, ఫోటో కాపీలు, ఇతర పత్రాలు సంబంధిత మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబర్ 13 నుంచి అక్టోబర్ 15 సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని షార్ట్‌లిస్టు అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలి


నూతి సత్యనారాయణ


**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొర్ల గంగారావుని శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణతో కలిసి శాలు కప్పి ఘనంగా సన్మానించారు. వైరా వ్యవసాయ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపడంలో ముందుండాలని వారు సూచించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాంకుడోతు బీక్యా, గడసందుల దర్గయ్య, యడ్లపల్లి వీరయ్య చౌదరి, దాసరి దానేలు, శేఖర్ రెడ్డి, ఫణితి శ్రీను, తేజావత్ నాగేశ్వరరావు, పాలేటి నర్సింహారావు, పల్లపు కొండలు, నగేష్, దురిశెట్టి నర్సింహారావు, గుగులోతు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా వ్యాపారం దందా

ఉమ్మడి జిల్లాలో రూ. 15 కోట్ల వ్యాపారం
అనుమతుల కోసం లక్షలాది రూపాయల వసూళ్లు
అధికారులకు కమిషన్లు - వ్యాపారులకు లాభాలు
భారం వినియోగదారులకు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సంపాదన కోసం ఏ పనైనా చేసేందుకు కొందరు వెనకాడడం లేదు. రూపాయి కో సం దందాలు చేస్తున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని జరిగే బాణాసంచా వ్యాపారం కొందరికి కాసులు కురిపిస్తుంది. ఈ కాసుల వేటలో కొందరు తమ స్థాయిని మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ ఒక రకం దందా అయితే అనుమతుల పేరుతో ప్రతి యేటా లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వీటికి అనేక ఘటనలు బలం చేకూరుస్తున్నాయి. ఒకప్పుడు కేవలం పండుగ వరకే పరిమితమైన ఈ వ్యాపారం ఇప్పుడు సంవత్సరం పొడవునా నడుస్తుండడంతో బాణాసంచా విక్రయాలు కూడా ఒక వ్యాపారంగా మారింది. ఇందులో తాము మాత్రమే వ్యాపారం చేయాలని ఇతరులు చేయకూడదని లేదా తాము చెప్పిన ధరకే విక్రయించాలనే నిబంధన పేరుతో దందాలకు తెగ పడుతున్నారు. కొణిజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బహిరంగంగా ఓ ప్రభుత్వ ఉద్యోగి అసభ్యంగా మాట్లాడుతున్న ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇదిలా ఉండగా వివిధ శాఖల అనుమతులతో ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దీపావళి దుకాణాలకు అనుమతులు ఇస్తారు. ఈ అనుమతుల దందా జిల్లాలో శృతిమించిందన్న వార్తలు వినవస్తున్నాయి. అనుమతుల కోసం అధికారులకు ఇవ్వాలంటూ లక్షలాది రూపాయలు వసూలు చేయడం జరుగుతుంది. వివిధ శాఖల అధికారులతో పాటు మీడియాకు ఇవ్వాలంటూ కూడా డబ్బులు వసూలు చేస్తున్నారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మున్సిపల్, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు మీడియా పేరుతో కూడా వసూళ్లు చేస్తున్నారు. కమిషన్ల పేరుతో దుకాణ నిర్వహకుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు చేయడం ఆ భారాన్ని వినియోగదారులపై వేస్తున్నారు. ఇప్పటికే బాణాసంచా ఎంఆర్‌పి విక్రయించే దానికి సంబంధం లేదు. ఎవరి ఇష్టాను సారంగా వారు విక్రయాలు జరుపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నాణ్యత లేకపోవడం, లాభార్జనే ధ్యేయంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అధికారుల పేరుతో వసూళ్లు చేస్తున్న కమిషన్లకు సంబంధించి ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని దీపావళి మందుల పేరుతో జరిగే వసూళ్లకు ఫుల్ స్టాప్ పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అధికారుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యాపారిని బెదిరించిన విషయమై కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో కొందరు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.





## ఆక్రమణదారులకు అడ్డేది..?

ఫుట్ పాత్ ను సైతం వదలని వైనం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సురక్ష బస్టాండ్ పరిధిలో ఆక్రమణదారులకు అడ్డు లేకుండా పోయింది. ఆక్రమించడానికి స్థలం లేదా అంటూ పాదాచారులు ప్రశ్నిస్తే అవమానకరమైన మాటలతో వాళ్లని హింసిస్తున్నారని సామాజిక కార్యకర్త కర్నే రవి శుక్రవారం ఆరోపించారు. మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సురక్ష బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రధాన రహదారిని ఆక్రమించారని తెలిపారు. రహదారిని ఆక్రమించడమే కాకుండా షాపులు నిర్మించి, ఫుట్ పా త్ మీద, వీధి వ్యాపారులుకు రెంట్ కు ఇస్తూ 3000 నుండి 5000 రూపాయలు అక్రమంగా అద్దె సంపాదిస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై సైతం తిరగబడుతున్నారని, వారిపై అసభ్యకరంగా మాట్లాడుతున్నారని రవి ఆరోపించారు. సురక్ష బస్టాండ్ దగ్గర ఉన్న ఫుట్ పాత్ పై ఆక్రమణలను ప్రధాన రహదారి పై ఇరువైపుల ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణదారులు తొలగించాలన్నారు. ఈ విషయం మీద సామాజిక కార్యకర్త కర్నే రవి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

# భద్రాద్రి ఆలయానికి నూతన శోభ

రామాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకోనుంది. ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాచలం రామాలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పా టు ఆలయ అధికారులతో అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఆలయ విస్తరణ కో సం భూసేకరణ పూర్తి అయిందని, చుట్టూ ఉన్న మాఢవీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల ని ర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని తెలిపారు. ఆగమ శాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ ని ర్మాణంలో ప్రతి అంశం ఆగమ శాస్త్రం ప్రకారం ఉం డేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తుల వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. భద్రాద్రి రామాలయంలో చేపట్టే అభివృద్ధి పనులు దేశ వ్యాప్తంగా భక్తులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, రామకోట మాఢవీధులు ఆధునీక కట్టడాలతో కొత్త చరిత్ర సంతరించుకుంటుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆ ధ్వర్యంలో ఖమ్మం నగరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.మూడు అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిటిడి అధికారులకు ప్రతిపాదించినట్లు తెలిపారు. సోమవారం టిటిడి అధికారులు ఖమ్మం నగరానికి వచ్చి క్షేత్ర పరిశీలన జరిపి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి తెలిపా రు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మంజిల్లాలో భక్తి, పర్యాటక రం గాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు.

## నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
పారిశుద్ధ్యంపై 10 రోజులుల స్పెషల్ డ్రైవ్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై ము న్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం న గరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టేందుకు అక్టోబర్ 13 (సోమవారం) నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు 10 రోజులు పాటు చేపట్టడం జరుగుతుందన్నారు.మురుగు నీ రు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జవాన్ నుంచి సహాయ కమిషనర్ వర కు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో ఈ డ్రైవ్ చేపట్టాలన్నారు. శుభ్రం చేసిన ప్రాంతాల్లో ముందు ఆ తర్వాత తేడాను తెలియజేసేలా ఫోటోలు తీయాలని అవసరమైతే అదనపు సిబ్బందిని, ఎక్విప్‌మె ంట్‌ను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. జవాన్ వారీగా రోజుకు ఏ ప్రాంతంలో ఎ న్ని కిలో మీటర్ల రోడ్లు శుభ్రం చేస్తున్నారు తెలియజేసేలా ప్రోఫార్మా తయారు చేయాలన్నారు. ఆకస్మికంగా తనిఖీ చేస్తామని అపరిశుభ్రంగా ఉ ంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. స్పెష ల్ డ్రైవ్ సందర్బంగా శానిటేషన్ జ వాన్, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలన్నారు. క్షేత్ర స్థాయి లో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. నగర వ్యాప్త ంగా ఉన్న డ్రైన్, పూడికతీత పనులు చేపట్టాలన్నా రు. పబ్లిక్ పార్కు, బస్‌స్టాప్స్, పబ్లిక్ టాయిలెట్లను పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. నగరంలో ఉన్న ఖాళీ స్థలాలను వంద శాతం శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ప్రైవేటు ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకునేలా యజమానులకు నోటీసులు అందించాలన్నారు. రోడ్డు మీద ని ర్మాణ వ్యర్థాలు ఉండటానికి వీలు లేదన్నారు. హో టల్స్, వ్యాపార వాణిజ్య సంస్థలు బయట ఎ క్కడైనా చెత్త వేస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేయాల ని కలెక్టర్ తెలిపారు. 15 రోజుల్లో ఖమ్మం నగరంలో ప్రధాన రహదారిపై ఎక్కడ గుంటలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్, జవాన్లు, అధికారులుపాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన ఎఒ వాణి



**ప్రజాపక్షం/కూసుమంచి:**మండలంలోని పూరియా తండా, ఉడతలగూడెం గ్రామాలలో శుక్రవారం వరి, పత్తి, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కందిలో శనక పచ్చ పురుగు, కాయ తొలుచు పురుగులను గమనించడం జరిగిందని, వీటి నివారణకు ఎమోమెక్టిన్ బెంజోయేట్ 88 గ్రాములు ఎకరానికి లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5శాతం ఎస్సీ 60 మీలీ ఎకరానికి లేదా స్పైనోసాడ్ 45శాతం ఎస్సీ 50 మీలీ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా ప్రస్తుతం వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించడం జరిగిందనీ, ఈ తెగులు ఆశించినప్పుడు ఆకుల పైన పసుపు రంగు మచ్చలు ఏర్పడి, అంచుల వెంబడి అలల మాదిరిగా ఎండి పోవడం జరుగుతుందనీ, ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పైపాటుగా నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలనీ సూచించారు. ఈ తెగులు పూర్తిగా నివారించడానికి ఎలాంటి మందులు లేవు అని రైతులు గమనించాలనీ తెలిపారు. పలు సూచనలు చేశారు. అనంతరం పత్తి రైతులు సీసీఐలో పత్తిని అమ్మడానికి కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**ప్రజాపక్షం/ములకలపల్లి:** బిసిలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నాయకులు సురభి రాజేష్ అన్నారు. శుక్రవారం హైకోర్టు తీర్పుతో తెలంగాణలో ఆగిన ఎన్నికల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో బిసిలకు ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి, దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర నిలిచిందన్నారు. హామీ అమలు మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్న సమయంలో కోర్టు తీర్పు ఊహించలేదని తెలిపారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల టో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులను చైతన్యపరిచి ఉద్యమం తప్పదని ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.శనివారం సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో 40 మంది ఆటో డ్రైవర్లు వివిధ యూనియన్ నుండి ఏఐటీయూలోకి చేరారు. తనంగా చేరిన వారికి ఏఐటియుసి ఎర్ర కండువాలను కప్పి ఆహ్వానించారు. ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లకు సం వత్సరానికి 12 వేల రూపాయలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో అర్హులైన ఆటో డ్రైవర్ల అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తెలిపారు. దీపావళి లోపు వాహన మిత్ర పథకం రాష్ట్ర వ్యాప్తంగా వర్తింపజేయాలని లేనిపక్షంలో ఆటో డ్రైవర్ లను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హె చ్చరించారు. అనంతరం మంగపేట గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా కొర్ర మోహన్, గౌరవ అధ్యక్షులుగా కిషన్, సలహాదారుడుగా బిక్కులా ల్, కార్యదర్శిగా గుగులోతు నాగేష్, ఉపాధ్యక్షులుగా దేవరాజు, ఆర్గనైజర్‌గా బి రమేష్, సహాయ కార్యదర్శిగా రాజ్ కుమార్, మురళి, శివరాం, నవీన్ తదితరులను ఎన్నుకున్నారు. గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు భూక్య దశ్రు, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, సిపిఐ సీనియర్ నాయకులు భాగం శేష భూషణం, భాగం కృష్ణ, మూడు గణేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, ప్రజా సం ఘాల బాధ్యులు, ఆటో వర్కర్స్ యూనియన్ స భ్యులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల బిల్లు మంజూరులో జాప్యమేలా..?

మనోవేదనలో లబ్ధిదారులు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని కొందరి పంచాయతీ కార్యదర్శుల తీరుతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసిన ఇంతవరకు ఇంటి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖాతాలో జమ కాలేదని, మొత్తం అప్పులు తెచ్చి సగం వరకు ఇల్లు నిర్మించామని, ఇప్పటికి రూపాయి కూడా పడకపోవడంతో ఇంటి ని ర్మాణం ఆగిపోయిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బీరోలు గ్రామంలోని సుమారు 40 ఇందిరమ్మ ఇండ్లు మం జూ రై నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్న ఇంతవరకు కొంత మంది లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ కాలేదని అక్కడి లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. అసలు కారణం పంచాయతీ కార్యదర్శి అవగాహన లోపమని, ఆయన ఆన్‌లైన్ ప్రక్రియ సరిగా చేయటం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు చేసినా రిజెక్ట్ అవుతున్నాయని, ఈ విషయంపై హౌసింగ్ ఎఈని వివరణ అడగగా బీరోలు గ్రామంలో 40 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే సగం బిల్లులు చెల్లించామని, కేవలం ముగ్గురికి పూర్తిగా పడలేదని, అది గ్రాండ్ లెవల్‌లో సమస్య ఉందని, కలెక్టర్ దృషికి తీసుకెళ్లామని, రెండు మూడు రోజుల్లో ఆ బిల్లులు పడతాయని ఆయన వివరించారు.




## నిర్లక్ష్యంలో వార్డు అధికారులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో ఉన్న అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా వార్డుల పరిధిలో ఉన్న ప్రజలు ఆరోపిస్తున్నారు. 20 వార్డులలో 26,000 జనాభా ఉండగా 20 వార్డులలో గ్రామాలు తూర్పు లోకవరం, పడమర లోకవరం, పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర, కప్పల బంధం, ఖాన్ ఖాన్ పేట, బోడి మల్లె, కల్లూరు, హనుమ తండా, లక్ష్మి తండా గ్రామాలు ఉండగా ఆయా గ్రామాల పరిధిలో పరిపాలన విధానంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉండగా వారు మునిసిపాలిటీ కార్యాలయానికి పరిమితమై విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉండటంతో ఆయా గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు చెత్త ట్రాక్టర్లు నిర్వహణ వర్షాకాలంలో మురుగు నీటిని తొలగించుట పూడిక తీత, గృహాల మధ్య పిచ్చి మొక్కలు తీసివేయుట బ్లీచింగ్ ,పాగింగ్, త్రాగునీరు, పైప్ లైన్ లీకేజ్, కలుషితనీరు తదితర విధులు పట్ల ప్రత్యేక పర్యవేక్షణ లేకుండా మున్సిపాలిటీ కార్యాలయంలోనే నాలుగు గదులమధ్య ఉంటూ కిందిస్థాయి సిబ్బందితో సమాచారం తెలుసుకొని ఉంటున్నారు. వార్డు కార్యాలయాల్లో ఉండి ప్రజలకు సేవలు అందించాల్సిన వార్డు అధికారులు విధులు బాధ్యతలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ఉంటున్నారని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.



# రీల్



## 'డ్యూడ్' ట్రైలర్ విడుదల

లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు'అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సాంప్రదాయ ప్రేమ కథల కంటే భిన్నంగా 'డ్యూడ్' కథ ఒక యువకుడి జీవితం, ప్రేమతో మొదలవుతుంది. తాను అన్నీ అర్థం చేసుకున్నానని అనుకునే ఒక పక్కా రొమాంటిక్. అతని ప్రేమ జీవితం పర్‌ఫెక్ట్‌గా సాగుతున్నట్లు అనిపిస్తుందంతే కానీ, ఒక్కసారిగా నిజ జీవితం తలకిందులు అవుతుంది. అతని లవ్ దూరమవడం అతని మనసులో భావోద్వేగ తుఫాను తెచ్చిపెడుతుంది. అదే సమయంలో మరో అమ్మాయి అతని జీవితంలోకి అడుగు పెట్టడం, తాళి అనే అంశానికి కొత్త మీనింగ్ జోడిస్తుంది. ప్రదీప్ తన నేచురల్ హ్యూమర్, ఎమోషన్స్ అదరగొట్టాడు. మమితా బైజు తన పాత్రలో కట్టిపడేసింది. నేహా శెట్టి ప్రెజెన్స్ ఇంట్రెస్టింగ్‌గా వుంది. శరత్‌కుమార్, రోహిణి మొల్లెట్టి, హృదు హారూన్, ద్రవిడ్ సెల్వం లాంటి నటులు కథకు మరింత బలాన్ని జోడించారు.అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో నటుడు శరత్ కుమార్, ప్రొడ్యూసర్ రవిశంకర్, మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## 17 నుంచి జీ5లో కిష్కిందపురి స్ట్రీమింగ్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్, మకరంద్ దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం ఈ హారర్‌థ్రిల్లర్ థియేటర్లో సంచలన విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందరికీ థియేటర్లో ఇది సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించింది. జీ5లోకి రాబోతోంది ఈనెల 17న సాయంత్రం 6 గంటల నుండి 'కిష్కింధపురి'ని స్ట్రీమింగ్ కానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రంలో థియేటర్లలో బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుని ఇక ఇప్పుడు డిజిటల్ ఫ్లాట్‌ఫాంలోకి అడుగు పెడుతోంది.

## 'దక్కన్ సర్కార్' పోస్టర్ విడుదల



తెలంగాణ ఉద్యమకారుడు ప్రముఖ రచయిత కళా శ్రీనివాస్ నిర్మించిన 'దక్కన్ సర్కార్' సినిమాకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఈ పోస్టర్ ని ఆవిష్కరించడం జరిగింది..ఈ కార్యక్రమంలో మరో సీనియర్ ఉద్యమకారుడు, కళాకారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్ పాండే, చిత్ర హీరో చాణిక్య, మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుండి ఇలాంటి మరిన్ని చిత్రాలు రావాలని దానికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందని తెలపడం జరిగింది. మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాల నిర్మాణం జరగాలని..ప్రభుత్వం తెలంగాణ సినిమాలను, కళాకారులను ప్రోత్సహించాలని కోరుతూ చిత్ర యూనిట్‌ను అభినందించారు. చిత్ర దర్శకుడు, నిర్మాత కళా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది ప్రజల జీవన స్థితిగతుల కథ అని, సహజ సంఘటనలను బేస్ చేసుకొని సహజ సిద్ధంగా నిర్మించిన చిత్రం అని, 2 సంవత్సరాలు కష్టపడి ఎన్నో ఒడుదొడుకులు తట్టుకొని పూర్తి చేశామని, ఈ సినిమాని తన అభిమాన తార విజయశాంతి ప్రమోషన్ చెయ్యడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నటి మౌనిక మాట్లాడుతూ.. ఈ సినిమాలో నాకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన సుమారు 40 మంది కళాకారులు పాల్గొన్నారు


## బ్రహ్మానందంపై పాట అనుకోకుండా తీశాం

### నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప



ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో నిర్మాతలు కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప మీడియాతో ముచ్చటించారు. వారు చెప్పిన విషయాలు, విశేషాలు. ఈ కథతో చాలా ఏళ్లుగా ట్రావెల్ అవుతున్నారు. ఓ సారి మా ఇద్దరినీ ఈ కథ వినమని చెప్పారు. కళ్యాణ్ ఎక్కువగా వ్యాపారాల్లో బిజీగా ఉంటారు. మేం ఇద్దరం ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేయాలని అనుకున్నాం. ఆ టైంలో ఈ కథను విన్నాం. ఈ మూవీతో పాటుగా మరో రెండు ప్రాజెక్టుల్ని కూడా స్టార్ట్ చేశాం. విజయేందర్ మంచి దర్శకుడు. అనుదీప్, 'మ్యాడ్ కళ్యాణ్, ఆదిత్య హాసన్‌లతో విజయేందర్ పని చేశాడు. పూర్తి స్క్రిప్ట్‌తోనే మా వద్దకు వచ్చాడు. కథను ఎంత అద్భుతంగా రాసుకున్నాడో.. అంతే అద్భుతంగా తీశాడు. కొత్త దర్శకుడిలా, మొదటి సినిమాలా అనిపించలేదు. మేం రైటర్స్‌తో కలిసి రైటింగ్ రూంని ముందుగా ప్రారంభించాం. అక్కడ పుట్టిన కథలతోనే 'ఆయ్', 'తండేల్' బయటకు వచ్చాయి. అందుకే మేం ఆ చిత్రాలకు కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించాం. స్క్రిప్ట్ ఓ లెవెల్ వచ్చే వరకు మేం అందులో ఇన్వాల్వ్ అవుతాం. 'మిత్ర మండలి'లో బ్రహ్మానందం పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందన్నారు.

## 'దోచావే నన్నే' సాంగ్ విడుదల



ప్రియదర్శి ప్రస్తుతం రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వి నారంగ్ నిర్మాణంలో రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటేతో రాబోతున్నారు. ఆనంది హీరోయిన్ గా నటిస్తోంది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. 'థ్రిల్‌యు ప్రాప్తి రస్తు!' అనేది ట్యాగ్‌లైన్. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ వారసత్వాన్ని కొనసాగిస్తూ శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ నిర్మిస్తోంది. స్పిరిట్ మీడియా సమర్పిస్తుంది. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ సింగిల్ 'దోచావే నన్నే'ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటను నాని లాంచ్ చేశారు.


## రొమాంటిక్ స్టోరీస్ అంటే ఇష్టం

### చిట్ చాట్‌లో శ్రీనిధి శెట్టి



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. అక్టోబర్ 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీనిధి శెట్టి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. తెలుసు కదా సినిమాలో చాలా హ్యాపీగా ఉంది. కేజిఎఫ్, హిట్ త్రీ యాక్షన్, చాలా బ్లడ్ బాత్ ఉన్న సినిమాలు. తెలుసు కదా ఒక లైట్ హార్టెడ మూవీ చాలా కొత్తగా ట్రై చేశాం. ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి వున్నప్పుడు ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ తెలుసు కదాలో ఒక యూనిక్ పాయింట్ ని టచ్ చేశాం. అది ఇప్పుడు రివిల్ చేయకూడదు. సినిమా చూసినప్పుడు మీరు ఖచ్చితంగా సర్ ప్రైజ్ అవుతారు. నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. తెలుసు కదాలో మంచి రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ వుంది. హిట్ 3కి ముందే ఈ కథ విన్నాను. కథ చాలా నచ్చింది. అయితే ముందుగా హిట్3 రిలీజ్ అయ్యింది. తెలుసు కదాలో లవ్ ఎమోషన్ లాఫ్ సాంగ్స్ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ వుంటాయి. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు. నీరజ చాలా పాషన్ తో సినిమా చేశారు. నీరజ విజన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది. ఇది మంచి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్. ఇందులో చాలా కొత్త పాయింట్ వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతాయి. థియేటర్స్‌లో చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు. సిద్ధు గారి క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేస్తారు. సిద్ధుకి అన్నీ డిపార్ట్మెంట్స్‌లో చాలా నాలెడ్జ్ వుంటుంది. ఒక యాక్టర్‌కి అన్ని విభాగాలపై పట్టు వుండటం అదృష్టం. రాశి ఖన్నా చాలా క్రమశిక్షణ గల నటి. తన డైట్, వర్క్ అవుట్ అన్నీ పద్ధతిగా వుంటాయినాకు మొదటి నుంచి తెలుగు ఇష్టం. కాలేజ్ డేస్ లో తెలుగు ఫ్రెండ్స్ వుండేవాళ్ళు. అప్పటి నుంచి తెలుగు మాట్లాడటం అలవాటైయింది.వెంకటేష్ , త్రివిక్రమ్ సినిమాలో అవకాశం రావాలని కోరుకుంటున్నాను.

## 'ఫంకీ' టీజర్ విడుదల



కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ఈ చిత్ర టీజర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. ఇందులో విశ్వక్ సరికొత్తగా కనిపిస్తున్నారు. కథానాయిక కయాదు లోహర్ తన అందంతో కట్టిపడేశారు. వీరి జోడి కొత్తగా, ఉత్సాహంగా కనిపిస్తూ.. తెరకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. టీజర్ లో భీమ్స్ సిసిరోలియో సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనదైన నేపథ్య సంగీతంతో ప్రతి షాట్‌ను మరో స్థాయికి తీసుకెళ్ళారు. మొత్తానికి టీజర్ మళ్ళీ మళ్ళీ చూడాలి అనిపించేలా ఉండటమే కాకుండా, సినిమా పట్ల ప్రేక్షకుల ఆసక్తిని రెట్టింపు చేస్తోంది.దర్శకుడు అనుదీప్ శైలి ప్రత్యేక వినోదం టీజర్ లో అడుగడుగునా కనిపించింది.

## ఓటీటీలోకి 'త్రిబాణధారి బార్బరిక్'




బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించిన త్రిభాణధారి బార్బారిక్ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్, సన్ నెక్స్ ఫ్లాట్ ఫాంలో అక్టోబర్ 10 నుంచి అందుబాటులో ఉంటుంది. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, ఉదయభాను, సాంచీ రాయ్, క్రాంతి కిరణ్ వంటి వారు నటించిన ఈ మూవీకి ఇన్ ఫ్యూజన్ బ్యాండ సంగీతాన్ని అందించింది. టెక్నికల్‌గా మూవీ హై స్టాండర్డ్స్‌లో ఉందని అందరూ ప్రశంసించిన సంగతి తెలిసిందే. మేకర్ మోహన్ శ్రీవత్సకు, నిర్మాత విజయ్ పాల్ రెడ్డికి 'త్రిబాణధారి బార్బరిక్' అయితే మంచి పేరును తెచ్చి పెట్టింది. అందరినీ ఆకట్టుకునే ఈ హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను తప్పకుండా చూడండి.




## రూ.10వేలు లంచం (మొదటి పేజీ తరువాయి)

పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మధురానగర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం గ్రామ కార్యదర్శి నెల రోజుల నుంచి డబ్బుల కోసం పది వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు రూ.10వేలు ఇస్తుండగా ఏసిబి అధికారులు ప్రణాళికతో కార్యదర్శి లంచం స్వీకరిస్తున్న సమయంలో పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసిబి డీఎస్పీ విజయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను లంచం తీసుకున్న మొత్తం, సంబంధిత పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఏసిబి డిఎస్పి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, దీపావళి పండుగ సంధర్బంగా టపాసుల దుకాణాల పర్మిషన్ విషయంలో, ఇతర గవర్నమెంట్ అధికారులు లంచం అడిగితే ఏసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలన్నారు.

## ఓటరు జాబితా సవరణ (మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్‌ను ప్రారంభించే పని జరుగుతోందని, దాని అమలుపై ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటన కోసం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, జూన్ 24న బిహార్ ఎస్ఐఆర్‌ను ప్రారంభిస్తున్నప్పుడు ఇసి పాన్‌ఇండియా ఎస్ఐఆర్ కోసం తన ప్రణాళికను ప్రకటించిందని కుమార్ చెప్పారు. ప్రక్రియ కొనసాగుతోందని, వివిధ రాష్ట్రాలు తమ తమ ఎస్ఐఆర్‌ను ప్రారంభించే తేదీలను నిర్ణయించడానికి ముగ్గురు కమిషనర్లు సమావేశమవుతారని ఆయన అన్నారు. కాగా, ఈనెల ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఇసి ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులను (సిఇఒలు) రానున్న 10నుండి15 రోజుల్లో ఎస్ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండాలని కోరారు. చాలా రాష్ట్రాలు 2002–2004 మధ్య ఓటరు జాబితాలో చివరి ఎస్ఐఆర్‌ను కలిగి ఉన్నాయి. రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం (యుటి)లోని చివరి ఎస్ఐఆర్ ప్రకారం ప్రస్తుత ఓటర్లను ఓటర్లతో మ్యాపింగ్ చేయడం చాలా రాష్ట్రాలు దాదాపు పూర్తి చేశాయి.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com